పుష్పవిలాపం

489

ప్రతిబింబాలు

(కథానికలు)

(సంకలనం)

కథా నిలయం
489
శ్రీకాకుళం

సంకలనం

దాసు బాబు

సి. ఎల్. ఎస్. తెలుగు పబ్లికేషన్స్
నాంపల్లి స్టేషన్‌రోడ్, హైదరాబాదు-1

CHRISTIAN LITERATURE SOCIETY
Post Box 501, Park Town, Madras - 600 003.

Telugu Publications :
C. L. S. BOOK SHOP
HYDERABAD - 1.

© C. L. S.
First Printed 1977

Printed at Chandrasekhara Printing works, Hyderabad - 1.

ప్రతి బింబాలు....

ఇది మా తొలి ప్రయత్నం. యువతరానికి చెందిన క్రైస్తవ రచయితలను ఒక చోట సమావేశపర్చి ... వాళ్ళ భావాలకు ప్రతీకలుగా వుండే కథల్ని ఎన్నుకుని ఈ రూపంగా సమాజాని కందిస్తున్నాం.

యువతరం కొత్తగా ఆలోచిస్తుంది. జీవితాన్ని మరోకోణంలో నుంచి చూస్తుంది. సమాజంలో అడుగడుగునా ఉత్పన్నమయ్యే సమస్యల్ని నిశితంగా పరిశీలిస్తుంది. అందుకే... ఆ కోణం విమర్శనాత్మకంగానూ... విప్లవాత్మకంగానూ వుంటుంది.

ఈ కథల్లో జీవితం కనిపిస్తుంది. జీవిత సమస్యలూ, జీవితంలో కలిగే ఆరాటాలూ, పోరాటాలూ ఇందులో కనిపిస్తాయి. మానవులు గీచిన ఎల్లలూ, వాటికి ఆహుతి అవుతున్న మానవుల ఆక్రందనలూ, అహర్నిశం మనిషిని చుట్టుముట్టే జీవిత వలయాలూ ఇందులో కనిపిస్తాయి. కొన్ని కథలు మనల్ని ప్రశ్నిస్తాయి; కొన్ని కథలు మనకు జవాబు లిస్తాయి. అయితే - సమస్యలకు - ఇది పరిష్కార మార్గం - అని ఎవరూ బల్ల

గుద్ది చెప్పరు. పరిష్కార మార్గాలను అన్వేషించమని కథలు మనల్ని ప్రేరేపిస్తాయి.

ఈనాడు క్రైస్తవ యువతీ యువకు లెంతో మంది కలం పట్టారు. సజీవ భాషలో నడక సాగించారు. క్రైస్తవ తెలుగు - అన్న అప వాదును రూపుమాపించారు. పోతే - సమాజ శ్రేయస్సును అకాంక్షించి, సామాన్య మానవుణ్ణి ప్రభావితం చెయ్యగల రచనలు ఇంకా రావాలి. రచయితలు తమ దృష్టిని నలుదిశలా సారించి - జీవిత సమస్యల్ని, జీవిత విలువల్ని కథావస్తువుగా స్వీకరించి - సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించాలన్న ధ్యేయంతో ముందడుగు వెయ్యడం అన్ని విధాలా శ్రేయస్కరమే.

కొంతవరకు ఆ లక్ష్యాన్ని ఈ కథలు సాధించాయని పాఠకులు అంగీకరిస్తే - మా తొలి ప్రయత్నం ఫలించిందన్నమాటే! ఇందుకు మాతో సహకరించిన రచయిత లందరికీ మా ధన్యవాదాలు.

దా. బా.

విషయసూచిక

1.	నాన్నకు చెప్పాలి	... ...	1
2.	కాలి జోళ్ళు	... ...	21
3.	పెళ్ళి చూపులు	... ...	39
4.	సమాధి దగ్గర	... ...	43
5.	క్రొత్త ఇల్లు	... ...	49
6.	తప్పిపోయిన తండ్రి	... ...	55
7.	కొత్త దారి	... ...	68
8.	దేవప్రియ	... ...	74
9.	సుశీల వివాహం	... ...	79
10.	బహుమతి	... ...	85
11.	పిక్‌పాకెట్టు	... ...	90
12.	దీనికి జవాబేమిటి	... ...	95
13.	అమృత ఘడియలు	... ...	101

పిక్ పాకెట్

కుమారి జి. లలిత

మదరాసు

పారీస్ కార్నరులో బస్సుకోసం నిలుచున్నాను. కొండవీటి చాంతాడు లాగున్నది క్యూ. ఆఫీసులనుండి పుట్టపగిలినట్లు వస్తున్నారు జనం. కిలకిల నవ్వే కోమలాంగులు, జంటజడల జవరాండ్రు, సులోచనాల సుందరాంగులు, పిరమిడ్ కొప్పుల కలభాషిణిలు, గిరిజాల గిరికలు, కమీజుల కలకులు, బాలలు, ముగ్ధలు, ప్రౌఢలు, ముదివగ్గులు, నవనాగరిక నారీమణులు, సాంప్రదాయాన్ని అందిపుచ్చుకున్న సుదతులు, అలసి వసివాడిన వనితలు, అప్పుడే అరంగులం మేకప్పుతో మెరుస్తున్న మెలతలు, హ్యాండ్ బ్యాగ్గులతో, టిఫిన్ బాక్సులతో, వయ్యారంగ సయ్యాటలాడుతూ, సరాగా

లాడుతూ, తూలుతూ, పేలుతూ బస్సురాకకొరకు నిరీక్షిస్తూ, కాలక్షేపం చేస్తున్నారు.

గుమస్తాగిరిలో గానుగెద్దు బ్రతుకే అయినదని భారంగ కాళ్ళీడ్చు స్తున్న పురుషపుంగవులు, న్యాయానికి బురకాల్లాగ, నల్లకోటులతో నిలు నిలుచున్న న్యాయవాదులు, బ్యాంకులలో డబ్బు మూలుగుతున్న కాళీజేబు లతో, బిక్క ముఖాలతో వస్తున్న బ్యాంకు ఏజెంట్లు, వ్యాపారంలోని లాభ నష్టాలు బేరీజువేసే బిజినెసు వ్యక్తులు, అవ్వాయి సువ్వాయిగ తిరిగే కాలేజి విద్యార్థులు, పరిసర ప్రాంతాలతో ప్రమేయంలేని హిప్పీలు, గొట్టాల ప్యాంటులతో మోకాళ్లువంగని నీటుగాండ్లు. ఈ జనసమ్మర్థంలోనే ఏకాం తత కొరకు తహతహలాడే నవజంటలు, పట్టణం చూడవచ్చిన పల్లె వాసులు, పురుగు కొరుక్కతిన్న వేళ్ళతో వికారంగ, విషాదాన్ని కలి గించే కుష్ఠురోగులు, కాళ్లులేని కుంటివాడు. కండ్లులేని కబోదులు, శుష్కప వాసాలతో ఆస్తిపంజరాలులాగున్న అడుక్కనేవారు, పొట్టలో పుట్టబోయే బిడ్డ, చేతిలో చంటిబిడ్డ, ప్రక్కనో పసిబిడ్డతో ఓ దీనురాలు చేయి చాస్తుంది. దరిద్ర నారాయణుని ప్రతినిధులుగ వీరందరూ తమ సీనా లాపాన్ని పెచ్చు, తగ్గు స్థాయిల్లో శక్తికొలది ఆలాపిస్తున్నారు.

ఆ పేవుమెంటుమీదనే పైన కప్పులేకపోయినా, క్రింద గచ్చులేక పోయినా, చుట్టు మరుగులేకపోయినా సుఖ సంసారాల్ని చేస్తున్న సంసా రులు. మూడు రాళ్ళుపెట్టి మంటచేసి ఓ పెద్దబానను పొయ్యేక్కించారు. ఆ ముమ్మడి కుటుంబీకులు తలాచారెడు బియ్యంవేసి, అన్నం కమ్మగ కుత కుత ఉడుకుతున్నది. ప్రక్కనే చేపలపురుసుకు సరాళ్ళానంచే మసా లాను నూరుతున్నదో చిన్నది. కూని రాగాలు తీస్తూ ఓ బుడతతో పరాచికా లాడుతున్నాడో బుల్లోడు, సినిమాలో హీరో తానేనన్నట్లు. పాల కొరకు గావుకేకలు పెడుతున్నదో పసికందు. అల్లంత దూరంలో తీరు బడిగ కూర్చోని పేలుచూస్తూ ముచ్చట్లు చెప్పుకుంటున్నారు కొందరు

ఆడంగులు. పూలుకడుతూ, వచ్చేపోయేవారికి పూలమ్మ చూస్తున్నదో పడుచు, ఓ వారన చిలకమ్మతో చీటి తీయించి ఏమి లాభిస్తుందో వివరించే చిలుక జ్యోతిష్కుడు. వాడి ప్రక్కనే హస్త సాముద్రికం చూసే జ్యోతిష్కుడు. ఆ బస్సుస్టాపే ఓ "మినీ" ప్రపంచంలాగున్నది. వచ్చేపోయే బస్సుల్ని, టాక్సీలను, కార్లను, ఆటోలను చూస్తుంటే కండ్లు తిరుగుతున్నవి. ఇంతలో రానేవచ్చింది నేనెక్కవలసిన బస్సు. అంతవరకూ క్రమంగ క్యూలో నిలుచోనున్న వారు కట్టతెగిల చెఱువులోని నీరులా బిలబిలా పరుగెత్తి బస్సుకడ్డీలు పట్టుకొని ప్రేలాడేవారు, తోసి ఎక్కేవారు, ఒకడే తొక్కిడి. వెనకనున్నవారు ముందువారిని కుమ్మేతున్నారు. అదో చిన్న కురుక్షేత్రం లాగున్నది. ఆ సమయంలో అందరిలో సహనం చచ్చి స్వార్థమే తలెత్తింది. ఆ క్షణంలో ఆడా మగా భేదం లేదు. పెద్దా చిన్నా తారతమ్యంలేదు. శక్తుడు అశక్తుడు అన్న విభేదం లేదు. బలం కలవాడిదే రాజ్యం అన్న సిదాంతం అమలు పరుస్తున్నారు. చివరకు నేనూ ఎలాగో- అదోచిత్రమే- బస్సులో పడ్డాను. ఆదృష్ట వశాత్తు వెనకసీటులో నాకో బెత్తెడు స్థలం దొరికింది.

అంతవరకూ తలవంచి అలసటతో కండ్లు మూసుకున్న దానిని, యథాలాపంగ కండ్లు తెరచి చూచాను. కండక్టరెంత దూరంలో ఉన్నాడని, సరిగ్గా నా కంటి కెరుగుగ ఓ జుబ్బాప్రేలాడుతున్నది. అది ఓ తెల్ల జుబ్బా, ఖద్దరుజుబ్బా. దానికో ప్రక్కజేబు ఆ జేబు అంచు కొంచెం చినిగున్నది. జేబు నిండుగున్నది. ఆ జేబులోనుండి ఓ లెదరు పర్సు తొంగి చూస్తున్నట్లున్నది. పర్సు బరువుగున్నట్లున్నది. ఆ జుబ్బా వ్యక్తికి ఏమీ పట్టినట్టు లేదు. ఏదో లోకంలో ఉన్నట్లున్నాడు. వెట్టి బాగులవాడులాగున్నాడు.

నా పుర్రెలో ఓ పురుగు కదిలింది. జేబులు కొట్టడమంటే ఏమిటి? నా కెదురుగ నా కంటిముందు ఊగులాడుతున్న పర్సు నన్ను పిలుస్తున్న

ట్లున్నది. ఆ పర్సు తీసుకుంటేనో? నా చేతికి అందించినట్లున్నపుడు తీసుకోక పోవడం వెట్టితనం కాదూ?

మరోమారు కండ్లెత్తి ఆ జుబ్బాదారుని చూచాను. చూడబోతే అతనో వ్యాపారస్తునిలా వున్నాడు. మోసాలుచేసి లాభాలు సంపాదించి వుంటాడు. నల్ల బజారులో అమాయకుల్ని ఏమార్చివుంటాడు. ప్రభుత్వపు ట్యాక్సులు ఎగగొట్టి వుంటాడు. అటువంటివాడి డబ్బు తీసుకున్నా తప్పులేదు.

దురాశ ఆ పర్సును కొట్టేయాలన్నది. మెల్లగ మునివేళ్ళతో జేబు అంచును తాకాను. ఢాం అన్నశబ్దం. నా గుండె ఎగిరి గొంతులోకి వచ్చింది, గాబరాగా ఏమీ ఎరగనట్లు సర్దుక కూర్చున్నాను. ఓ ఒయ్యారి టిఫెన్‌బాక్సును బస్సు కుదుపులో క్రింతపడవేసింది.

హమ్మయ్య అనుకున్నాను, కండక్టరు సార్ ఇంకా బారెడు దూరంలో టికెట్లు ఇస్తున్నాడు. మరో మూడు స్టాపులు పోతే నా గమ్య స్థానం. నేను దిగిపోవాలి. ఎవరో ఇచ్చిన సదవకాశాన్ని చేజేతులా జార విడుస్తున్నానన్న బాధ. అది నెలాఖరు నాకున్న ఆస్తంతా నూరు పైసలు. అవసరానికి అక్కరకొస్తుంది. రేపు నెల గడవడానికి ఎవరినీ దేవురించనక్కరలేదు. సాహసే లక్ష్మి అన్నారు. ధైర్యంచేస్తే ఓ చిటికెలో జేబులోని పర్సు నా చేతిలో ఉంటుంది. నా కండ్లు ఆశగ ఆ పర్సునే చూస్తున్నవి.

'ఎంత నీచానికి ఒడికడుతున్నావ్? ఇంత దిగజారిపోయావే? ఛీ,ఛీ, డబ్బు ఈ రోజుంటుంది. రేపుపోతుంది దానికొరకింత కక్కుర్తా? అసలీ దుర్బాలోచన నీకెలా కలిగిందంట' ఓ మూలనుంచి మనస్సాక్షి అంకె వేసింది.

బస్సు ఆగింది. నేను దిగవలసిన స్థలం. నీరసంగ కాలు నేల మోపాను. నా వెనకే ఆ జుబ్బావ్యక్తి దిగాడు. కొంపతీసి అతనికి నా

మీద అనుమానం రాలేదుకదా? నా ముఖం పాలిపోయింది. ఇంటివైపు నడక సాగించాను. అతనూ నా వెంబడే వస్తున్నాడు. నాగుండె గతుక్కు మన్నది. తేలుకుట్టిన దొంగ అవస్థ ఇలాగే వుంటుంది కాబోలు. 'చూడమ్మా, ఇక్కడో అనాధ శరణాలయమున్నదట. ఎటువెళ్ళాలి?' ప్రశ్నించాడు. నేను తెల్లముఖం వేసాను. అతను చెప్పుతున్నది నా అదురులో సరిగా వినిపించలేదు. అతడు మరలా అదేప్రశ్న వేసాడు. కొంచెం తేరుకొని 'ఉన్నదండి ఆ ఎడమప్రక్క సందులో వెళ్ళితే, రెండు ఫర్లాంగుల దూరంలో కనిపిస్తుంది' అన్నాను.

'అక్కడో పాపాయిని చూడాలి' అని తనలో తాను గొణుగుకుంటూ, పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ వెళ్ళిపోయాడు.

నేనలాగే నిలిచిపోయాను ఈ లోకపు చట్టానికి, న్యాయ మందిరానికి నేను పట్టుబడక పోవచ్చు. కాని, కాని, భగవంతుని ఎదుట నేను నిర్దోషినా? జేబుదొంగను కానా?

దీనికి జవాబేమిటి

పి. విక్టర్ పేదరాజు
హైదరాబాదు

మనసులోని బాధను కొందరితో చెప్పుకుంటే హృదయ భారం తగ్గిపోతుందంటారు. అందుకే యిది రాయాలని బుద్ధి పుట్టింది.

ఆ రోజు పెళ్ళివారు నన్ను చూట్టానికి వచ్చారు. ఆ దృశ్యం ఇంకా నా కళ్ళముందు మెదుల్తూనే వుంది. మొత్తం ఐదుగురొచ్చారు, అతనూ వచ్చాడు. పేరు రవీంద్ర. బియ్యే చదివి యేదో ఆఫీసులో పని చేస్తున్నాడట. మనిషి అందంగా వున్నాడు. నిండుగా నవ్వుతూ కొత్తా పాతా తేడా యేమి లేకుండా అందర్నీ పలకరిస్తూ ఎంతో ఆప్యాయతను సృష్టించాడు. నేను వారికి కాఫీ అందించేటప్పుడు నా పైపు అదోమాదిరిగ

చూశాడు. ఆ చూపుల్లో యేదో ప్రత్యేకత వుంది. ఎంతసేపైనా అతని వైపే చూడాలనిపించింది. నేనలాగే వున్నానేమో-

"కాఫీ పుచ్చుకోమన్నారా-" అని నన్నడిగాడు చేతులు ముందుకు చాపుతూ. నేను తడబడ్డాను, అతను నా వైపు అలాగే చూస్తుంటే. ఆ చూపులకు తట్టుకోలేక నా గదిలోకి వెళ్ళాను "పిచ్చిపిల్ల, ఇప్పుడే యింత సిగ్గయితే ఎట్లాగే..." అంది మా పిన్ని. నేను గదిలోకి వెళ్ళి తలుపు వేసుకొని మంచంమీద వ్రాలాను. మధ్యలో అతని ఛలోక్తులు, నవ్వులు కొసరుగా వినిపిస్తున్నాయి బాబాయితోను, పిన్నితోను అతనంత స్వేచ్ఛగా మాట్లాడుతుంటే నాలో ఆనందం వెల్లివెరిసింది. ఏవేవో తలంపులు అల్లిబిల్లిగా అల్లుకున్నాయి. నాకు తెలియకుండానే నాలో ఆశా సౌధాలు ఆకాశంలోకి ఎగసిపోయాయి. అతను బాగా పాడతాడని విన్నాను. నాకంటేనా!

ఎప్పుడో ఒకప్పుడు... ఏదో ఒక వనంలో...

రవీంద్రా నేనూ విహరించే సమయంలో...

"-నువ్వు కళ్యాణీరాగం ఆలపిస్తే వినాలనివుంది. ఏది...ఒక సారి..." అని అతనడిగితే-నేను పాడితే—

"మధురాతి మధురమైన గానం నన్ను ముగ్ధుణ్ణి చేసింది సుమా!' అని అతనంటే!!

ఇంతలో అతను గట్టిగా నవ్వి నన్ని ప్రపంచంలోకి పిలిచాడు. కిటికీ రెక్క తెరిచి చూశాను.

నా కోసం వెదకుతున్న అతని కళ్ళు నా కళ్ళల్లో నిలిచాయి. అదో మధురమైన అనుభూతి.

కాసేపయ్యాక అంతా లేచి నిలువబడ్డారు. మా బాబాయి నుద్దేశిస్తూ-

"మీరలా బస్‌స్టాండువరకూ వస్తారా?! అని, మా పిన్ని కేసి చూస్తూ, "వెళ్తా నమ్మా-" అని అతని నాన్నగా రన్నారు.

"వెళ్లొస్తామని అనండి అన్నయ్యగారు" అంది మా పిన్ని. ఆ సంబంధాన్ని ఖాయపర్చే యిష్టాన్ని వ్యక్తపరుస్తూ. రవీంద్ర నవ్వుకుంటూ చివరిసారిగా నావైపు చూస్తూ బయటకు నడిచాడు. బాబాయి వాళ్ళ వెంబడి వెళ్ళాడు.

వాళ్ళటు వెళ్ళగానే పిన్ని నా గదిలో కొచ్చింది. ఆమె రావడం గమనించి కిటికీ దగ్గర్నుంచి వెళ్ళి, మంచంమీద కూర్చున్నాను-పొంగివచ్చే ఆనందాన్ని అణచుకుంటూ, నా పేరెట్టి పిలుస్తూ పిన్ని నా దగ్గరకొచ్చి, ప్రక్కలో కూర్చొని, నన్ను తనవైపు త్రిప్పుకుంది. నేనంతగా ఆనందించడం, సిగ్గు దొంతరలలో మునిగిపోవడం అదేనేమో మొదటిసారిగా నన్ను చూడడం! కాసేపు అలాగే చూసి...

"...ఆబ్బాయి నీకు నచ్చాడా?" అని అడిగింది.

నాకు సిగ్గేసింది. తల ప్రక్కకు త్రిప్పుకున్నాను.

"దేవుడు చల్లగా చూసి, ఈ సంబంధాన్ని ఖాయం చేస్తే..."

ఈ మాటలకు పిన్ని కంఠం వణికింది. పిన్ని కళ్ళల్లోకి చూశాను. "నువ్వొక యింటిదానివై తే - మాక్కావలసిందేముందమ్మా - మీ యమ్మ నా కప్పగించిన బాధ్యతా తీరుతుంది, నువ్వూ ఒకదారి కొస్తావ్" అని అంది పైటతో కన్నీళ్ళు అద్దుకుంటూ. 'పిన్ని-ఏమిటిది, ఎందుకీ కన్నీళ్ళు!" అని అన్నాను. "లేదమ్మా కన్నీళ్ళు కావు. ఇన్నాళ్ళు ఎదురుచూసిన రోజు వచ్చింది. రవీంద్ర చాలా మంచివాడులా వున్నాడు. మీ యిద్దరికి ఈడు జోడు చక్కగా వుంటుంది, అని-గోడమీదున్న అమ్మ ఫోటోవైపు చూస్తూ-"మీ అమ్మ వుంటే ఎంత మురిసిపోయేదోనమ్మా-" అని అంది కాని-అమ్మకు, పిన్నికి తేడా నాకు కనిపించలేదు.

నేను ప్రాకులు తొడిగే రోజుల్లోనే అమ్మా నాన్నా నాకు దూర మయ్యారు. ఆనాటి నుంచీ నా పోషణ భారమంతా మా పిన్నీ, బాబాయి మీదపడింది. ఆస్తి, అంతస్తు లేకపోయినా పదిమందిలోనూ మాకు ఓ గౌరవస్థానం వుంది, నీతిగా, నిజాయితీగా మెలగడమే అందుక్కారణం. అందుకేనేమో మా బాబాయి మాటకు ఎంతో విలువ వుండేది. ఇంతకు మినహా మా కింకేమీ లెవ్వు. ఒకరికి చెయ్యి చాపకుండా, వున్నదానితోనే సర్దుకుపోవడం మా పిన్నికే తెలుసు. నిండుగా హుందాగా కనిపిస్తూ అమ్మలేని లోటు నాకు యే కోశానా కనిపించనివ్వలేదు. అందుకే పిన్ని కళ్ళలోనుంచి ఆనంద బాష్పాలు రాలడంలో ఆశ్చర్యంలేదు.

"ఏమిటమ్మా ఈ మనిషి ఎటు వెళ్తే అటేను. చల్లని కబురు విందామంటే ఇంతవరకూ రాడాయె" అని అంది, బాబాయి నుద్దేశిస్తూ. నా మనసులోనూ అదే ఆందోళన వుంది. పోతే పిన్నిలా పైకి అనే ధైర్యం లేదు!

బాబాయి ఎంతకీ రాకపోయేసరికి మేమిద్దరం వడ్డించుకున్నాం. ఆ పూట మా పిన్ని మాటలన్నీ నా పెళ్ళిగురించే! ఎంతో మురిసిపోతూ ఎన్నో మాటలు చెప్పింది, మధ్యలో తన పెళ్ళిమాటలుకూడా చెప్పింది... సిగ్గుపడుతూ. "ఎంత చదివినా, యేంచేసినా-తన జీవితంలో స్త్రీ కోరు కొనేది ఒక్క-టే-సుఖమైన సంసార జీవితం. ఇది మినహా తన జీవితంలో ఎలాటి కష్టాలొచ్చినా భరిస్తుంది. ఓపిగ్గా అన్నీ సర్దుబాటు చేసుకుంటుంది". నాకో రకంగా ఉపదేశం చేసే ధోరణికో అంది పిన్ని. నిజంగా-జీవితంలో వివాహం ఎంతటి కమ్మని కల!

భోజనాలు ముగించి మధ్యగదిలో కూర్చున్నాం - బాబాయికోసం ఎదురుచూస్తూ.

'మీ బాబాయి ఎప్పుడూ యింతేనమ్మా... సమయాసమయాలు గమనించనే గమనించడు. అయినా, రెండుదాటినా ఇంటిధ్యాసే లేదంటే

ఏమనుకోవాలి?' అని అంది గుమ్మంవైపు చూస్తూ. నేనేదో పత్రిక ముందేసుకొని కూర్చున్నాను. పేజీలైతే తిరుగుతున్నాయి గాని నా మనస్సంతా రవీంద్రమీదా, ఆ కబురు చెప్పడాని కొచ్చే బాబాయిమీదా వుంది. మరో అరగంట ఆలస్యంతో, అడుగులో అడుగు వేసుకుంటూ బాబాయి వచ్చాడు. బాబాయి అంత దీనంగా, అంత భారంగా వుండడం అదే మొదటిసారి. ఏ కారణం లేకుండా బాబాయి అలా వుండరు. ఆ స్థితిలో వారిని చూచేసరికి నా కెందుకో భయంవేసింది. నెమ్మదిగా మా దగ్గరకొచ్చి, ననో్నసారి చూసి-

"కాసిని మంచినీళ్లు పట్రామ్మా-" అని కుర్చీలో కూర్చున్నారు. నేను వెంటనే వంట గదిలోకి వెళ్ళి గ్లాసుతో నీళ్ళు తీసుకొని గుమ్మంలోకి వచ్చాను పిన్ని యేమిటో చెప్తుంటే క్షణంసేపాగాను.

"అదేమిటండీ-మన తాహత్తు యేమిటో వాళ్ళకు తెలియదా? మీరు ఆ మాత్రం చెప్పలేకపోయారా?" ఎంతో ఆవేశంగా అంది పిన్ని. 'చెప్పకుండా ఎలా వుంటాననుకుంటావ్: రెండు చేతులు పట్టుకుని బతిమాలానుకూడా అంతగాక పోయినా, నా శక్తికొద్దీ, ఒకటి రెండు నెలల్లో స్ధ్రుతాన్నాను కాని..."బాబాయి కంఠం రుద్ధమైంది."ఇంతకూ అబ్బాయి యేమన్నాడండీ, అమ్మాయి అతనికి నచ్చినట్టే వుందిగా?" పిన్ని రెట్టించి అడిగింది.

"ఏమంటాడు, తండ్రి చాటుగా పెరిగినబ్బాయి? మూడువేలయినా ముట్టకపోతే..." ఈ మాటలు వింటూనే నా చేతిలో గ్లాసు జారి క్రింద పడి ముక్కలు ముక్కలుగా పగిలిపోయింది.

అలాగే నా హృదయంకూడా.

"ఏమిటమ్మా-నువ్వికడే వున్నావా?" అంటూ పిన్ని ముందుకొచ్చింది. కాని లోపలకు వెళ్ళి తలుపు వేసుకొన్నాను. మూడువేలు కట్నం యిచ్చి అతణ్ణి చేసుకోలేను. అతనికేకాదు, ఎవరికీ యివ్వలేను.

నాన్నకు చెప్పాలి

దాస్ బాబు
హైదరాబాదు

నిర్మలంగా వున్న నీలి ఆకాశంలో ఎర్ర సిరా వొలికినట్టుగా వుంది.

ముత్తైదువు ముఖాన కుంకుమ బొట్టులా వున్నాడు సూర్యుడు.

చెరువుగట్టు క్రింద వున్న పొలంలోనుంచి పైకిలేచి ఎగిరిపోతున్న కొంగలు ఆకాశంలో పూసిన మల్లెపువ్వుల్లా వున్నాయి.

ఎంత స్వేచ్ఛ ననుభవిస్తున్నాయవి !

రోడ్డు కిరువైపులా వున్న నేరేడు చెట్లలోనుంచి దూసుకపోతున్న మా బస్సు ఆరుద్ర పురుగులా వుంది.

అంతే. నా పెళ్ళిచూపుల పర్యవసానం అంతే. నా ఆశాసౌధాలన్నీ కూలిపోయాయి. పెళ్ళిచూపులకు వాళ్లు వస్తున్నారని విన్నప్పుడు నాలో కలిగిన ఆనందం, వాళ్ళంతా మా యింట్లో కూర్చుని సాగించిన సంభాషణల సంతోషం, అతను నా కళ్ళల్లోకి చూస్తూ కలిగించిన ఆశలు, నా ఊహా లోక విహారాలు - కట్నం అనే పిశాచికి ఆహుతి అయ్యాయి. నాకిక మిగిలింది నిరాశ, నిస్పృహ...చాటుగా కన్నీళ్ళు, ఇలా యెంత కాలమో నాకు తెలియదు. కాని - ఏనాటికైనా ఈ కట్నాల బంధాలు తొలగిపోయి కన్నె పిల్లల కలలు పండే రోజులొస్తాయా? కట్నాల కోరికలతో కరుడు బారిన హృదయాలు యేనాటికైనా మారుతాయా? ఆశలు అడియాసలై కోరికలు అణగారిపోయి, కన్నీళ్ళతో కాపురం చేస్తున్న అభాగ్యుల తరపున-మీకు మనస్సాక్షి వుందా అని అడిగితే వారేం జవాబు చెప్తారు? ఆర్థిక స్థోమతులు తెలుసుకోకుండా, ఆడపిల్లల ఆస్తి కాశపడి, పెళ్ళి చూపుల పేరుమీద కన్నెపిల్లల జీవితం కన్నీటిమయం చేసేవారిని మీకు హృదయముందా - అని అడిగితే వారేమంటారు? దీనికి జవాబేమిటి?

అమృత ఘడియలు

ఇసాకోటి విశ్వాసం

విశాఖపట్నం

సమాజంలో అన్యాయం పేరుకుపోయింది. స్వార్థం ప్రబలి పోయింది వీటిని ఓడించి న్యాయాన్ని స్థాపించినవాడే సమాజానికి ఓ రూప కల్పన జరుగుతుంది. ఈ ఆశయంతోనే "లా" చదివాడు మధు, పౌరుషంగల క్రైస్తవ యువకుడు.

నీతికి నిజానికి మారుపేరుగా చెలామణి అవుతున్న రంగనాధం ప్లీడరు దగ్గర జూనియర్ ప్లీడర్‌గా చేరాడు.

క్లాస్‌రూంలో లెక్చర్లకూ, జీవితంలో ఎదురయ్యే సమస్యలకూ ఎక్కడా సంబంధంలేదని తెలుసుకొనేసరికి ఆరు నెలలు దొర్లిపోయాయి. కాలేజీలో-పుస్తకాలలో చదివినదంతా మర్చిపోయి, జీవితాన్ని రకరకాల

రంగుటద్దాల కోణాల్లోనుంచి చదివి అవసరమైన అనుభవం సంపాదించే సరికి మరికొంతకాలం మరుగున పడిపోయింది.

అందచందాలకు ఆశపడి, సంపాదన, సాంప్రదాయాలకు సంతోష పడి మామూలు మార్కెట్టుకన్నా ఓ ఐదు వేలు ఎక్కువ ఎరను చూపెడుతూ వచ్చే కట్నాల బంధాలనుంచి బయటవడటానికి మరో మూడు నెలలు ముగిశాయి.

మనస్సంతా వికలంగా వుంది. పార్కులో ఓ మూలన కూర్చున్నాడు మధు. ఆ చల్లనిగాలి, చక్కని పరిసరాలుకూడా అతనిలో ఆహ్లాదాన్ని కలిగించలేకపోయాయి. అందుకే ఒక నవల తెచ్చుకున్నాడు. అది చదువుతుంటే-ఏదో యింత ఉపశమనం కలగకపోతుందా-అని, హీరో హీరోయిన్‌ను ఏమిటో అంటున్నాడు. ఆమె ఏడుస్తుంది. "నన్ను మోసం చేశావు"-అంటాడు. "విలన్ని ప్రేమించలేదా?" అంటాడు. ఆమె సమాధానం-ఏడ్పు. "ఆన్యాయం" అంటుంది. ఎదిరించే శక్తిలేక ఏడుస్తుంది. నవలంతా ఏడ్పే. చిరాగ్గా దాన్ని జేబులో పెట్టుకున్నాడు. నవలకు తాను ఈ రోజు వాదించిన కేసుకు ఎంతో దగ్గర పోలికలున్నాయి.

కాలేజి లెక్చరర్, దేశాన్ని పదికాలాలపాటు పాలించే భావి నాయకులను తయారుచేసే లెక్చరర్‌కు తన భార్యమీద నమ్మకం లేదు. పెళ్ళి చేసుకొని సంవత్సరమైనా కాలేదు...ఆమెతో కాపురంకూడా చేయలేదు. ఇప్పుడు విడాకులు యిస్తానంటాడు. అదికూడా కోర్టులో న్యాయసమ్మతంగా జరగాలని అతని వాంఛ! ఆమె అపరాధం ఒక్కటే-తను అందంగా వుండటం. అందుకే-ఇద్దరి సహాయంతో అతను కోర్టులో హాజరయ్యాడు. సాక్షుల విచారణ లాంఛనప్రాయంగా జరిగింది. "కులట" అన్నారు. లెక్చరర్ ఆనందించాడు. ఆమెనుకూడా రప్పించారు. వసంత లాంటి అమ్మాయిల్ని అప్సరసల్ని చేయడంలో దేవుడు తన విద్యను మర్చిపోలేదనే భావన కలుగుతుంది. అందుకే అనుమానం. తనేమిటో చెప్పింది, అందరూ అనుమానించారు. రంగనాధం-తను మినహా.

రేపు అసలుసంగతి తేలుతుంది-అనుకొని అంతా వెళ్ళిపోయారు. ఇదే తన మనస్సులో నాటుకుంది. ఆమెను అనుమానించడానికి ఏ ఆస్కారమూలేదు - అందంగా వున్నదన్న ఈర్ష్య మినహా.

ఇవే ఆలోచనలతో మధు యిల్లు చేరుకున్నాడు. తొమ్మిది దాటింది. బల్లమీద భోజనంపెట్టి పనిమనిషి వెళ్ళివుంటుంది. రాజయ్య వరండాలో కునుకుతూ వుంటాడు. చిన్నగా మెట్లెక్కాడు. రాజయ్యలేడు. గదులలో దీపాలు వెలుగుతూనే వున్నాయి. లోపలకొచ్చాడు.

సోఫాలో ఎవరో కూర్చుని వున్నారు. మధుని చూసి ఆమె నిల బడింది. తెల్లబిచీర ఆ కాంతిలో మెరిసిపోతుంది. మధు ఒక్కడుగుకూడా ముందుకు వేయలేకపోయాడు. కారణం ఆమె...వసంత.

"మీకేమైనా అభ్యంతరమా?" వసంత పెదాలు కదిలాయి. మధు మందహాసం చేసి...సోఫా చూపించాడు. ఇద్దరూ కూర్చున్నారు.

మధు ఆమెవైపు చూస్తున్నాడు. లోలోపల అనుకున్నాడు.-పాపం వచ్చి చాలా సేపు అయివుంటుంది-అని.

మీకోసం సాయంత్రం ఆరు గంటలనుండి ఎదురుచూస్తున్నాను" అని అంది-తన మనస్సులో మాట బయట పెడుతూ

"ఏదో పనిమీద అలా వెళ్ళాను..." అనిమాత్రం అనగలిగాడు.

"మనస్సులేని మనిషిని మనిషిగా మార్చాలని ప్రయత్నిస్తున్నారు. వారు నన్ను అవమానించినప్పుడే మనస్సు పోగొట్టుకున్నా. కోర్టులో మీ తాపత్రయం వృధా అనిపించింది. నాపట్లమీరు చూపిన ఆదరాభిమానాలకు కృతజ్ఞత చెప్పుకొని వెళ్దామని వచ్చాను. వారికి కావలసిన విడాకులు ఇప్పుడే ఇచ్చేశాను-" అంది...వసంత పైటతో మెడను కప్పుకుంటూ.

మధు నిశ్చేష్టుడయ్యాడు.

"మీ భవిష్యత్తు?" ఇంతే మధు అనగలిగినమాట.

"అదేనాడో బండలై పోయింది." భవిష్యత్తులో ఏదో బావుకుందా మన్న ఆశ నాలో ఆరిపోయింది.....గడిచిన అనుభవాలను తలచుకుంటూ గడపటమే. నా జీవితానికి ఇంకేమి లేదు...ఆశ్చర్యంగా వుందా మీకు?"

సమాజంలో పేరుకుపోయిన స్వార్థానికి, అన్యాయానికి ఆమె ఓడిపోయింది. నిరాశ-నిస్పృహ-రెండూ రెండు కళ్ళలో నిండాయి. భారంగా రెప్పలు క్రిందకు వ్రాలాయి. "వారితోకాపురం చేయలేను. కేసు వదులుకోండి మిస్టర్ మధు. గుడ్‌నైట్." వసంత వెళ్ళిపోయింది.

అన్యాయాన్ని అన్యాయంగానే వుంచి, ఆమె తరపున కోర్టుకు వెళ్ళే భారం తప్పింది మధుకి. కాని-ఎన్నాళ్ళు యిలా సమాజం క్రుంగిపోతుంది? అన్యాయం ఇంకా ఎన్నిరోజులు పరిపాలిస్తుంది? ఏనాటికైనా న్యాయస్థాపన జరుగుతుందా? చరిత్ర ప్రగతిమార్గంలో పయనిస్తుందా?

ఈ ఆలోచనతో మధు తల వేడెక్కి అర్ధరాత్రి గడిచింది.

వెంటనే రంగనాధంగారి దగ్గరి వెళ్ళాడు. అక్కడే తెల్లవారింది.

లెక్చరర్ మరో యిద్దరితో తీవిగా కోర్టుకు వచ్చాడు. సానుభూతి గుసగుసలు వినిపించి జడ్జిగారి రాకతో సద్దుమణిగాయి.

వసంత-రంగనాధంగారు ఇద్దరు కలుసుకొని రావడంతో కొంచెం సంచలనం కల్గించింది. మధు కాస్త ఆలస్యంగా వచ్చాడు. నల్లకోట్లు సర్దుకొన్నాయి కుర్చీలలో. జడ్జిగారు తీరికగా వ్రాసిన తీర్పు చదివారు. అంతా కలిపితే ఒకటే-సమాజం అన్యాయంతో పేరుకుపోయింది. కాని ఈ సత్యాన్నే మరో విధంగా చెప్పారు "వసంత కులట విడాకులు ఇవ్వవచ్చు." వసంతవైపు వేలకళ్ళు తిరిగాయి. ఆమె తలను క్రిందకు దింపాయి.

మధు లేచాడు. జడ్జిదగ్గరకెళ్ళి ఏమో చెప్పాడు. రంగానాధం వసంతతో ఏదో చెప్పారు. తలపైకెత్తింది.ఆ చూపులో ఏ భావం గోచరించలేదు.

వసంత జీవితంలో తిరిగి వసంతం ప్రవేశించింది

మధు ఇంకా మందహాసం చేస్తూనే వున్నాడు.


వసంత, రంగనాధం ముందుకు నడచారు. జడ్జిదగ్గర అగారు.

వసంత తలెత్తి అందరిని ఒక్కసారి చూసింది. అందరి చూపులు అనుకోకుండానే నేలకొరిగాయి.

వసంత గతంలోనుండి వర్తమానంలోకి వచ్చింది. భవిష్యత్తులో బ్రతుకును పండించుకోగలననే విశ్వాసం తన కుంది.

అందరు చూస్తుండగనే వసంతా మధూ అలా నడిచిపోయారు. అవి ఆమె జీవితంలో అమూల్యమైన "అమృత ఘడియలు."

ప్ర తి బి ం బా లు



కథలు ! కథలు !!

యువతరం కలంనుంచి వెలువడ్డ కథలు

సమాజంలోని అసమానతలను తొలగించాలనే


ఈ తరం సంకల్పానికి సమరూపాలు !

వ్యవస్థా విధానానికి స్వస్తిపలికి స్వేచ్ఛా వాయువుల్ని

పీల్చాలని ఆశిస్తూ....మూఢనమ్మకాల సొలిగూడు

నుంచి బయటకు నడవాలి .... నడిపించాలి .... అనే

మనస్సుల ప్రతిబింబాలు !!



REFLECTIONS

By

DASS BABU

Price : 4-00

2

ప్రపంచమైతే విశాలంగా కనిపిస్తోంది కాని స్వేచ్ఛను ఆశించిన మాకు చారెడు స్థలమైనా దొరుకుతుందో లేదోనన్న శంక ఒక ప్రక్కన వుంది. అయినా... చిత్తశుద్ధితో తలపెట్టిన కార్యాలు జయప్రదమవుతా యంటారు. మానసికంగా నాలో చెలరేగిన గాలి దుమారాన్ని అణచి - ఈ నిర్ణయానికొచ్చిన తర్వాత కాస్తా మనసు కుదుటబడింది.

ఈ రెండు నెలల్లోనూ జరిగిన సంఘటనలు ఒక్కొక్కటి కళ్ళ ముందు మెదిలాయి.

మా బస్సు వంతె నెక్కింది. ఆ కాలువ చెరువునుంచి వస్తుంది. కాలవకవతల ప్రక్కనుండి చెరువుగట్టు కిందవరకూ వున్న మామిడితోట మాది. ఆ తోటలో చిన్న పెంకుటిల్లు వుంది మా తాతగారు కట్టించు కున్నారట. ఎందుకో గాని నాన్నగారికి అదంటే ఇష్టం లేదు. ఒకప్పుడు నాకూ ఉంతే. కాని మంగమ్మను మొదటిసారిగ అందులో కలుసు కున్నప్పటినుంచి మా కది పర్ణశాలయింది !

అదెంత మధురమైన రోజు !

నేను శ్రమపడి సంపాదించే బియ్యేతో నాన్నగారికి ప్రయోజనం లేకపోయినా - చిన్నబాబుగా రేంచేస్తున్నారంటే - పట్నంలో బియ్యే చదువు తున్నారు - అని చెప్పడం నాన్నకి సరదా. లక్షలాస్తి. నేనొ క్కణ్ణే. అందుకే పట్నంలో వున్న డాక్టర్ గారింట్లో విడిగా ఒక గది ఇప్పించి, కాలేజి చదువు పేరున నెలకు కనీసం అయిదు వందలైనా ఖర్చు చేస్తున్నారు. పట్నంలో వున్నంతసేపూ...నా పూచీ అంతా డాక్టర్ గారిది. ఇంటికొస్తే నాన్నగారిది. నేను స్వేచ్ఛగా వూపిరి పీల్చేది మా వూరికి, పట్నానికి మధ్యనున్న పదిహేను మైళ్ళ దూరంలోనే. ఆ మధ్య దూరం నాకు చాలా యిష్టం విశాలంగావున్న పొలాలు, గుబురుగా వున్నతోటలు, ఎప్పుడూ నీళ్ళతో వుండి నిండు చూలాలిగా కనిపించే చెరువు, గట్టు ప్రక్కలో వున్న పెద్ద పెద్ద బండలు, రంగులు మార్చుకొనే సూర్యుడు, ఎగిరే పిట్టలు, ఇవంటే నాకెంతో ఇష్టం. అందుకే వారంలో - శనివారం,

ఆదివారం శెలవల పేరుమీద మా పల్లె చేరుకునేవాణ్ణి. అలా రావడం పరిపాటి గనుక ముందుగానే మామిడితోటలో వున్న ఇంటిని శుభ్రంగా వూడ్చి, కుండలో నీళ్ళు పెట్టి ఓ మడత మంచం, బల్ల వేసివుంచేవాళ్ళు మా పాలేర్లు కొన్నిసార్లు మధ్యాహ్నం భోజనంకూడా అక్కడికే వచ్చేది. ఆరిటాకులో భోంచెయ్యడమంటే, సరదా. పప్పూ ఆవకాయ పచ్చడి నెయ్యిబొట్టూ, పెరుగూ వుంటే - వారానికి సరిపడేటట్టుగా భోంచేసేవాణ్ణి- పట్నంలో కక్కుర్తిపడకుండా. పచ్చి మామిడి కాయలు చెట్టుమీద నుంచి తెంచి, ముక్కలుగా తరిగి వుప్పూ, కారం అద్దుకొని తినడంలో వున్న ఆనందం, బాగా పండిన పండ్లను తినడంలో వుండేది కాదు అట్లాగే - వేరుశెనగ కాయల్ని చేలోనుంచి పీక్కొచ్చి, కుప్పగావేసి కాల్చుకొని తినడంలో తృప్తి వుండేది. పట్నంలో వుంటే ఈ రుచులే గుర్తుకొచ్చేవి. కాని - మంగమ్మతో పరిచయం ఏర్పడ్డాక ... కొత్త రుచులు తెలిశాయి అప్పటి నుంచి పట్నంలో రెండు రోజులు కూడా వుండబుద్ధి అయ్యేది కాదు. ఎప్పుడు వూరికి వెళ్దామా...ఎప్పుడు తోటకి వెళ్దామా...ఎప్పుడు మంగమ్మను కలుసుకుందామా అని మనస్సు వేధించేది.

అదెంత మధురమైన రోజు!

ఉగాది శెలవలకి ఇంటికొచ్చాను.

ఆ రోజు సాయంత్రం తోటకేసి బయలుదేరాను.

నాలుగు ఫర్లాంగులు నడిచి చెరువు గట్టెక్కాను. గట్టుపొడవు కనీసం రెండు ఫర్లాంగులైనా వుంటుంది. గట్టునానుకొని ఆరబరచినట్టుగా వున్న పెద్ద బండ. అక్కడక్కడ గుండ్రంగా వున్న పెద్దరాళ్ళు మెరిసి పోతున్నాయి. ఆ పెద్ద బండ ప్రక్కలో వున్న మామిడితోట మాది. నిజానికి - అక్కడకే వెళ్ళాలంటే పావుగంటలోనే వెళ్ళొచ్చు. కాని గట్టు మీద నడుచుకుంటూ, గాలంతో చేపలు పట్టేవాళ్ళ దగ్గర ఆగుతూ, బట్టలు ఉతికే వాళ్ళను చూసుకుంటూ చేపలను వేటాడే తీతుపిట్టల్ని చూసు

కుంటూ తోటకు వెళ్ళేసరికి అరగంటకి పైన అయ్యేది. ఆలవాటు ప్రకా రంగా గట్టుమీద నడుస్తూ వున్నాను.

గాలంలో చేపలు పట్టేవాళ్ళు ఎక్కువ మంది లేరు బట్టలు ఉదికే వాళ్ళు మూటలు కట్టుకుంటున్నారు. చెరువులో జలకమాడ బోతున్నాడు సూర్యుడు. బంగారు కిరణాలు నీటిమీద నుంచి పరుగెత్తుకొచ్చి గట్టుకు రంగులు వేస్తున్నాయి. ఆ రంగుల్లో మెరిసిపోతూ కనిపించింది మంగమ్మ మొదటిసారిగా. అప్పటికింకా ఆమె పేరు తెలియదు.

నిదానించి చూశాను.

మోకాళ్ళలోతు నీటిలో కూర్చొని స్నానం చేస్తూవుంది. ఎర్రగా వున్న పల్చటి రవిక వొంటికి అతుక్కొని పోయింది. అ భాగం ఎర్రగా, తక్కిన భాగమంతా తెల్లగా కనిపించింది. తలని ప్రక్కగా వంచి చూశాను. యౌవనం పొంగంతా ఆమె శరీరం వొంపుల్లో కొట్టొచ్చినట్టు వుంది. ప్రక్కనే మోదుగు పొద కనిపిస్తే దాని వెనుకకు వెళ్ళి మరుగు చేసుకొన్నాను.

ఆమె లేచి నిలువబడింది.

నడుంనుంచి మోకాళ్ళవరకూ వున్న చీరను వొంటిమీదనే కుప్పగా చేసి నీటినీ పిండి, జడను వదులుచేసి నీటిని దులుపుకుంటూ సూర్యుని వైపు తిరిగింది. చంద్రునికోసం ఎదురుచూస్తూ విరహతాపానికి తట్టుతో లేక తొందరపడి విచ్చుకుంటున్న కలువ పువ్వులా వుంది. ఆఖరి ప్రయత్నం అన్నట్టుగా కిరణాలతో ఆమెను బంధించాలని తాపత్రయపడు తున్నాడు సూర్యుడు.

జడను ముడివేసుకొని, వొంటిమీద నీటిని చేత్తో దులిపి మోకాళ్ళ దగ్గరున్న చీరె కొంగును పిండుకుంటూ గట్టుప్రక్కన వున్న పెద్దగుండ్రని రాయి చాటుగా వెళ్ళింది. నేను పెద్ద బండ ప్రక్కలో వున్న మా తోట

లోకి పరుగెత్తి, చెట్టెక్కి కూర్చున్నాను. అంతా క్షణంలో జరిగిపోయిన ట్లనిపించింది. చెట్టుకొమ్మను కాస్తా ప్రక్కగా వంచితే ఆమె స్పష్టంగా కనిపిస్తోంది

వొంటిమీద రవిక లేదు.

తెల్ల అంగవస్త్రం నడుముకు వుంది. అదీ ఆమె రంగులో కలిసి పోయింది. రవికను, చీరెను సూర్యుడికి వదిలేసి తను బండ్రపక్కలో దాక్కుంది. గోపికల వస్త్రాలను కృష్ణుడు అపహరిస్తే, ఏం చెయ్యాలో దిక్కు తోచక చూస్తున్న గోపికల్లాగా ఆమె సూర్యునివైపూ—ఎవరైనా వస్తున్నారేమోనని అటూ ఇటూ చూస్తూవుంది. ఎటూ చూడకుండా ఆమెనే చూస్తూవున్నాను నేను. అలా ఎంతసేపయిందో గాని నేను ఈ లోకంలోకి వచ్చేసరికి ఆమె రవిక వేసుకొని, చీరెకట్టుకొని, ఆంగ వస్త్రాన్ని జడకు చుట్టి కొప్పుముడిసి—అంతకు ముందు వుతికిన బట్టలను మడత వేసుకొని గట్టు క్రిందకు దిగింది. గూడెంకు వెళ్ళే కాలిబాటలో నడుస్తూ మా యింటివైపు వస్తోంది. గూడెంకు వెళ్ళాలంటే మాయింటి మీదుగా వెళ్ళాలి. చెట్టు దిగి ఇంట్లోకి పరుగెత్తాను. ఆమె దగ్గరకు వస్తున్న కొద్దీ నా గుండె వేగంగా కొట్టుకోవడం మొదలెట్టింది. ఎర్రరంకెలు, పిల్లుల అరుపులు గాలికివ్వూగే ఆకుల శబ్దాలు మినహా ఇంకేమీ వినిపించడం లేదు. ఇంటి ప్రక్కగా నడుచుకుంటూ నాలుగడుగులు వేసింది. అటూ యిటూ చూసి చేతికందిన మల్లొవా మామిడి కాయని కోసింది.

"ఏయ్—" అన్నాను అప్రయత్నంగా.

నా పంక చూసి హతాశురాలైంది.

కాసేపు తడబడి— చినబాబుగారూ—అంది. అంటే ఆమెకు నేను తెలుసునన్నమాట. ఆశ్చర్య మేమీలేదు. మానాన్నగారు ఆ వూరి కామందు. వైద్యానికయ్యే ఖర్చు దగ్గర్నుంచి పెళ్ళికర్చు వరకు నాన్నగారిదగ్గరే డబ్బు తీసుకొనేవాళ్ళు.

కాస్తా తేరుకొని, మామిడికాయ అక్కడే జారవిడిచి, గబగబా నాలుగడుగులు వేసింది.

"ఆగు—" గట్టిగా అన్నాను. ఆగి నావైపు చూసింది. 'ఆ మామిడికాయనిలా తీసుకురా—' ఆజ్ఞాపించాను. అడుగుతో అడుగువేసుకుంటూ మామిడికాయని తీసుకొని నా దగ్గరకొచ్చింది. లోపలకు వెళ్ళి మంచం మీద కూర్చుంటూ—

"అలా బల్లమీదపెట్టు—" అన్నాను అధికారంగా. ఆమె భయపడిపోవటం గమనించి—

"చెప్పేది నీక్కాదూ?" అని రెట్టించాను.

"పొద్దుగూకింది. గూడెంకెళ్ళాలి" అంది.

"గూడెంకెళ్ళేదానివి మామిడికాయనెందుకు కోశావ్? మర్యాదగా లోపలికొచ్చి అదక్కడపెట్టి వెళ్ళు." —ఇక తప్పదనుకుందేమో — నెమ్మదిగా లోపలికొచ్చి బల్లమీద పెట్టింది. జేబులో నుంచి చాకునుతీసి ఆమె ముందు గిరటేసి—

'కాయ చెక్కుతీసి ముక్కలుకొయ్యి' అన్నాను. ఎందుకు— అన్నట్టు చూసింది.

"ఆకలిగా వుంది తినాలి. తొందరగా ఇవ్వకపోయావో నిన్నే తినేస్తాను." అన్నాను, ఆమె కళ్ళలోకి చూస్తూ. చివరి మాటల్ని పట్టించుకోనట్టుగా నటిస్తూ—

"సినబాబుగారో... మేం గూడెం వాళ్ళం. అంటుపడతారుమీరు" అంది కులాన్ని గుర్తుచేస్తూ.

"అంటూ గింటూ నాకేం తెలియదు. నాక్కావలసిందల్లా ఆకలి తీరడం. ఊఁ, కానీయ్ త్వరగా—" అన్నాను ఆమె అందాన్ని పరిశీలిస్తూ. చాకుతో మామిడికాయను గబగబా చెక్కుతూ అమ్మో—అన్న

చిన్న కేక పెట్టి వేలివైపు చూసుకుంది. వేలు తెగింది. రక్తం కారుతూ వుంది. ఒక్క ఆంగవేసి, ఆమెవేలు లాక్కొని నోట్లో పెట్టుకొని జుపి కాను. బలవంతాన చెయ్యిని గుంజుకొని—

"అమ్మో—ఏంటిది? నన్నంటుకున్నారా?" అంది వణకిపోతూ.

"అంటుకోపడమేకాదు. నీ రక్తాన్ని పీల్చాను. ఏం....నాలోనూ, నీలోనూ వుంది ఇదే రక్తంగా—" అంటూ మళ్ళీ చెయ్యిపట్టుకున్నాను.

"అమ్మో—వొదలండిబాబు. ఎవరన్నాచూ తే కొంపకూల్తాది. నన్నొదలండి"అని పెనుగులాడింది. కాని—అప్పటికే నా రక్తం వేడెక్కింది. కాలుతో తలుపులు దగ్గరగా తన్ని, ఆమెను కౌగిట్లో బంధించి మంచం మీదకు తోసేశాను. ఏవో నాలుగు మాటలంటూ, నన్ను నెట్టి వెయ్యడానికి ప్రయత్నించింది కాని నా పట్టునుంచి తప్పించుకోలేకపోయింది.

అదెంత మధురమైనరోజు!

మంచం మీదనుండి నేను లేచేసరికి మంగమ్మ కనిపించలేదు. గూడేనికి వెళ్ళిపోయింది. మళ్ళీ రేపు వస్తుంది అన్న నమ్మకం వుంది.

ఆ రోజు ఉగాది.

సాయంకాలం వేపపువ్వు పచ్చడి, పిండివంటలూ, పాయసం అన్నీ వెదురుబుట్టలో పెట్టి పాలేరుతో తోటలోకి ముందుగా పంపించి, అయిదు గంటలకల్లా నేను చేరుకున్నాను. పాలేరును ఇంటికి పంపించి ఆమెకోసం ఎదురుచూస్తూ వున్నాను. వస్తుందో రాదో అన్న శంక లేకపోలేదు. కాని —తప్పకుండా వస్తుందన్న నమ్మకం వుంది.

సూర్యుడి వేడి తగ్గింది.

నా ఆరాటం హెచ్చయింది.

ఆరయింది. ఆమె జాడలేదు.

ఆమె మీద కసిపుట్టింది. ఎందుకు రాలేదో?

మొరటుగా ప్రవర్తించానా? ఏమో?

ఒక వేళ రాకపోతే? ఆబాధ భరించలే ననిపించింది. అయినా ఎన్ని రోజులు యిలా వస్తుంది! ఆమాటకొస్తే రేపు ప్రొద్దున్నే పట్నానికి వెళ్ళిపోవాలి. అంటే—ఎడబాటన్నమాట. అహ అలా కాకూడదు. ఆమె నా దగ్గరే వుండాలి. మొదటిసారిగా జీవితం అంటే యేమిటో దాన్నెలా అనుభవించాలో నాకు తెలిసింది ఆమె ద్వారానే. జీవితం ఆమెతోనే సాగి పోతే?

అడుగుల చప్పుడయింది.

గుండెదడ మొదలయింది.

గదిలో నుంచి బయట కొచ్చాను. ఆమె తంగేడు మండలను తల మీద పెట్టుకొని ఇంటి ప్రక్కగా నడుస్తూంది.

"ఏయ్—" పిలిచాను. ఆమె ఆగింది.

"నా పేరు మంగమ్మ" మూతి విరుస్తూ అని ముందుకు రెండడుగులు వేసింది.

"ఏయ్ మంగమ్మా వెళ్తావేం? ఆగు." ఆగింది.

"ఏం మామిడికాయ కోసుకురావాలా?" అంది నిన్నటి సంఘటన గుర్తుచేస్తూ. నేను తడబడ్డాను.

"ఱ...అబ్బే...అక్కర్లేదు. నీ కోసం వేపపువ్వు పచ్చడి పలహారాలు—అవి యివీ తీసుకొచ్చా—రా—" అని పిలిచాను ఆశగా.

"ఏంటి?" అని దీర్ఘం దీసింది.

"అదే— అరిశలూ, గారెలూ, పూర్ణాలూ—నీకోసమని..." ఆమె వస్తుందని నమ్మకంతో అన్నాను.

"ఓష్ ఇంతేగా—" అంటూ తల మీద వున్న మోపును క్రింద వేసి, చెంగుతో ముఖం తుడుచుకుంది. సంభాషణ పెంచాలని.

'ఏం—అవంటే నీ కిషం లేదా?' అని అడిగాను.

"లేదు" కాస్తా వెటకారంగా అని మళ్ళీ మోపు ఎత్తుకోబోయింది.

"ఏయ్ మంగమ్మా, రమ్మంటే వినిపించడంలేదు?" కాస్తాకోపంగా అన్నాను.

"పిలస్తన్నారా, అధికారం చెలాయిస్తన్నారా?" అంది కొంచెంగా. నాలో సహనం క్షీణిస్తుంది.

"ఒక్కసారి వచ్చిపో-" అభ్యర్థనగా అన్నాను.

"మీకేం మారాజులు, వచ్చిపొమ్మంటారు. వచ్చింతర్వాత యాడి కెల్లాలి?" నిష్ఠూరంగా వినిపించాయామాటలు. అయినా ఆ మాటల్లో ఎంత ఆర్థం వుంది? ఇంత తెలివిగా మాట్లాడటం మంగమ్మకు చాతనవుతుందా? అంటే - మా ఆస్తిని, అధికారాన్ని ఆసరాగా చేసుకొని-ఇలా అందిన అందాలన్ని అనుభవించి బయటకు నెట్టిస్తామనేగా ఆమె ఉద్దేశం? ఈ ఆలోచనల్లోనుంచి తేరుకొనేసరికి మంగమ్మ గదిలోకొచ్చింది?

నేను నమ్మలేక పోయాను?

ఆమెకూడా అంతే?

'అరె-నిజంగానే యియ్యన్నీ తెచ్చావే?' అంది ఆశ్చర్యపోతూ, పలహారాలవంక, నావంక చూస్తూ.

'అయితే...ఇవి లెవ్వనుకొనే లోపలకొచ్చావా..." తలుపు దగ్గర కేసి, మంగమ్మ దగ్గరకొస్తూ అన్నాను. ఆమె నవ్వింది. బుట్టలోనుంచి గారెలు తీసి ఆమె కందించాను. భయంగా చెయ్యి చాపింది.

"ఇంకా భయమేనా? అయితే వుండు...నేనే తినిపిస్తా" అంటూ నోట్లో పెట్టబోయాను. అమ్మో-అంటూ తల ప్రక్కకు తిప్పుకుంది జడ

నా చేతికందింది. జడపట్టుకొని దగ్గరకు లాక్కొని బలవంతంగా గారెను నోట్లో పెట్టాను. మింగలేక మింగుతూ నావైపు చూసింది.

స్వచ్ఛమైన సెలయేటి నీరులా వున్నాయా చూపులు!

అమాయకత్వం, అభ్యర్థన రెండు రెండు కళ్ళల్లోనూ మెరిశాయ్.

మంగమ్మను దగ్గరకు లాక్కొని మంచంమీదకు ఒరిగాను.

ఆ మధుర క్షణాలు ఎలా గడిచిపోయాయో నాకు తెలియదు. కళ్ళు తెరిచేసరికి, నిన్నటిలాగా కాకుండా, మంగమ్మ మంచంమీదనే వుంది. ఆ కళ్ళల్లో సంతృప్తి, పెదాలమీద చిరునవ్వు చిందులాడుతున్నాయి. గాలికి ఎగురుతున్న నల్లని ముంగురులు చందమామను దాచి పెట్టాలని ప్రయత్నించే నల్లని మేఘాల్లాగా వున్నాయి! మంగమ్మ గూడెంలో వుండ తగ్గ పిల్లకాదు నా గుండెల్లో కాపురం చెయ్యాల్సిన పడుచు!

ఆమె లేచింది.

నన్నుచూసి సిగ్గుపడుతూ తల దించుకొని మంచందిగి చీరె సరి చేసుకుంది. ఏమో చెప్పాలని నాకు వున్నా, వినాలని ఆమెకు వున్నా- నేనేమి చెప్పడంలేదు-ఆమె అలాగే మౌనంగా వుంది. చివరకు-

"రేపు పట్నానికి వెళ్తున్నా" అని అన్నాను. తలెత్తి నావంక చూసింది.

ఆ చూపుల్లో బాధా, భయం కనిపించాయి.

"మళ్ళి వచ్చే నెల వచ్చేస్తాగా?" అన్నాను-పరీక్ష లయ్యేవరకు రావొద్దని నాన్న చెప్పిన మాటలను గుర్తుచేసుకుంటూ. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. గుండెలో బరువైన రక్తమంతా కళ్ళలో గూడుకట్టు కున్నట్లనిపించింది. ఆమెకు చేరువగా వెళ్ళి ఒక చేత్తో తల నిమురుతూ, మరో చేత్తో ఆమె గడ్డాన్ని పట్టుకొని తల పైకెత్తాను.

11

"మంగమ్మా...పరీక్షలయిపోగానే రెక్కలు కట్టుకొచ్చి వాలతాను. ఇంక నిన్నెప్పుడూ విడిచిపెట్టను."

వర్షించడానికి సిద్ధంగావున్న మబ్బుల్లో మెరుపు కనిపించినట్టు ఆమె కళ్ళల్లో తళుక్‌మని కాంతిరేఖలు కనిపించాయి. అలాగే నా కాళ్ళ మీద పడింది.

"ఇదికాదు నీ చోటు-" అంటూ ఆమెను లేవదీసి గుండెకు హత్తుకున్నాను

అదెంత మధురమైన రోజు!

ఆ తర్వాత పట్నం వచ్చేశాను.

నెలరోజులు దొర్లిపోయాయి. పరీక్షలు మొదలయి మరో పక్షం రోజులు గడిచి పోయాయి. పరీక్షల్లో ఏమివ్రాశానో గుర్తులేదు. పరీక్షలన్నీ అయిపోయేవరకు అక్కడే వుండాలి గనుక, ఏదో ఒకటి పరీక్షలలో వ్రాయాలి గనుక - పరీక్షలు వ్రాశాను.

కాని-ఆ నలభై అయిదు రోజులు నరకాన్ని అనుభవించాను. మంగమ్మను పెళ్ళి చేసుకోవాలి. కాని - మా కులం, గోత్రం, ఆస్తి, అంతస్తు పరువు, ప్రతిష్ట - నాన్నగారి పెద్దరికం - ఇవన్నీ మా ఇద్దరి మధ్యా ముళ్ళకంపల్ని పాతాయి. నా కోసం చేతులు చాపిన మంగమ్మను చేరుకోవాలంటే ఈ ముళ్ళ కంపల్ని ఛేదించుకుంటూ ముందుకు పోవాలి. అలా వెళ్ళాలంటే ఒళ్ళంతా రక్తమవుతుంది. అవనీయి. మానవజన్మెత్తిన వాళ్లందరిదీ ఒకే రక్తమనుకుంటే - మా రక్తానికి తడిసి మొలకెత్తిన మొక్కలు పూలపాన్పులా మారతాయి. బాగా ఆలోచించిన తర్వాత ఈ సంగతి నాన్నగారికి చెప్పాలని నిశ్చయించుకున్నా.

పరీక్షలయిపోయాయి. క్షణంకూడా ఆలస్యం చెయ్యకుండా ఇంటికి వెళ్ళాను.

అప్పటికే బాగా పొద్దుపోయింది. ఎక్కడికి వెళ్ళారోగాని నాన్నగారింకా ఇంటికి రాలేదు.

మనసులోని ఆరాటానికి తట్టుకోలేక మంగమ్మను చూద్దామని గూడెంకేసి బయలు దేరాను.

చెరువు గట్టుకిందవున్న మా పొలాలనుదాటి, మామిడితోటమీదుగా గూడెం దగ్గరకొచ్చాను.

కూలిగింజలు తెచ్చుకొని రోట్లో వేసి దంచుతున్న శబ్దాలు

కారాన్ని నూరే రోకలి బండల రొదలు - కుక్కల అరుపులు-

ఆటకి వెళ్ళి చీకటయినా ఇంటికిరాని పిల్లల్ని పిలచే తల్లుల కేకలు-

అప్పుడప్పుడు మేకల అరుపులు వినిపిస్తున్నాయి.

గూడేన్ని మేఘం కమ్మిందా అన్నట్టుగా గుడిశెలలోనుంచి వచ్చే పొగ చుట్టూ ఆవరించివుంది. బుడ్డి దీపాలకంటె పొయ్యిలోమండే కట్టెల వెలుతురే ఎక్కువగా కనిపిస్తోంది.

దగ్గరగావున్న సిమెంటు బావిదగ్గర ఆగాను. ఇంతకూ మంగమ్మ ఇల్లెక్కడవుందో నాకు తెలియదు. అలా చాలాసేపు జాగారంచేశాను. ఇంతలో నన్ను గుర్తుపట్టిన పిల్లవాడెవడో వస్తే, మంగమ్మ విషయం వాకబు చేశాను. ఒకసారి బావిదగ్గరకు రమ్మని కబురు పంపించాను.

కొద్ది సేపట్లో కడవ పట్టుకొస్తున్న మంగమ్మ కనిపించింది.

కొద్దిగా లావయినట్టు, మరింత తెల్లబడట్టు, చుక్కలకాంతిలో మెరిసిపోతున్నట్టు కనిపించింది. దగ్గరకొస్తూనే-

"సినబాబుగారో, ఏంది ఈడ కొచ్చారు?" అంది కంఠంలో వణుకు వినిపించింది. భయంగా అటూ యిటూ చూస్తూవుంది.

"నిన్ను చూట్టానికివచ్చా. ఏం రాకూడదా?" అన్నాను. మంగమ్మ వెంటనే మాట్లాడలేదు.

"మీరు వస్తారనే యింకా పాణంతోవున్నా. లేకపోతే...ఎప్పుడో ఈ బావిలో పడి...

"ఛా. మంగమ్మా, అదేంమాట?" దగ్గరకు జరుగుతూ అన్నాను. ఆసల-నన్నుచూసి ఎగిరి గంతేస్తుందేమోననుకున్నా - అంతేగాని - ఇలా కంట తడి పెడుతుందని అనుకోలేదు. పరిస్థితేమిటో తెలియక అయోమయమైపోయాను. మంగమ్మ ఏడుపు ఆగలేదు.

"ఏం జరిగింది మంగమ్మ - ఎందుకేడుస్తున్నావ్?" ఆత్రంగా అడిగాను.

"ఏం జరక్కూడదో అదే జరిగింది. నాకు నెలతప్పింది" నాగుండె గతుక్కుమంది. వెంటనే ఏమీ మాట్లాడలేకపోయాను. అయినా - ఒక్క మంగమ్మే ఎందుకు ఏడవాలి? పాపంగానీ పుణ్యంగానీ-అది యిద్దరిదీను. ఎవరో ఒక్కరే ఎందుకు ఏడవాలి? అయినా-ఆమెను పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకున్నాక - బాధపడటం దేనికి? ఆ మాటే మంగమ్మతో చెప్పాను.

"భయపడమాక మంగమ్మ. రాత్రి నాన్నగారితో చెప్పి-పెళ్ళికి యేర్పాట్లు చేయిస్తా. నిన్ను పెళ్ళిచేసుకుంటా మంగమ్మా—"

ఆ మాటలు ఆమె హృదయాన్ని ఎంత తేలిక పర్చాయోగాని అలాగే కాళ్ళమీదపడి, పాదాలకు మొక్కి ఇంటికేసి పరుగెత్తుకు పోయింది...కడవని అక్కడే వదిలేసి.

నేను ఇంటికి వచ్చాను.

అరుగుమీద వాలు కుర్చీలో కూర్చొని చుట్ట తాగుతూ నాన్న కని పించారు."

"పరీక్షలెలా రాశావ్?" వారు నన్నడిగిన మొదటిప్రశ్న. జవాబు చెప్పాను-'మంగమ్మ విషయం ఎలా చెప్పాలా' అని ఆలోచిస్తూ.

"పరీక్షలయిపోయాయిగా, అల్లీపురం వెళ్ళి కరణంగారమ్మాయిని చూసిరాకూడదూ?" నాన్నగారి ధోరణిలో వివాహప్రస్తి బయటకొచ్చింది. మంగమ్మ విషయం చెప్పడానికి నాకు సందర్భం దొరికిందనుకున్నాను. నాన్నగారే మొదలేశారు "అమ్మాయిని నేనుచూశా. ఎడమకళ్లో కొద్దిగా మెల్లవుంది. వుంటే యేం...అది మనకే అదృష్టం అదృష్టంకాకపోతే యేంటి? రెండుమూడుతరాలు తిన్నా తరగనిఆస్తి-ఆమెను ఎవరు చేసుకుంటే వాళ్ళకాఆస్తి ధారాదత్తం కావాల్సిందే. ఒక్కతేగా?" నాన్నంటూ వుంటే-ఇంకెంత ఆస్తికావాలి? ఆస్తికోసం గుడ్డిదైనా కుంటిదైనా ఇంటి కోడలుగా రావొచ్చుననన్నమాట-నీ ఇష్టాయిష్టాలతో పనున్నట్టు లేదు-అని పించింది.

"ఇంటినీ, ఇంటి సాంప్రదాయాన్నిచూసి...మాట ఇచ్చివచ్చా. నువ్వెళ్ళి ఒకసారి చూసిరా"—కాపీగా అనేశాడు.

నిజానికి నాకు చాలాకోపం వచ్చింది. పెండ్లంటే కట్నంపేరున ఆస్తి సంపాయించడం మినహా ఇంకేమీ ఉన్నట్టులేదు. మనస్సు, మమత, అనురాగం-ఇవేవీ డబ్బుముందు నిలిచేటట్టులేవు.

"నువ్వింతగా ఆలోచించే పనికూడా లేదు. త్వరలోనే పెళ్ళికి ఏర్పాట్లు చేయిస్తానని మాటకూడా యిచ్చివచ్చా—" నాన్నగారి మాటలకి తట్టుకోలేకపోయాను.

"నా పెళ్ళికి మీరు మాటివ్వడమేమిటి? నాకోపెళ్ళొద్దు. నేను వేరే అమ్మాయిని చూసుకున్నాను—" ముక్తసరిగా అన్నాను. నాన్న ఉగ్రుడయ్యాడు. కస్సుమంటూ గట్టిగా ఏవో కేకలు వేశాడు. వాటిని లెక్కచెయ్యదలచలేదు.

"ఇది నా పెళ్ళి. నా ఇష్టప్రకారం జరగాలి"

"నీకేం ఇష్టం? నీకు జన్మనిచ్చింది నేను. నీ బాగోగులు చూసే అధికారం నాకుంది"

"పెళ్ళివిషయం వేరు నాకు నచ్చిన పిల్లను చేసుకొనే అధికారం నాకుంది."

"ఎవర్రా నీకు నచ్చినపిల్ల? ఎవరా అమ్మాయి? పట్నంలో ఎవరి ప్రేమలోనన్నా పడ్డావా?" ఎగతాళిగా వినిపించాయామాటలు.

"పట్నంలోకాదు. ఇక్కడే. మంగమ్మని...గూడెంలో వుంటుంది" తోకతొక్కిన త్రాచుపాములా కస్సుమంటూ నామీదికి లేచాడు నాన్న.

"రాత రాజ్యాలేలమంటే బుద్ధిగాడుదు లేలతాననన్నదంట. దరిద్రపు కూతలు కుయ్యమాక. గూడెంది ఈ యింటికి కోడలవుతుందా? ఊడిగం చేసేదా ఈ ఇంటి కోడలు?"

"ఇంటి కోడలి మాటేమోగాని, నాకు ఇల్లాలవుతుంది"

"నోర్ముయ్. ఇకాట్టె మాట్లాడావో.....నాలుక కోసి పారేస్తా-ఆ కులంలేని పిల్లరా నీ యిల్లాలు?"

"కులం. నన్ను చేసుకున్నాక నా కులం దానికబ్బుతుంది".

"అని నువ్వనుకుంటున్నావ్. దీన్ని ముట్టుకున్ననాడు నీకులం మట్టిలో కలిసిపోతుంది. అప్పుడు నవ్వూ అంటరాని వాడివై పోతావ్—తెలిసిందీ?"

"అంత తేలిగ్గా పోయే కులం నాకక్కరలేదు. ఆ మాటకొస్తే ఎప్పుడో పోతుందను కోవడం కాదు—మంగమ్మను నేను చేరదీశాను. ఆమెకు నెల తప్పిందట".

నాన్న ఆగ్రహానికి అంతులేదు. నిలువెల్లా దహించుకుపోతూ—

"దౌర్భాగ్యుడా, పాడుకూతలు కూయడానికి సిగ్గులేదు. నెల తప్పిందని నాతో చెప్తావా? ఎవడితో వెళ్తే నెలతప్పిందో కనుక్కొన్నావా?

"నాన్నా, మంగమ్మ విషయం నాకు బాగా తెలుసు. అనవసరంగా ఒక అమాయకురాలి మీద ఆభాండాలు వేయకండి"

"ఎవర్రా అమాయకురాలు? ఆస్తికాశపడి నిన్ను వలలో వేసుకున్న ఆ దొంగముండా అమాయకురాలు?"

"నాన్నా. మంగమ్మ శీలాన్ని గురించి అలా మాట్లాడకండి. నేను పెళ్ళిచేసుకుంటానని మాట యిచ్చాను. మీ కులంలో వుంచకపోయినా— ఆస్తి ఇచ్చినా యివ్వకపోయినా—ఆ మాట ప్రకారం జరిగితీరాల్సిందే-"

"ఎంతకు తెగించావురా? నేనెంత చెప్పినా వినవుగా. గూడెం వాళ్ళసంగతి నీకు తెలియదు. ఇంతెందుకు నీ మంగమ్మ సంగతే నీకు సరిగ్గా తెలియదు. కావాలంటే రేపు సాయంత్రం అయిదు గంటలకు మన మామిడితోటకు వెళ్లు. మంగమ్మ భాగోతం నీకే తెలుస్తుంది. అప్పుడొచ్చి చెప్పు నీ మాట సంగతి—"

మంగమ్మ మీద నాకేలాటి అనుమానంలేదు నాన్న సవాలును ఎదుర్కొడానికి నా కభ్యంతరం లేదు.

ఆ రాత్రంతా ఇదే గొడవ కళ్ళముందు సినిమాలా కనిపించింది. ఎప్పుడు నిద్రపట్టిందో నాకు తెలియదు.

తెల్లవారింది.

నేను లేచేసరికి ఎనిమిదయింది. అమ్మకానికని లారీలో మామిడి కాయని ఎత్తించి పట్నానికి వెళ్ళారట—నాన్నగారు. రాత్రి వారన్న మాటలు గుర్తుకొచ్చి మనస్సును మరింత వికలంచేశాయి. చాలాసేపు తర్కించుకున్న తరువాత నాన్నగారు కోపంకొద్దీ మంగమ్మను శంకించారే గాని లేకపోతే మంగమ్మ అలాటిది కాదు అని నిర్ణయించుకొన్నా, అలాగయితే— ఈ రోజు సాయంత్రం అయిదు గంటలకు మామిడితోటకు వెళ్ళి మంగమ్మ భాగోతం చూడమన్నాడు. అంటే ఏదైనా సందర్భంలో నాన్నగారి కంట పడిందా? అంత ఖచ్చితంగా ఎలా చెప్పాడు? ఒకవేళ నాన్న చెప్పిందే నిజమేమో? ఛా. ఛా. మంగమ్మ అలాంటిది కాదు. అంత

నీదానికి ఎప్పుడూ దిగజారిపోదు. ఒకవేళ అలాగే జరిగితే—ఆ రోజు మామిడికాయను చెక్కిన చాకుతో పీకను చెక్కిపారేస్తా.

సాయంత్రం అయిదయింది.

వెళ్ళాలా వద్దా అన్న సందిగ్ధంలోపడి కాస్త జాప్యం చేశా. అయినా ఎందుకయినా మంచిదని, అనుమానం నివృత్తమవుతుంది కదా అని తోటకి బయలుదేరాను.

వేసంగి కుప్పలు నూర్చాక పొలాలు ఎండిపోయి ఎర్రగా ఉన్నాయి. మనుష్య సంచారం అట్టే లేదు. మిగతా వేవీ గమనించకుండా తోటలోకి వచ్చాను చెట్లమీద నుంచి కాయలతా దింపేశారు. తోట బోడిగా వుంది. చెట్ల వైపు చూడబుద్ధి కాలేదు. ఇంటికేసి బయలు దేరాను. తీరా ఇంటి దగ్గర కొచ్చేసరికి కిటికీలోనుంచి ఓ భయంకరమైన దృశ్యం కనబడింది. నా కళ్ళను నేనే నమ్మలేక పోయాను నాన్న చెప్పింది నిజమే.

అర్ధనివస్త్రయై మంగమ్మ మంచం మీద వుంది. ఆమెతో మా తోటకాపలావాడు పెనుగులాడుతూ వున్నాడు.

క్షణం నా కళ్ళు బైర్లు కమ్మాయి.

కాలికింద భూమి కంపించి పోయింది.

ఆకాశం విరిగి మీదపడినట్లయింది.

చెట్లన్నీ ఒక్కసారి వూగి సుడిగాలిలో నన్ను గిరగిరా త్రిప్పి నేల కేసి కొట్టినట్లనిపించింది.

"బాబూ—నా మానం రచ్చించండీ—బాబూ' మంగమ్మ కేకలు వినిపించాయి.

ఒక్క దూకులో వరండా ఎక్కి తలుపును తన్నాను. గొళ్ళెం వూడిపోయింది.

సాయిబు జుట్టుపట్టుకొని లాగి ప్రక్కకు నెట్టేసి నా కాళ్ళమీద వచ్చి పడింది మంగమ్మ. సాయిబు నన్ను చూసి వణికిపోతున్నాడు.

మంగమ్మ వంక చూశాను.

"బాబూ...నువ్వు రమ్మన్నావని పిలిస్తే...తీరా ఊడకొచ్చాక... ఈ ముదనష్టపోడు...ఇట్లా..." రొప్పుతూ అంది మంగమ్మ.

ఇకాట్టే ఆలోచించే సహనం పోయింది.

ఎగిరి సాయిబును ఒక్క తన్ను తన్నాను. వాడు క్రిందపడ్డాడు. ఆ కోపంలో ఎంత కోట్టానో నాకు తెలియదు. అప్పటికీ కసితీరక సాయిబు గుండెలమీద కూర్చొని చాకు తీశాను.

'చెప్పు ఏం జరిగిందో చెప్పు - పొడిచి పారేస్తా' - అంటూ చాకు పైకెత్తాను.

. దండం పెడతా హుజూర్...సంపబాకండి. పొద్దుగాల పెద్దబాబు పిలిచి గిట్టా చెయ్యమండు. సారా తాగమని ఈ పది రూపాయలుబీ ఇచ్చిండు - నాకేం తెలియదు - సంపబాకండి' - అన్నాడు.

అయితే ఇదంతా నాన్న పన్నాగమన్నమాట. అందుకే పన్నెండు గంటలకు వెళ్ళి భాగోతం చూడమన్నాడు. ఎంతకు తెగించాడు? నిష్కారణంగా ఒక అమాయకురాలి జీవితం నాశనం అయ్యేదే. ఏం మనిషి? ఇంత నీచానికి ఒడిగడతాడా? పైగా గూడెం వాళ్లకు నీతి నియమాలు లేవని వాదిస్తాడా? వాళ్ల నీతిని నియమాన్ని మంట గలిపిందెవరు? వాళ్ళ మానాన్ని బలి చేసిందెవరు? పేదరికాల్ని ఆసరాగా చేసుకొని వాళ్ళను ఆట బొమ్మల్లాగా మార్చివేసిందెవరు? ఏనాటికీ సమాజంలో అడుగు బెట్టనీయకుండా, గూడేనికే ముడిబెట్టి వాళ్ళను బానిసల్లాగా మార్చివేసిందెవరు? తరతరాలుగా వాళ్ళను కాలిచెప్పుక్రింద రాసివేస్తూ పశువులకంటే హీనంగా చూస్తుందెవరు? కులంపేరు మీద కళ్ళు మూసుకపోయి సమాజ

మఁతా కుట్టుకంపు కొట్టేలా చేస్తుందెవరు? ఆస్తిని, అంతస్తును చేతిక్కించుకొని అమాయక ప్రజల జీవితాలతో చెలగాటమాడుతుందెవరు?

నాన్న. కాదు—నాన్నను చేసిన సంఘం.

పట్టపగలే మానభంగం చెయ్యాలనుకుంది మంగమ్మను కాదు—మానవత్వాన్ని.

ఈ సంఘం ఎంతగా దిగజారిపోయింది? ఈ కలుషిత వాతావరణంలో మాకు భవిష్యత్తు లేదు.

మానవత్వాన్ని తాకట్టు పెట్టిన మనుష్యులతో మాకు పొత్తు కుదరదు.

ఈ ఊబిలోంచి బయట పడాలి.

ఈ కుళ్ళు కంపునుంచి దూరం కావాలి.

స్వేచ్ఛగా, ప్రశాంతంగా సుఖజీవనం సాగిపోయే చోటు కావాలి. అదెంత దూరమైనా సరే...అక్కడకు వెళ్ళాలి.

కులం గీచే ఎల్లలు లేని తావు కావాలి.

అధికారం తెచ్చే అనర్థకాలు లేని స్థలం కావాలి.

దాన్ని అన్వేషిస్తూ వెళ్దాం - ఎంతదూరమైనా సరే.

కనీసం మా సంతానమైనా అందుకు అంకురార్పణగా వుండేలా చేద్దాం. అవును. అంతే. మా సంతానంలో కొత్త సమాజం పుడుతుంది. ఈనాటి సమాజపు కుళ్ళును కడిగివేస్తుంది.

సొంబును వదిలేసి మంగమ్మ దగ్గరకు వెళ్ళాను.

చీరెతో మెడ కప్పుకుని ఏడుస్తూ వుంది.

నా చెయ్యి అందించి, ఆమెను చేతుల్లోకి తీసుకొని, కచ్చడం బండి

ఎక్కించాను. తిన్నగా యింటికి వెళ్ళి పెట్టెలో బట్టలు సర్దుకొని, బస్ స్టాండుకు వెళ్ళి బస్సు ఎక్కాం - స్వేచ్ఛను అన్వేషిస్తూ.

వంతెనెక్కిన మా బస్సు మరో మలుపు తిరిగింది.

పశ్చిమాన్న సూర్యుడు ఆఖరి కునుకు తీస్తున్నాడు.

ఒక ప్రక్కనుంచి చీకట్లు తరుముకొస్తూవుంటే మరో ప్రక్కనుంచి చంద్రోదయం కలుగుతోంది. ఆ వెన్నెల చల్లని కాంతులలో ప్రక్కనే వున్న నా భవిష్యత్తును చూసుకొని మురిసిపోయాను.

నాన్న ఎప్పుడైనా కనిపిస్తే నా నిర్ణయాన్ని - నాన్నకు చెప్పాలి.

కాలి జోళ్లు

మూర్తి
రాజమండ్రి

కొండమించి చూస్తుంటే చుట్టూవున్న ఎత్తయిన తాటిచెట్లూ, దూరంగావున్న మేడలూ, ఇళ్ళూ బొత్తిగా నలకల్లా కనబడుతున్నాయ్ బడాపెట్టుబడిదారుడి కళ్ళకి కనబడే సామాన్య ప్రజల్లాగ-మనుషులు మరీ ఇంత చిన్న కొంపల్లో నివసిస్తున్నారా? అని ఆశ్చర్యపోయేట్టుగా అవి తమ పరిమాణాన్ని తగ్గించుకొన్నట్టున్నాయ్. ఏమో, ఎవరికి తెలుసు! చిన్న మనసులతో ఎదగని హృదయాలలో మనమధ్య తిరుగాడే చిన్న మనుషులకి అంతచిన్న కొంపలు సరిపోతాయిలెద్దూ అన్పిస్తోంది. ఏదయినా ఇంతేనేమో. మనిషి ఎత్తుకు వెళ్ళినకొద్దీ అంతవరకు తన చుట్టూవున్న

ప్రపంచం, తన మనుషులు తనకంటే ఎంతో చిన్నవాళ్ళయిపోయినట్టూ, వాళ్లదసలు బ్రతుకే కానట్టూ ఊహించుకొంటాడు. అవును, అంతేమరి, గొప్పవాడికెప్పుడూ పేదవాళ్లు నలకల్లాగ, ఎలకల్లాగ అగుపడతారు.

మాటిమాటికి పరిపరివిధాల పరుగెట్టే మనసును అతి కష్టంమ్మీద అదుపులోకి తెచ్చుకొని దేవుడిమీద లగ్నంచేసి దీక్షగా మూడు ప్రదక్షిణలూ పూర్తిచేసి తీర్థప్రసాదాలు పుచ్చుకొని సింహాద్రి అప్పన్న సమక్షం నుంచి బయట పడ్డాను. బొత్తిగా టఫ్‌గా జరిగిన ఇంటర్వ్యూనుంచి గుబురు మీసాల్లోంచి గ్లూమగానూ, నిశితంగా చూసే ఆఫీసరు సమక్షం లోంచి బయట పడ్డంత రిలీఫ్ ఫీలయ్యాను ఇవతలి కొచ్చాక.

పళ్ళకొట్టువాడు పాడే ఆహ్వాన గీతాల్నుంచి, పిల్లలు ఆటవస్తువు లమ్మే ముసలమ్మ అభ్యర్థనల్నుంచి మెల్లిగ తప్పుకొంటూ, ఇంక తరువాతేం చెయ్యాలి అనే ఆలోచనల్ని మనసులో కప్పుకొంటూ నడుస్తున్నాను క్రిందికి. ఎంత ఎత్తుకి వెళ్ళినా దిగక తప్పదు క్రిందికి. ఎంత దేవుడి దగ్గరకెళ్ళినా మనిషి దేవుడు కాలేకపోతున్నాడు ఎందేత? ఏమో! మనిషే తను దేవుడిగా మారడానికి ఇష్టపడ్డంలేదో, లేకపోతే దేవుడే తన తోస్ని దేవుళ్ల జాతినీ పెంచుకోడానికి ఇష్టపడ్డంలేదో తెలీదుగాని దేవుడు దేవుడుగానే వుండిపోతున్నాడు. మనిషి మనిషిగానే మిగిలిపోతున్నాడు.

ఈ వ్యవస్థను మార్చడు - పాలమ్మకొనేవాడే ఒక్కచుక్కన్నా నీళ్లు కలపకుండా అమ్మడమంత కష్టం. కోర్టులో దబ్బిచ్చి నిలబెట్టిన సాక్షి అచ్చంగా నిజం చెప్పటమంత కష్టం.

అదంతే మరి; కుక్కతోక ఎప్పుడూ వంకరే. మెట్టుమెట్టుగ క్రిందికి దిగుతూ, అప్పుడప్పుడూ ప్లాట్‌ఫారాల్లా ఉన్న పెద్దమెట్లమీద కాస్సేపు నిలబడుతూ, ఎత్తుగా ఎదిగిపోయిన రేక సంపెంగ చెట్లనీ, వాటికి చిందర వందరగా అల్లుకు పోయిన తీగల తీరుతెన్నుల్నీ చూస్తూ, అందితే ఒకే ఆకో పువ్వో తెంపుకుంటూ క్రిందికి దిగిపోయాను. క్రిందకు వెళ్ళి ఆఖరు

మెట్లకి అవతలా, ఇవతలా ఉన్న గట్లను చూస్తే కాస్సేపు కూర్చోవా లని పించి అప్పటిదాకా కోసి పోగేసిన ఆకులూ, పూలు అక్కడే పారేసి, ఇక్కడ ఎంత సేపు కూర్చున్నా నిడ పోదు అనే చోటు చూసుకొని కూర్చున్నాను కాళ్ళు క్రిందికి వేళ్ళాడేస్తూ.

నేను కూర్చున్నది రాయి.

నాకాలికింద వున్నది మెట్టులా చెక్కిన రాయి.

మరి గర్భగుడిలో వున్నది?

ఎక్కడ ఉంది ఈ మెలిక? గుడిలో వున్న ఆ రాయికి ఆ ప్రభావం, వైభవం ఏమిటి? ఇక్కడ నేలమీద చచ్చిన పాములా పరచుకొన్న ఈ రాయికి ఈ కాలి దెబ్బలేమిటి? ఏదో వుంది ఈ రెంటి మధ్య. అదే, ఏమిటది? ఇది తెలిసిపోతే అంతా తెలిసిపోయినట్టే. అయితే ఎవరు విప్పుతారీముడి?

మనుషులా? లేక మనుషులు చేసిన దేవుడా?

అస్తవ్యస్తంగా వస్తూపోతున్న ఏ ఆలోచనని ఖచ్చితంగా నిలద్రొక్కలేక, ఏ నిర్ణయాన్నీ స్థిరంగా చేయలేని నేను. చేతిలో గుర్తులున్న ఓటు వైపు చూస్తూ ఏ గుర్తు మీద ముద్రవేస్తే తనకు అయిదేళ్ళు స్థిరమైన మేలు జరుగుద్దో, తెముల్చుకొని, తేల్చుకోలేని సామాన్య ఓటరు మనఃపరిస్థితిలా కొంచెం పజలింగ్ మూడ్‌లో వున్నాను.

సరిగ్గా అప్పుడు,

"బాబూ, కొబ్బరి నీల్లాగుతారేంటి" అని అడిగాడు ఎదురుగ్గా పెద్ద కొబ్బరి బొండాల గుట్ట పేర్చుకొని ముచ్చికలు నేర్పుగా చెక్కుతున్న బ్రహ్మిసోలతను. అతని వైపూ అతని చెక్కుతున్న కత్తివైపూ చూశాను ఆలోచనలు మాని. వేళ్ళ లాఘవంతో అతి నేర్పుగా కాయను కత్తి కను సుగ తిప్పుతున్నాడు. గీత గీసినట్టు గుండ్రంగా చెక్కుతున్న అతని కత్తి

మహా పదునుగా వుంది. అది కొబ్బరి కాయలనే కాదు అవసరమైతే తల కాయలను కూడా చెక్కేంత పదునుగా వుంది.

"ఏంటి బాబూ కత్తొంక చూత్తున్నారు," సన్నగా నవ్వడం మొదలు పెడుతూ "ఇది మా యయ్యిది నువ్వుంచేసుకోరాని నాకిచ్చేసుండు" గుబురు మీసాలోంచి గర్వంగా నవ్వుతూ కత్తిమొనతో ఒక్క దెబ్బవేసి గుండ్రంగా రంధ్రంచేసి నీళ్ళతోవున్న బొండాన్ని నాకందిస్తూ అన్నాడు.

అవును అదే అయ్యుంటుంది. వాడి బాబు వాడికి గొడ్డలిచ్చి వుంటాడు. వీడికి కత్తి ఇచ్చాడు. వీడేమో వీడి కొడుక్కు చాకిస్తాడు. మరి వాడు వాడి సంతానానికి ఏమివ్వగలడు ? ఈ ఆలోచనతో తాగుతున్న నాకు చటుక్కున పొలమారింది. ఒక దగ్గు తెర చుట్టి కళ్ళంబడి నీళ్ళు తెప్పించింది.

ఈ పరిస్థితికి కళ్ళ నీళ్ళు తప్ప మరింకేమిటి గత్యంతరం?

"మెల్లిగా తాగండి బాబూ! దొస్సుకింకా శానాటయముంది," అభయ హస్తమిచ్చేస్తునట్టు, మీ తిరుగు ప్రయాణానికి నాది పూచి అన్నట్లు మాట్లాడాడు. ఆస్తులివ్వక పోయినా, ఆత్మస్థైర్యాన్ని ఇస్తుంటాడు భగవంతుడు ఇల్లాంటి వాళ్ళకి. దాన్నే పెట్టుబడిగా పెట్టుకుని వీళ్ళు జీవిస్తుంటారు. చొక్కా మీద పడకుండా జాగ్రత్త పడుతూ మెల్లిగా కొబ్బరి నీళ్ళు తాగుతూ ముందుకు చూశాను.

ఎదురుగా నున్న మర్రి చెట్టు నీడను వరుసగా కూర్చుని ఉన్నారు కొంత మంది యాచకులు. వారిలో కుడివైపు చివరగా కూర్చున్న వ్యక్తి కాషాయ గుడ్డలేసుకున్న ముసలి సాధువు. ఈ చివర కూర్చున్న వ్యక్తి అరె! తను కూడా నా వైపే చూస్తోందే తనూ అడుక్కునేదేనా? వ్యక్తి వాలకాన్ని బట్టి చూస్తే అలా లేదు. కాని ఆ వరుసలో కూర్చోవడం వలన అదే అనుకోవల్సి వస్తుంది.

ఆమెను ఆమె కూర్చున్న తీరునూ గమనిస్తే సూర్యసాంగత్యంలో ఒక వృత్తి, చంద్ర సాంగత్యంలో మరో వృత్తి నిశ్శంశయంగా నిర్వహించగల వ్యక్తిగా అన్పించింది. నా చూపులు తనవేపే నని గమనించిన ఆమె తనచూపుల్ని మరల్చుకొని ఎదుటి వరసలోకూర్చున్న ముసలమ్మను చూస్తూ పెదవులు కదలిస్తోంది. ఆ పెదవుల కదలిక కోపంవల్లో తాపం వల్లో మాత్రం తెలీలేదు.

మళ్ళీ వరుసంతటినీ ఆ వైపునుండీ ఈ వైపుకి చూశాను. ఆ చివర ముసలి సాధువు, ఈ చివర పడుచు వధువు. ఒకరు తల, ఒకరు తోక ఒకరు చల్లగా కన్పిస్తూ జీవిత చరమాంకాన్ని ఎత్తి చూపుతుంటే, మరొకరు వేడి కోర్కెల విషాన్ని కక్కుతూ ఇంతకు మించినది మరేం లేదు అన్నది పట్టి చూపుతున్నారు

అప్పుడు దేవతలు తెలివైన వాళ్ళయి క్షీర సాగర మధనానికి ఆదిశేషుని తోక కోరుకున్నారు.

మరి ఇప్పుడు ? ఆసలు ఆదిశేషుని తల భాగం ఆడదానిగానూ తోక భాగం ముసలి వాడిగాను ఉంటే దేవతలు ఏ భాగాన్ని కోరుకొనే వారు ?

అందం లేకుండా ఆకర్షణ పోనివ్వకుండా ఆకలికోసం అడుక్కొంటున్న ఆ నల్లటి ఆడదాన్ని గురించి నాకెంతో తెలుసుకోవాలనిపించింది. అందుకనే

"ఆ నల్ల పిల్లెలెరు?" కొబ్బరి కోసం కాయని విడగొట్టమని అతని కందిస్తు అన్నాను. అందుకొన్న కాయమీద కత్తి దెబ్బ వేస్తూ, "అది కక్కడ కత్తిబాబు" అన్నాడు. నా ప్రశ్న అర్థమయిపోయినట్లు నవ్వుతూ "దానిపేరు సత్తెవొతి. అందరూ సతీ అని పిలుస్తారు. నేనుమాత్రం కత్తే అంటాను. అది అడుక్కోదు. వుత్తినేకూకుంటాది. అలా కూకున్నందుకే దాని సంపాదన రెండు రూపాయల్దాకా వుంటాది రోజుకి. ఎంతయినా

ఆడది కదూ బాబూ" అంటూ, నేను అడగటానికి డెలికేట్‌గా ఫీలయ్యే విషయాల్ని కూడా చాల చెప్పాడు. కొబ్బరికాయల నాయుడు.

సత్తి ముసిల్దాని వంక కోపంగా చూస్తూ చేతులు తిప్పుతూ ఏదో అంటుంది ఇంకా. ఆదేమిటో స్పష్టంగా వినపట్టం లేదు కాని ముసలిది మాత్రం ఆవేవీ విన్పించు కోకుండా తన ప్రక్కన నేల మీద చతికిల బడి కూర్చున్న ఆరేళ్ళ పిల్లతో ఏదో చెబుతోంది.

ఆ పిల్లను చూస్తుంటే దరిద్రపు సంతానానికి ప్రతినిధులూ, లివర్ క్యూర్ వారి ఎడ్వర్‌టైజ్‌మెంట్లూ, వదులుగా కట్టిన బొగ్గుల మూటలూ గుర్తుకొచ్చాయి. ఆపిల్ల ముఖంలమ్మ చెపుతున్నదేమిటో వినిపించుకోకుండా, జతల వారిగా, వరుసగా పేర్చిన జోళ్ళనే మళ్ళీ మార్చి మార్చి పెడుతూ దిక్కులు చూస్తోంది. మధ్య మధ్య సత్తివైపు దొంగ చూపులు కూడా చూస్తోంది. కొబ్బరి కాయను రెండు పెచ్చులుగా విడగొట్టి, ఒకదాంట్లోకి మొత్తం కొబ్బరంతా చేర్చి కాయను చెక్కినప్పుడు వచ్చిన చెక్కల్లోచిం ఓదాన్ని తీసి స్పూన్‌గా చేసి నా కందిస్తూ "సూడు బాబూ! ఆ సత్తిది ఆ ముసిల్దాన్ని ఎలా తిడుతుందో?" అన్నాడు.

అవును! అదే నాకూ అర్థం కాలేదు. సత్తి ఎందుకలా కాలిన పెనంమీది నీటి బొట్టులా హైరానపడుతూ చుయ్‌చుయ్‌మంటుందో. ఏదో వుంటుంది. అడుక్కునేవాళ్ళు మనుషులు కారా? వాళ్ళకు మాత్రం పర్సనల్ విషయాలుండవా? అదేమిటో, సత్తి చిటపటలకి కారణమేమిటో నాయుణ్ణి కనుక్కోవాలి.

కొంచెం కొబ్బరి తిసి నోట్లో పెట్టుకుంటూ పిల్లవైపు చూశాను అప్పుడే ఆ పిల్ల గబుక్కున లేచి ముందుకు తూలినట్టుగా పరిగెత్తి "అమ్మగారు, అమ్మగారు మీ జోళ్ళిక్కడ పెట్టండమ్మ, అయ్యా మీ బూట్లిక్కడ పెట్టండి బాబూ, మళ్ళీ మీరు వచ్చేంతవరకూ చూస్తుంటాను"

అంటూ ఒక జంటకు ఎదురెళ్ళి వాళ్ళకు తను పేర్చిన జోళ్ళ జతల్ని చూపిస్తూ, బ్రతిమాలుతూ వాళ్ళతోపాటు వెనక్కు నడుస్తూ వస్తోంది.

"ఎంతిమ్మంటావ్ ?" ఆ పద్మాక్షి తన ప్రక్కనున్న ప్రేమసాగర్ వైపు చిరునవ్వులు ఒలక బోస్తూ అడిగింది. ఆమె ఆ ప్రశ్న పిల్లనే అడిగిందో, అతన్నే అడిగిందో తెలీదు గాని అతను మాత్రం ఆమె ఒలక బోసిన చిర్నవ్వుల్ని ఏరుకోవడంలో నిమగ్నుడై సమాధానమివ్వకుండా ఎంతివ్వమంటావ్ అన్నట్లు ఆ పిల్లవైపు చూశాడు, ఆ పిల్లకి సాధ్యమై నంత దూరంగాను పద్మాక్షికి సాధ్యమైనంత దగ్గరగాను జరుగుతూ.

"మీ ఇష్టం వచ్చినంత ఇవ్వండమ్మా" ఆ పిల్లకూడ తెలిసి పోయినట్టుంది పద్మాక్షిదే పైచేయని. అందుకే ఆవిడతోనే చెబుతూ మోకాళ్ళమీద కూర్చుంది తీసిన జోళ్ళు అందుకోవడం కోసం. ఏం చేదాం? ఇక్కడుంచేద్దామా ? అన్నట్టు ఒకర్నొకరు కళ్ళతోనే ప్రశ్నించుకున్నారు. ఆ రకం జంటలకి నోటికి హద్దేర్పడి పోయి, కళ్ళకి మాట్లాడే పవరూ, విషయాల్ని కమ్యూనికేట్ చేయగలిగే శక్తి పెరుగుతుం దనుకుంటాను. వాళ్ళలో వాళ్ళు శబ్దం లేకుండా మాట్లాడుకొని పద్మాక్షి మీడియం హీల్ జోళ్ళనీ, ప్రేమ్‌సాగర్ కరోనా కంపెనీ కట్ షూని మేజోళ్ళతో సహా పిల్లకి అప్పచెప్పి ఒకళ్ళు నొకళ్ళు రాసుకుంటూ కళ్ళతో మాట్లాడేసు కుంటూ, ఉత్తినే నవ్వేసుకుంటూ, నా కళ్ళ ముందు నుంచే దూసుకుంటూ రెండేసి మెట్లెక్కుతూ పైకెళ్ళి పోయారు.

ఆ పిల్ల ఈ రెండు జతల జోళ్ళనీ ఇందాకటి వరుసల్లో పెట్టి మళ్ళీ అన్నింటినీ ఒకసారి లెక్కెట్టుకుంది. ఉన్న జోళ్ళ లెక్కన తనకెంత వస్తుందో చేతి వేళ్ళమీద లెక్కేసుకుని తనలో తనే 'అమ్మో!' అని ఆశ్చర్యపోతూ ముసలమ్మ వైపుకి తిరిగి ఆదాయాన్ని గురించి కాబోలు చెబుతోంది. కాని ముసలమ్మ పిల్ల మాటలేవీ వినిపించుకుంటున్నట్టు లేదు. కాళ్ళు రెండూ దగ్గరకు లాక్కుని రెండు చేతుల్తినూ ఆ కాళ్ళను చుట్టి

పట్టుకుని తన మీద గొడుగులా విప్పుకుని మర్రి ఆకుల సందుల్లోంచి పైకి చూస్తోంది. పచ్చగా నూనె రాసినట్టు మెరుస్తున్న లేత మర్రి ఆకులు, కడిగిన అద్దంలా నల్లని రంగుతో స్వచ్ఛంగా మెరుస్తున్న ఆకాశం, ఇవేవీ ముసలమ్మ కళ్ళకు కాంతినివ్వలేక పోయినట్టున్నాయ్. దీక్షగా చూస్తున్న ముసలమ్మ కళ్ళు నిస్తేజంగా వున్నాయ్. తీరని కష్టాలకూ ఆరని కన్నీళ్ళకూ కమిలి నల్లబడిన ముసలమ్మ ముఖం మట్టి చెట్టు నీడపడి మరింత నల్లగా కనబడింది.

సత్తి ప్రక్కనున్నతనితో ఏదో చెబుతూ మధ్య మధ్యలో ముసలమ్మను చూపిస్తోంది. వాడు ఎదురుగ్గా కూర్చున్న ముసలమ్మనీ, తమ వరుసలోనే చివర్నకూర్చున్న సాధువును మార్చిమార్చి చూస్తున్నాడు.

ఏమిటో తెలీదుగాని సత్తి మహా మధన పడిపోతోంది. సత్తి సిక్రెట్ బాధకి సాధువు కూడ కారణమేమో అనిపిస్తోంది సత్తి ప్రక్కనున్నవాడి చూపుల్ని బట్టి. సాధువు కూడ వరుసకాని వాళ్ళతో స్నేహం చేస్తే - ఆ పొందు పోరుకే దారి తీస్తుంది అనడానికి సత్తి గొంతు పెద్దది కావడం ఒక కారణం.

"నేనెవరితో ఎలా పోతే దీనికెందుకు? ఇదేమన్నా నా గొడవల్ని ఆర్చేదా? తీర్చేదా? అమ్మో ఇలాంటి మందరలుండ బట్టే కాపరాలు కూలిపోతున్నాయ్" ముసలిదాన్ని నిశితంగా చూస్తూ తన ప్రక్క వాడితో అంటోంది సత్తి. ఇప్పటిదాకా నివురు కింద దాక్కున్న నిప్పు ఒక్కసారి గుప్పుమన్నట్టయింది. శీకాకుళం, యలమంచిలి, యర్రారం, ఇజీనగరం, ఒయ్‌జాగు ఇన్నాళ్ళు సూసాన్నేను. ఈ ఊళ్ళన్నింటిలోను ఇలాటి ముండలుంటే నేనేమన్నా నెగ్గుకురాగల్నా? నా మొగుడితో సంసారం సెయ్‌గలనా? సత్తి ఆగకుండా తన లోకజ్ఞానాన్ని పర్యటనానుభవాల్ని వివరించి చెబుతోంది. నేను కాబట్టి గదా ఇన్నాళ్ళూ తిరిగి ఇంత వరకూ నెగ్గుకు రాగలిగేను, అనే ధీమా వినబడుతోంది ఆమె కంఠంలో. ఇంట

ర్యాంలో ఉత్తర దక్షిణం రెండూ సంపాదించుకొని పోష్టు ఖాయం చేసు కొన్న కాండిడేటు యొక్క కాన్ఫిడెన్సు కదులాడింది ఆమె స్వరంలో. అలాటి సన్నా సువ్వెదిరి చడం ఆన్నట్టు చూస్తోంది ముసలమ్మవైపు.

ముసలమ్మను సత్తి ఎందుకలా అంటుందో, ఏమంటుందో కూడ అర్థం చేసుకోలేని పిల్ల మసలమ్మ ముఖంలోకి బేలగా చూస్తూ నిలబడి పోయింది. తల్లిచెయ్యి పట్టుకొని బజార్లోకి వెళ్ళి అక్కడ ప్రమాద వశాత్తూ తల్లినుంచి దూరమయి పోయిన ఒంటరిపాప దీనత్వం కనబడు తుందా పిల్ల కళ్ళలో. ఏదో అర్థంకాని అసహాయత కంటి కొలకుల్లోంచి తొంగి చూస్తోంది. ఆ భావంతోనే తననొకసారి చూసుకొంది. లేమివల్ల ఎండిపోయిన శరీరం, జబ్బువల్ల పెద్దదయిన పొట్ట, దాన్ని పూర్తిగా కప్ప లేని గౌను చిరుగులు పడిన ఆ గౌను సబ్బుముక్కని, నీటి చుక్కని చూసి ఎన్నాళ్ళవుతుందో అనేందుకు నిదర్శనంగా అది దాని అసలు రంగును పోగొట్టుకొంది. గౌను తెల్లబడాలనే ప్రయత్నం చేస్తే తెల్లబడు తుంది, కాని దాని ఆకారం పీలికలుగా మిగుల్తుంది.

సత్తి అలా ఎన్నంటూన్నా మాట్లాడక మౌనంగా లేచిన ముస లమ్మ తన కెదురయిన ఒక పిల్లల పటాలాన్ని తప్పుకొని సాధువువైపు నడుస్తోంది. ఆమె నడుస్తుంటే గడకర్ర కదుల్తున్నట్టుగా వుంది. చిక్కిన పాము తలవాల్చుకొని తోకమీద నిలచి డేకుతున్నట్టుగా వుంది.

ముసలమ్మని చూస్తూంటే చెయ్యని నేరానికి శిక్షపడిన ముద్దాయిని జ్ఞాపకం తెస్తుంది. అదేమిటో తెలిసికోవాలనే కుతూహలం అధికమయి పోయి అది పిల్లపిల్ల ఏమన్నా తెలుస్తుందేమోనన్న అభిప్రాయంతో ఆపిల్లను పిలవబోయాను, కాని ఆ పిల్ల చుట్టూరా ఇందాకటి పిల్లలు బెటాలియన్, ఆ బెటాలియన్ ఆఫీసర్స్, లెఫ్టినెంట్ సంతానవతి మేజర్ కుటుంబరావు అందరు గుమిగూడి ఆ పిల్లతో ఏదో మాట్లాడుతున్నారు.

ఆ పిల్ల వెళ్తున్న ముసలమ్మను చూపిస్తూ సంతానవతితో ఏదో

చెబుతోంది. అందుకని కొబ్బరి కాయల నాయుణ్ణి పలుకరించాను చేతిలోని కొబ్బరి పెచ్చు దూరంగా చెట్లలోకి విసిరేస్తూ.

"ఏవిటయ్యా! సత్తి ఇందాకట్నుంచి ముసలమ్మను ఒకటే దుమ్మెత్తి పోస్తుంది. దానికేం పిచ్చా?" నాకెందుకో సత్తి అంటే సదభిప్రాయం ఏర్పడలేదు.

"పిచ్చేబాబూ! కానది మామూలు పిచ్చికాదు మదపిచ్చి. నేను చెప్పానుకదు బాబూ అది సత్తికాదు కత్తి అని. మొన్నరేత్తిరి ఎవడికాడ తొంగుందో తెల్దుగాని, నిన్న రేత్తిరి దాని మొగుడు తాగొచ్చి తిక్క తీరిందాకా తాట ఒల్చేడట. 'అదిగో ఇక్కడ గొడవలన్నీ ఆ రిక్షా లాక్కునే ఓడికి ఎలా తెలుత్తాయ్? నా ఎలుగు సూళ్లేనోల్లెవరో కల్లల్లో నిప్పులోసుకుని, ఆడు కుంతేసుకొన్నాక ఎక్కించంటారు. అది ఈ ముసల్దే అయుంటాది' అని పొద్దున్నుంచి ఆ ముసిల్దాన్ని మేకుల్తో నేలకు దిగేత్తోంది." అని టూకీగా పూర్వగాధను కథగా చెప్పాడు నాయుడు. చెప్పేటప్పుడు నాయుడు కనురెప్పలు టపటపా కొట్టుకుంటున్నాయ్. నా వైపు అసలు చూడలేదతను.

ముసల్దినిజంగా సత్తి మొగుడుతో చెప్పుంటుందంటావా? అడిగాను నాయుణ్ణి. సమాధానం చెప్పడానికి నాయుడు నోరు తెరిచాడు. కాని ఇంతలో నాకూ, నాయుడికీ మధ్యలో పిల్లల బెటాలియన్, సంతానవతి, కుటుంబరావు... బిలబిలమంటూ పైకెక్కి పోతున్నారు. చంకలోంచి జారిపోతున్న చంటాడితో, కాళ్ళకడ్డం పడుతున్న చీరతో పైకి పిల్లలంత త్వరగా ఎక్కలేకపోతున్న సంతానవతికి మొగుడివైపు అందితే మింగేద్దామన్నంత కోపంతో చూసింది. కాని కుటుంబరావుకి తెలుసులావుంది ఆయన ఆపిడకు కాస్త దూరంగా ఉన్నాడు పైగా లావుగా కూడ ఉన్నాడు. వాళ్లు వెళ్ళడం మాకు గాలి కెరటం వీచి మబ్బుతెర దాటినట్టు అనిపించింది.

ముసల్ది దూరంగా వున్న పంపు దగ్గర నీళ్ళు తాగి చెయ్యి చిరుగుల చీరకు తుడుచుకొంటూ వచ్చింది. కూర్చున్న వాళ్ళని ఒక్కొక్కళ్ళనే దాటుకొంటూ వస్తోంది మెల్లిగా. తొందరగా నడిస్తే భూదేవి అదురుతుందని కాదుగాని నడిచే ఓపిక లేక. నాయుడూ, నేనూ, ముసలమ్మనే చూస్తున్నాము

నడుస్తున్న ముసలమ్మ కాళ్లు అకస్మాత్తుగా లేచిన మంటల్ని చూడ్డం వల్ల అన్నట్టుగా చూస్తున్న మా రెండు జతల కళ్ళూ ఉప్పుగాలి గుప్పని తగల్డం వల్లో అన్నట్టుగా ఒక్కసారి తమ పనుల్ని చేయడం మానివేసాయి. హోరుగాలిలా వచ్చిన సత్తి ముసలమ్మని చుట్టి "ఏమే నీకీ సింవాసెలం కొండమీద ఉందామని ఉందా? నేకపోతే నేదా? సెప్పు. నా కాపరంలో నిప్పులేద్దామని సూసావ్? నీకెన్ని గుండెలే" అంటూ ఉప్పుగాలి తగిలిన మంటలాగ గయ్యిమంటూ లేచింది.

ఇన్ని దేశాలు తిరిగి ఇంత మందితో కాపరం చేసిన నాకే ఒక్క గుండె అంటే నా మొగుడితో చెప్పి కొట్టించడానికి ఎలాంటి ప్రజ్ఞాలేని, రేపో మాపో పండిపోయే నీకు ఎన్ని గుండెలుండాలి? అన్న భావం ఆమె కళ్ళలో ప్రస్ఫుటమయ్యింది. ఆ ఆభియోగానికి ఏం చెప్పాలో తెలీక అయోమయంగా తలపైకెత్తి గుడి శిఖరం వైపు చూస్తోంది ముసలమ్మ. "మాట్టాడవేమె ముంగిలాగ?" ఆ మూలనుండి ఇదంతా గమనిస్తున్న సాధువు గబాగబా వచ్చి వాళ్ళిద్దరి మధ్యన నిలబడకపోతే సత్తి తోసిన తోపుకి ముసలమ్మ క్రింద పడిపోను.

"కొట్టినందుకు నీ మొగుణ్ణి అడక్కా ముసలమ్మను సతాయిస్తా వెందుకు? ఒళ్ళు తిమ్మిరెక్కి చేసిన వెధవ పనులు కప్పుకోడానికి నీకీ నోరు లేనిదే దొరికిందేమిటి? ఈసారి ఆశ్చర్యపోవడం గుడ్లప్పగించడం సత్తి పని అయింది. సాధువు ఇంత ధైర్యంగా ముసలమ్మను వెనకేసుకొస్తున్నాడని తెలిసి సత్తి 'కంగు' తిన్నట్టయింది. కాని అది ఎంతోసేపు కాదు. "ఏం దీన్ని ఎనకేసుకొత్తున్నావ్, ఎప్పుడన్నా ఎచ్చగా నీ పక్కతో

క్కాత్తుందనేమిటిఁ గురి చూసి విసిరింది. సత్తి సాధువునే కాకుండా అక్కడ కూర్చున్న అందర్నీ ఆశ్చర్యంగా ముక్కు మీద వేలేసుకొనేట్టు చేసింది అలానే వుంటే సత్తి ఇంకా ఎంత హీనంగా మాట్లాడేదో తెలీదు గాని నాయుడు కలగజేసికొని "ఏటా పదరబోతు వాగుడూ నువ్వూనూ. కాత్త ఎనకా ముందూ సూసుకొని మట్లాడాడు. నేకపోతే ఇక్కడుంటం కట్టం. ఎల్లెళ్ళు" అంటూ కళ్ళెర్ర జేసి చేసిన హెచ్చరిక సత్తికి చురకలా అంటుకొంది. కిమ్మనకుండా ముసలమ్మనూ, సాధువుని చూపిస్తానండండి నా తడాఖా అనేట్టు తన చోటులోకి వెళ్ళిపోయింది.

సర్కస్ కంపెనీవాడు కొరడా ఝళిపిస్తే అప్పటిదాకా పీటలమీద నిలబడి ఫీట్లు చేసిన జంతువులు తోకలు ముడుచుకొని వాటివాటి స్థానాల్లోకి వెళ్ళిపోయినట్టు ఆ ప్రదేశం అంతా నాయుడి మాటతో ఖాళీ అయిపోయింది.

దిగులుగా నిలబడిన ముసలమ్మ, బేలగా చూస్తున్న ఆ చిన్నపిల్లా, అయోమయంతో తనని తాను పరీక్షించుకొంటున్నట్టుగ కూర్చుని తెల్ల గడ్డాన్ని నిమురుకొంటున్న సాధువూ వీళ్ళు ముగ్గురూ నా మనసు నాక్రమించు కొన్నారు. వాళ్ళగురించే ఆలోచిస్తూ చాలసేపు పరిసరాల్ని గమనించకుండా వుండిపోయాను. చాలసేపు గడచిపోయినట్టుంది.

సంతానవతి కేకలు, పిల్లల అల్లరి, నన్ను మళ్ళీ పరిసరాల్ని గమనించేటట్టు చేశాయ్. ఎదురుగా ఆ పిల్ల చుట్టూరా సంతానవతి పిల్లలు గుంద్రంగా నిలబడి వున్నారు. వాళ్ళ మధ్య పద్మవ్యూహంలో ఒంటరి అయిన పక్షిలా అమాయకంగా నిలబడిపోయిన ఆ పిల్ల బక్కచిక్కిన రెక్క పుచ్చుకొని గుంజుతూ ఏమో ఎక్కడ పెట్టావే నా జోళ్ళు అని అడుగుతోంది సంతానవతి మాటలు మరచి పోయిన దానిలా ముసలమ్మ ఒంటిగా వున్నపిల్లనీ, చుట్టుముట్టిన పిల్లల్నీ, అధికారంతో చూస్తున్న సంతానవతిని ఉత్సుకతో చూస్తున్న సత్తి, ప్రేక్షకుల్లా కూర్చున్న

యాచకులు. ఇది క్షణం సేపు స్తంభించిపోయిన సజీవ దృశ్యం.

సంతానవతి కేకలోని కరుకుతనం, గుండె లాగటంలో బలహీనమైన జబ్బలోని జాయంటు కలుక్కుమనడం పిల్ల ఓర్చుకోలేని బాధలో కెవ్వు మనడం ఒక్కసారి జరిగాయి.

ఆ కేక నా గుండెలో తుమ్మ ముల్లును కసుక్కున దిగేసింది:

సత్తి కసికి స్వాగతం పాడింది.

ముసలమ్మ మౌనం దుఃఖానికి కట్టల్ని తెరిచింది.

ఇంత జరిగినా ఎవ్వరం నోరు విప్పి మాట్లాట్టం లేదు.

"మీ జోళ్ళను నేనెక్కడా పెట్టలేదండమ్మగారూ" బాధ నుండి కాస్పేపటికి తెప్పరిల్లి కళ్ళవెంట నీళ్ళు కార్చుకుంటూ అందాపిల్ల. ఎండి పోయిన బుగ్గల మించి వోరగా కారుతున్న కన్నీళ్ళను తుడుచుకొందామని ప్రయత్నించింది, కాని సంతానవతి ఆ పిల్ల చేతుల్ని వదలక "ఎక్కడ పెట్టలేదంటున్నావ్, ఇందాక నేనిక్కడ పెట్టిన జోళ్ళేమయ్యాయి మరి? అయ్యగారి బూట్లు, మా పెద్ద పిల్ల జోళ్లూ ఇచ్చి నావి దాచేస్తావా: దొంగముండా పట్రా అవెక్కడ దాచావో" మాట్లాడుతూనే చుట్టూ వెతుకుతూ కాళ్ళవైపు చూస్తోంది సంతానవతి. ఒంగుని బూటు లేసులు కట్టుకొంటున్న కుటుంబరావు ఇదంతా గమనిస్తున్నాడు గానీ ఏమీ మాట్లాట్టం లేదు.

"మాట్లాడవేమే" అని భయంతో ముడుచుకుపోతున్న ఆ పిల్లను మరోమారు గద్దించి ఈ ముసలమ్మ ఏమవుద్దే నీకు? మీ మామ్మ?" అనడిగింది ముసలమ్మను చూపిస్తూ.

అవుననన్నట్టు వెక్కిళ్ళతో తలూపింది పిల్ల.

"ఏమె ముసిల్దానా: నా జోళ్ళు ఎక్కడ దాచిందో అడగు నీ

మనవరాల్ని. నా జోళ్ళివ్వకపోతే ఈ గుంట ముండ తాట వొలిచి పోలీసులకు అప్పజెప్పుతాను!' అంది సంతానవతి.

"ఏమోనమ్మా! మీరు జోళ్ళు పెట్టినప్పుడు నేనిక్కడ లేను" సంతానవతికి సమాధానంచెప్పి "ఏమే అమ్మగారి జోళ్ళెక్కడ పెట్టావ్?" గట్టిగా అడుగుదామనుకొన్న ముసలమ్మ స్వరం పిల్లదాని ఏడుపు చూసి తగ్గిపోయింది.

"అమ్మగారసలు ఇక్కడ జోళ్ళు పెట్టలేదు మామ్మా!" ముసలమ్మ స్వరం ఎప్పుడయితే విందో అప్పటిదాకా నొక్కిపట్టుచిన పిల్ల దుఃఖం ఒక్కసారి హెచ్చయిపోయి ముసలమ్మ కాళ్ళను చుట్టుకొంటూ ఘొల్లుమంది.

"అమ్మో! అమ్మో! అసలు జోళ్ళే పెట్టలేదంటుంది చూశావా? ఎంత బొంకేస్తుంది ఈ గుంటది" ఫిర్యాదు చేస్తున్నట్టు అందరివైపు చూస్తూ అంది సంతానవతి. ఆమె ధోరణి సపోర్టుకోసం తహతహ లాడుతున్నట్టుగా ఉంది.

అవకాశం కోసం ఎదురు చూస్తున్న సత్తి వెంటనే దాన్ని ఉపయోగించుకొంటూ "వాళ్ళు దొంగముండలమ్మగోరూ! మీరు జోళ్ళిక్కడ పెట్టటం నేను చూసాను. ఆ పిల్ల ముండే ఎక్కడో దాసేసుంటుంది" దానియన్ని ఆ ముసల్దాని బుద్దులే. నాలుగు తగల్నిండి ఎతికి తీసుకొచ్చి మీ కాళ్ళకి తొడుగుతుంది అంది.

సత్తి ధోరణికి ముసలమ్మ అవాక్కు అయితే సంతానవతి సంతోషంతో తబ్బిబ్బుపడుతుంది. "మియ్యా-నీలం అవాయి జోళ్ళండమ్మగారూ సత్తి మెల్లిగా సంతానవతి దగ్గరకువస్తూ అంది. అవునే నీవు చూశావుకదూ? సత్తికి క్లూదొరకడంతో "అదిగో అలా ఆ బస్సున్టాండు మూల్లో చూడండమ్మగోరు. నీలం జోళ్ళు కనబడతంలేదు?" సత్తి స్వరంలోని పవరు మా

అందరి దృష్టిని ఆ బస్సు స్టాండు మూలకు త్రిప్పింది. ఆశ్చర్యం అక్కడ పిల్ల మొహంలా రంగు వెలసిపోయి వెలవెలబోతున్న నీలం మాయిడ్రోళ్ళు.

'అవి నా డ్రోళ్ళే' జారిపోతున్న చంటాణ్ణి పైకెగరేసుకుంటూ అంది సంతానవతి. సత్తివెంటనే ఆవైపు పరిగెట్టింది. దాని పరుగుకో తెలియని రసి ఉంది. దొంగతనంచేసి అబద్ధం ఆడినందుకు పిల్లమీద చాల కోపం వచ్చింది నాకు - అయితే ముసలి కూడ మంచిది కాదు. సత్తి మొగుడితో ముసలమ్మే చెప్పుంటుంది. అందుకే పాపం సత్తి అలా గంతులేస్తోంది. ఈ సంఘటన చేదు మాత్రలా ఉంది నాకు. ముసలమ్మ గురించి నాయుణ్ణే అడగకరలేదు అన్పించింది.

ఈలోగా సత్తి ఎడంచేత్తో జోళ్లు పుచ్చుకొని ఎగురుకుంటూవచ్చి "ఇయిగోండమ్మా మీ జోళ్లు" అంటూ సంతానవతి కాళ్ళ ముందేసింది. "మరేమే, నేనసలు జోళ్ళు పెట్టలేదనే అన్నావ్" పిల్ల పిపుమీద ఒక్క గుద్దు గుద్దింది కసిదీరా సంతానవతి. "అమ్మోయ్ ! మిమ్మల్ని సమ్మా ల్సినపనుందా ?" అంటూ జోళ్లకి కాళ్ళెక్కించి చూసుకొంటుంది. "ఇవి నీ జోళ్ళుకావే. ఇవి పది నెంబరువి. ఎవరివో మగాళ్ల జోళ్లు" అన్నాడు కుటుంబరావు ఆమె కాలివంకా, వదులయిపోయిన జోడువంకా చూస్తూ.

"మరే ! ఇవి నావి కావు" సైకిలు చక్రంలోంచి గాలి పోతున్న ట్టుండి, సంతానవతి కాళ్లు వెనక్కు లాక్కొంటూ. కుటుంబరావు మాటతో షాక్ తిన్నది సత్తి ఒక్కతే కాదు. అంతకంటె ఎక్కువగ నేనూ తిన్నాను. దాన్నుంచి నేను తేరుకొనేలోగానే, "మరయితే నా జోళ్ళేమయినట్టు" అని మళ్ళి అడిగింది సంతానవతి.

"అక్కడున్న వాటిల్లో మీకు సరిపోయేవి ఏసుకెల్లండమ్మగోరూ ! అప్పడాల్లే తెచ్చిత్తారు మీజోళ్లు" సత్తి ఒదలకుండా సలహా యిచ్చింది. సంతానవతి కా సలహా నచ్చినట్టుంది, వెంటనే అక్కడున్న వాటిల్లో

ఒక జత తొడుక్కొని" 'నడవండి' అంటూ తన పటాలాన్ని కేంటిన్ వైపుగా నడిపించింది.

ఆ పిల్ల ఆవిడవెంట పడి "అమ్మగోరూ! అయిమీయ్యా కాదండమ్మ గోరూ, ఇచ్చెయ్యండమ్మగోరూ" అంటూ. "ఏయ్ ఏమిటీ నీ వెధవగోలా ఫో." వెనక్కి గుండెలమీద చెయ్యేసి గెంటింది సంతానవతి. వెనక్కితూలి భూమిని కౌగలించుకొన్న పిల్ల అమ్మో! అంటూ దెబ్బ తగిలిన తలను రెండు చేతుల్తోను పట్టుకొని ఘొల్లుమంది. పిల్లదగ్గరకు ఎవ్వరూ వెళ్లడం లేదు. పిల్ల పడి అలా ఏడుస్తూనే ఉంది. ఇక నా మనసుండబట్టలేదు పిల్లను లేవదీద్దాం అని లేస్తున్నాను-ఇంతలో విచారకరమైన పిల్ల ఏడుపుకి పంచదార కోటింగ్‌లా నవ్వులు వినబడ్డాయ్. తల అటు తిప్పేసరికి ఎదురుగా ఇందాకటి పద్మాక్షి. ప్రేమసాగర్ చెట్టాపట్టాలేసుకొని దిగుతున్నారు. నన్ను చూసి చేతులు వదిలేసి తిన్నగా ముసలమ్మ దగ్గరికెళ్ళారు.

"నా జోళ్ళేవి" అని అడిగింది పద్మాక్షి ముసలమ్మని.

"మీ జోల్లని అల్లదిగో కేంటీనులో కూకన్నావిడకు ఇచ్చినారమ్మ గోరూ! ఎల్లి తెమ్మనండి" సత్తిలోని పగ ఆడదాని పగ. అది పాము పగ కన్నా, దాని విషంకన్నా ప్రమాదమయింది.

"నేనివ్వలే దమ్మగోరు, ఆవిడేసుకు పోయింది మీరెల్లి అడిగితే ఇచ్చేత్తారమ్మగోరూ" ముసల్ది ప్రతిమాలుతూ దీనంగా చెప్పింది. ఏ కళనున్నారో మరి మాట్లాడకుండా ఇద్దరూ కేంటిన్‌వైపు కెళ్ళిపోయారు. ఇందాకట్నుంచి ఏమీ మాట్లాడకుండా రాయిలా నిలబడిపోయిన ముసలమ్మ ఆగని పిల్ల ఏడుపుకీ, కాలస్తున్న సత్తిపగకీ తట్టుకోలేక తన అసమర్థతనూ బలహీనతను కప్పుకోడానికిగాను "ఏమె అమ్మగారి జోల్లెక్కడ దాసావే" అంటూ గుప్పిట కందని ఆ పిల్ల జుట్టు పట్టుకుని "చెప్పు చెప్ప

వేమే" అంటూ కొట్టడం ప్రారంభించింది. ఆ పిల్ల ఆ దెబ్బలకి సహించ లేక, ఎదురు తిరగలేక ఏడుస్తూ పరిగెడుతోంది. ముసలమ్మ వెంబడిస్తూ చేతి కందినప్పుడల్లా కొడుతూ "చెప్పే! ఎక్కడదాచావో చెప్పి నన్ను బతికించే" అంటోంది. పిల్ల ముసలమ్మ దెబ్బల్ని తప్పించుకోడానికిగాను కేంటిన్ పైపుకి పరుగుతీస్తూ "నేను దాయిలేదు మామ్మా" అంటూ ఏడుస్తోంది. అర్భకురాలయిన పిల్ల దేవుడుతప్ప దిక్కెవ్వరూలేని ఆ అనాధ రక్షణకోసం, శక్తిహీనంగా పరుగెడుతూ కేంటిన్ మెట్లపైపు వెళ్తోంది.

ఇంతలో సంతానవతి వట్టి కళ్లతో గబగబా లోపలికి దిగి ఆపిల్లను దొరక బుచ్చుకొని "అయితే నేను అబద్ధాలాడుతున్నానంటావా ముండా!" అని "లే! నాజోళ్లు తే" అంటూ ఇష్టంవచ్చినట్లు బాదడం మొదలుపెట్టింది. ఆ పిల్ల ఆదెబ్బల్నుంచి, ఆమె చేతుల్నుంచి, తప్పించుకోడానికి విశ్వ ప్రయత్నం చేస్తూనే ఏడుస్తూ నేను తియ్యలేదమ్మగోరూ అంటూంది. సంతానవతి వినడం మరచిపోయిన దానిలా కొడుతూనేవుంది! కాని ఆమె చంకలోని చంటాడు జారిపోవడం వాణ్ని పైకెత్తుకోవడంకోసం ఆపిల్లను వదిలేయాల్సి వచ్చింది

అంతే అదే అదును, ఆ పిల్ల నేను తియ్యలేదు మామ్మోయ్ అని అరచుకొంటూ పరిగెట్టడం ప్రారంభించింది. ముసలమ్మ వెంటబడింది. ఇదంతా గమనిస్తున్న సత్తి ఒకప్రక్క, సంతానవతి మరొకప్రక్క పిల్లను వెంబడించడం ప్రారంభించారు ఆ పిల్ల శక్తినంతా కూడదీసికొని పరిగెడుతూ, కొండకిందికి నడిచివెళ్ళే దారిలోకి మళ్ళింది.

ముగ్గురూ కొంతదూరం పరిగెట్టి ఇక పరిగెట్టలేక ఆగిపోయారు. పిల్ల కనుమరుగయిపోయింది. వానవచ్చి వెలిసినట్టుగా ఆ పిల్ల వెళ్ళిపోవడంతో అంతా నిశ్శబ్దమయిపోయింది. నా మనస్సంతా మంచులో పెట్టినట్టు బిగుసుకు పోయింది ఛ! ఇక్కణ్ణుంచి ఎంత తొందరగా

వీలయితే అంత తొందరగా వెళ్ళిపోవాలి అనుకుంటున్నాను ఇక ఆ వాతావరణాన్ని భరించలేక.

అదృష్టవశాత్తు ఇందాక మమ్మల్నందర్నీ దింపెళ్ళిన బస్సేవచ్చింది. వస్తాను నాయుడూ అంటూ లేచి కొబ్బరికాయకు డబ్బులిచ్చాను. "ఎల్తారా బాబూ! ఇదిగో మాట" దగ్గరకు రమ్మన్నట్టు సైజ్ఞ చేసాడు. నేనిచ్చిన డబ్బులు జేబులో వేసుకొంటూ, అతని దగ్గరకు వెళ్ళాను. సత్తి మొగుడికి నేనే చెప్పాను". తలెత్తకుండా, నా వైపు చూడకుండా అన్నాడు నాకాలికింద భూమి కదుల్తున్నట్టు అయింది.

ఇంక నేనక్కడ నిలబళ్ళేక గబగబ పరుగెత్తి బస్సులో కూర్చున్నాను. నిండిపోయిన బస్సు క్రిందికి బయల్దేరింది. బస్సు కండక్టరు సంతానవతి దగ్గరకు వెడుతుంటే టికెట్‌లో మిగిలిన డబ్బులు ఇవ్వడానికి కాబోలు అనుకున్నాను.

"ఏమ్మా! ఇందాక పైకి వెళ్ళినపుడు ఆ వెనక సీటుమీద కూర్చుంది మీరే కదూ?" అని అడిగాడు 'అవును ఏం?' అంది సంతానవతి.

"ఏంలేదు ఇవి మరచిపోయి వెళ్ళిపోయారు"అంటూ నీలం హవాయి జోళ్ళు సీటు క్రిందనుంచి తీసి ఆమెవైపుకి తోసాడు.

సంతానవతి నన్ను చూడాల్సి వస్తుందని గాబోలు గబగబా క్రిందికి దిగిపోయింది.

"అమ్మగోరూ జోళ్ళిక్కడ పెట్టలేదు" అని ఏడుస్తూ ఎండలో కొండదిగి పరిగెత్తుకు పోయిన పిల్లముఖం, గర్భగుడి సీడలో దీపాల వెలుగుల్లో నిశ్చింతగా వున్న దేవుడి ముఖం, ఈ రెండూ నా కళ్ళల్లో క్షణంసేపు మెదలి మాయమయ్యాయి.

ఆ పిల్ల నిర్దోషిత్వానికి సాక్షి ఎవరు?
మనిషి నిలబెట్టిన గుళ్ళోని దేవుడా?
దేవుడు సృష్టించిన మనిషి న్నేనా?
ఎవరు?

పెళ్ళి చూపులు

తెన్నెల ఎలీషా

బందరు

బస్సు భారంగా ప్రయాణం చేస్తోంది. వెళ్ళే కొద్దీ భారం అధికమౌతుంది. ప్రయాణీకులందరూ పరిపరి విధాల ప్రకృతిని పరికిస్తున్నారు. పరి సరాలపై ప్రత్యక్ష వ్యాఖ్యానాలు చేసుకొంటున్నారు. కొందరికి వెర్రితల లేస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఎలాంటి పొరపాటు జరిగినా ప్రమాదమేనని—శంకరానికి మాత్రం ముందు సీట్లలో కూర్చొన్న ఓ జంటపై దృష్టి మరలింది. వాళ్ళని చూస్తుంటే క్రొత్తగా పెళ్ళయిన వారులా వున్నారు.

బస్సు ఎత్తు ప్రదేశం వదలి పల్లపు ప్రాంతంలోకి అడుగు పెట్టడం

శంకరానికి ఒక్క నిట్టూర్పు వచ్చింది. బస్సు యిప్పుడు సాఫీగా ప్రయాణం చేస్తోంది. బస్సులోని వాళ్ళంతా తాపీగా కబుర్లు చెప్పు కొంటున్నారు "కాఫీకి టైం అయింది" అంటూ కండక్టరు బస్సును ఆపాడు. ఒక్కొక్కరే బస్సు దిగనారంభించారు ఆ జంట ముందు దిగారు. శంకరం బస్సు దిగలేదు. నిలబడి బస్సు కిటికి గుండా ఆ జంట నొకసారి చూశాడు. అలా చూస్తున్న శంకరానికి సరిగ్గా గత సంవత్సరం సుమారు యించుమించు అదే మాసంలో రామాపురం వెళ్ళిన సంగతులు గుర్తు కొచ్చాయి.

*　　*　　*

"అమ్మాయి కూడా బి.ఏ. చదివింది ప్యాసయింది...."అని యింకా ఏవేవో మాటలు నమిలాడు పూర్ణానందం. రంగనాధంగారు మాట్లాడలేదు. తాపీగా కూర్చున్నారు సోఫాలో. మరో కుర్చీలో కూర్చున్నాడు శంకరం. తండ్రి మౌనంగా ఉండడం శంకరానికి ఆశ్చర్యం కలిగించింది. మౌనం ఆర్ధాంగీకారమే ననుకొన్నాడు కాబోలు. కాబోయే అర్ధాంగి ఎలా ఉంటుందో ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఆరాటపడు తున్నాడు.

చలపతిరావుగారు కుమార్తె రమాప్రభతో హాల్లోకి వచ్చారు. "వారేనమ్మా. రంగనాధంగారు...వారి కుమారుడు శంకరంగారు"అంటూ పరిచయ వాక్యాలు పలికారు పూర్ణానందం. రమాప్రభ సవినయంగా అందరికి నమస్కరించింది. ఆ నమస్కార బాణానికి రంగనాధం చలించ లేదు. రమాప్రభ యింట్లోకి వెళ్ళింది. శంకరం ఆ వైపే చూస్తూ ఉండి పోయాడు. రంగనాధంగారు ఉన్నట్టుండి ఒక్కసారిగా సోఫాలో నుండి లేచి నిలబడ్డారు. చలపతిరావుగారు చలనంలేని శిలలా మారిపోయారు. రంగనాధం వరండాలోకి దారి తీశాడు పూర్ణానందం అనుసరించాడు. "ఏమిటయ్యా...నేను చెప్పింది ఒకటి...నీవు చేసేది మరోటి....అంటూ కారాలు మిరియాలు నూరాడు పూర్ణానందం మీద.

"అదేమిటి బాబూ?" ప్రశ్నార్థకంగా చూశాడు పూర్ణానందం, "నాకు కాబోయే కోడలుగురించి ఏఏ షరతులు చెప్పానో ఓసారి గుర్తుతెచ్చుకో. .. కట్నాలు కాసులు కాక...అమ్మాయి కనీసం బి.ఏ. చదివి ఉండాలి... బి యిడి. అవకూడదు ఉద్యోగం చేస్తానంటారు...గజిటెడ్ ఆఫీసరుభార్య ఉద్యోగం చేయడమా...అందచందాలలో బంగారు బొమ్మలా ఉండాలి. అణకువ, విధేయత, మర్యాదలు తెలిసి ఉండాలి ..వాళ్ళ అన్నదమ్ములు పలుకుబడిగల ఉద్యోగాలలో ఉండాలి...యివన్నీ నేను చెబితే ఒక్క బి.ఏ. చదివిందని, మాకే సరియైన సంబంధమని భ్రమపెట్టి పెళ్ళిచూపులు ఏర్పాటు చేస్తావటయ్యా?" అంటూ కళ్ళెర్ర చేశాడు రంగనాధం. పూర్ణానందానికి వూపిరి పీల్చుకోడానికైనా వ్యవధినియ్యలేదు రంగనాధం. ఇంకా ఏవేవో చెప్పబోతున్న రంగనాధంగార్ని మధ్యలో ఆపుజేసి "అయ్యా బాబుగారూ...రంగనాధంగారూ! మీరు నియమించే షరతులకు సరితూగ గలిగే పెళ్ళికూతురు ఈ భూమండలంలో లభ్యమవుతుందని నేననుకోను..."

"చాలు...చాల్లేవయ్యా! దొరక్కమి చేస్తుంది..." అంటూ శంకరాన్ని పిలిచి మెట్టుదిగి నిలబడ్డాడు రంగనాధం.

ఇదంతా కిటికీ గుండా గమనిస్తున్న చలపతిరావు సరస్వతమ్మ గారలు నిశ్చేష్టులైపోయారు.

శంకరం వీధిని పట్టాడు.

* * *

"అందరూ వచ్చినట్టేగా..." అంటూ కండక్టరు విజిలు వూది బస్సు బయలుదేరడంతో శంకరం యీ లోకంలోకి పడ్డాడు.

"ఏం నాయనా బస్సు బయలుదేరుతుందని తెలీదా? అలాగే నిలుచుండి పోయావు?" అంటూ ప్రశ్నించాడు ప్రక్కనే కూర్చొన్న ఓ ప్రయాణికుడు.

"అది కాదండీ..." అంటూ ఆశ్చర్యార్థకంగా చూశాడు శంకరం. "అదే ఆ ముందు సీట్లలో కూర్చొన్న జంట ఎవరనా ?..." సందేహాన్ని వెలిబుచ్చాడు ఆ ప్రయాణికుడు.

"ఆ...అవునండీ..." నీళ్ళు నమిలాడు శంకరం.

వాళ్ళా బాబూ...రామాపురం చలపతిరావుగారి అల్లుడు కుమార్తె... మొన్ననే పెళ్ళయింది...." . శంకరానికి సుడి గుండాలలో తిరుగుతున్నట్లనిపించింది. గత సంవత్సరం నుండి యిప్పటికి అధమ పక్షం ఓ పాతిక సంబంధాలయినా చూసి వుంటాడు శంకరం. వాళ్ళల్లో అందరికీ పెళ్ళిళ్ళయి పోతున్నాయి పిల్లల తల్లులయి పోతున్నారు.

"బాబూ ఎవరబ్బాయి తమరు ?..." ప్రశ్నించాడా ప్రయాణికుడు.

"రంగనాధంగారని...వెంకటాపురంలో స్కూలు మాష్టరు చేసి రిటైరయినారు...." అన్న శంకరం మాటలకి ఆ వ్యక్తి.

"రంగనాథం గార్ని ఎరగకపోవడం ఏమిటి ?" అన్నట్టు బాబూ తమ పెళ్ళి ఎంతవర కొచ్చిందిగా...అన్న ప్రశ్నకు...శంకరం దగ్గర నుండి సమాధానం రాకపోగా "ఏమిటో ఆయనగారి భ్రమగాని...ఆయన పెట్టే షరతులకు సరిపోయే సమ్మంధం ఎక్కడదొరుకుతుందో బాబూ." అన్నమాటలకు శంకరం ఏమీ చెప్పలేకపోయాడు...

"ఇంతకీ ఎందాక తమ ప్రయాణం...?"

"పెళ్ళిచూపులకా ఏమిటి?"...అన్న ప్రశ్నకు శంకరం తడబడుతూ "రాజుపాలెం..." అన్నాడు.

"యిందాకనగా రాజుపాలెంలో దిగే వాళ్ళెవరయినా ఉన్నారా అని అడిగితే ఎవరూ పట్టించుకోలేదు. రాజుపాలెం దాటి పావుగంటయింది..." అని మందలిస్తూ కండక్టరు బస్సును ఆపాడు...శంకరం తత్తరపాటుతో బస్సు దిగాడు.

సమాధి దగ్గర

పి. శకుంతల

విజయవాడ

ఆది వేసవికాలం. ఎండలు మండిపోతున్నాయి. పొద్దుపొడిచింది మొదలు పొద్దుగ్రుంకే వరకూ ఒకటే తాపం. అందుకే బాగా చల్లబడే వరకూ వెళ్ళబుద్ధి కాలేదు. ఎప్పటినుంచో అనుకుంటున్నాను - అమ్మా నాన్న సమాధులదగ్గరకు వెళ్ళి పూలువేసి రావాలని. అనుకుంటూ వున్నానే కాని వీలుపడలేదు. ఎప్పుడూ ఏదోవొక పని పడుతూనే వుంది. ఈరోజు అలాంటిదేమి అంతరాయంగా ఉండకూడదని నిశ్చయించుకున్నాను. పూల మాలలు తీసుకొని కారెక్కాను. డ్రైవరు ఈరోజు శెలవు పుచ్చుకొని

వెళ్ళాడు. నేనే నడుపుకుంటూ ఊరికి దూరంగావున్న సమాధులదగ్గరకు బయలుదేరాను.

పశ్చిమాన సూర్యుడు చెట్లచాటుగా మెల్లగా జారుకుంటున్నాడు. ఆకాశం నిండా ఎర్రరంగు పులిమినట్లుగా వుంది. కారు వేగాన్ని పెంచాను. అ ఎర్రరంగు నల్లరంగుగా మారకముందే వేగానికి చల్లగాలి కారులోకి ఎక్కువగా వీస్తుంది. ముంగురుల్ని సరిచేసుకుంటూ ఆ ప్రశాంత వాతావరణంలో నేను పయనిస్తూంటే నామనస్సు గతంలోకి తొంగి చూసింది.

మాది సామాన్య కుటుంబము. గుమాస్తాగా నెలరోజులు ఆఫీసుకు ఇంటికి నడిస్తే నాన్నకొచ్చే జీతం ఇచ్చినరోజే అయిపోయేది. అమ్మకు కుట్టుపనివచ్చు. వాయిదా పద్ధతిమీద ఒక కుట్టుమిషను తీసుకొంది. తెలిసిన వాళ్ళకు కుట్టుపనిచేస్తూ నాలుగురాళ్ళు సంపాదిస్తూ వుండేది. అందువల్ల అంతగా ఇబ్బంది పడేవాళ్ళం కాదు. అయినప్పటికి ఒక్కొక్కసారి బహుకష్టపడే వాళ్ళం. కొన్నిసార్లు కుట్టటానికి యేపని దొరికేదికాదు. అప్పుడు రోజు గడవటమే కష్టంగా వుండేది. ఇన్ని జరిగినా అమ్మ గుట్టుగా జరిగించేది. ఎవరినీ ఎప్పుడూ ఏదీ అడిగేదికాదు. ఎవరితోను కుటుంబ వ్యవహారాలు చెప్పుకునేదికాదు.

కొంతకాలం అయ్యాక నాన్నకు ప్రమోషన్‌వచ్చి మరొక వూరికి ట్రాన్స్‌ఫర్ అయింది, అక్కడ కూడా అమ్మమిషన్ కుట్టేది. ఆదాయం పెరిగింది. ఒకప్రక్క నాన్నహోదా మరోప్రక్క అమ్మ ఆదాయం పెరిగే సరికి కష్టాలు నెమ్మదిగా దూరం కాజొచ్చాయి మరొక రహస్యం కూడా వుంది. నేను, తమ్ముడు ఇద్దరమే. కుటుంబాన్ని అనవసరంగా పెంచుకోలేదు అమ్మానాన్న, అందుకని చాలా కలిసివచ్చింది.

నేను కాలేజిలో బి. ఏ. చదివే సంవత్సరంలో తమ్ముడు మిలిటరీలో చేరాడు. అమ్మానాన్నకు ఇష్టం లేకపోయినా వాడు ఆపని చేశాడు. మరొక రహస్యంకూడ వుంది. నేను ఈనాడు యీ స్థితిలో వుంటానికి

అదేకారణం. అది దేవునిపట్ల మాకున్న నమ్మకం. ప్రతిపని కూడా దేవుని మీద భారంవేసి అమ్మానాన్న చేసేవారు. ఎంత చిన్నపనైనా ప్రార్థనతో ప్రారంభించేవారు. రాత్రిపూట బైబిలు చదివి ప్రార్థన చేస్తేనే గాని మాకు అన్నం పెట్టేదికాదు మా అమ్మ. మళ్ళీ ఉదయాన లేవగానే బైబిలు పఠనం, ప్రార్థన తర్వాతనే మా దినచర్యలు మొదలయ్యేవి. ఈ భక్తితో పెంచారు మమ్మల్ని. ఈనాడు ఆ దైవభక్తే మమ్మల్ని యీ స్థితికి తెచ్చింది.

నేను కాలేజిలో చదువు ముగించుకురావటం, నాన్నకు మరో ప్రమోషన్ రావటం ఒకేసారి జరిగాయి. దాంతో మాకుటుంబ పరిస్థితి బాగా మెరుగుపడింది. పదిమంద్లో యింత గౌరవంగా తిరగటం నలుగురిలో మంచిపేరు సంపాయించుకోవడం ఇలాటివన్నీ యాదృచ్ఛికంగా జరిగిపోయాయి. దానికితోడు మిలిటరీలో ఉన్న తమ్ముడుకూడ ప్రతినెలా ఎంతోకొంత డబ్బు పంపుతూ వుండేవాడు ఆ డబ్బు, అమ్మ సంపాదనంతా కలిపి నా వివాహంకోసమని దాచిపెట్టారు.

ఆప్పుడున్న వూరిలోనే విశ్వవిద్యాలయం ఉండడం వల్ల బి. ఏ. ముగించాక ఎం. ఏ. కూడ చదివే అవకాశం నాకు లభించింది. ఎం. ఏ. అయ్యాక రెండు సంవత్సరాలు పనిచెయ్యడం. మా డిపార్టుమెంటు అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో వివాహం జరగడం - అన్నీ దైవ సంకల్పితంగా జరిగిపోయాయి వారు బాగా ఉన్నవాళ్ళు వాళ్ళ కుటుంబంలోకి వెళ్ళటం నిజంగా దేవుని ఏర్పాటేగాని మరేమికాదు. ఇప్పుడవన్నీ తలంచుకుంటే నా జీవితంలో దేవుడు ఒకగొప్ప అద్భుతాన్ని చేసివుండకపోతే యీనాడు కారులెక్కి తిరిగే స్థితి వచ్చివుండేది కాదనిపిస్తుంది.

అయితే ఒక్కటే విచారం. నాకు పెండ్లయిన మొదటి సంవత్సరంలోనే అమ్మా నాన్న పోయారు. కారణాలు ఏమైనా, మమ్మల్ని యీ స్థితికి తీసుకొచ్చి ఇక మా బాధ్యత తీరిపోయిందన్నట్లు వాళ్ళు వెళ్ళి

పోయారు. మా అమ్మానాన్న త్యాగం చేస్తేనే యీనాడు యిలా వుండ గలిగాము. అందుకే నాకు దిగులు వున్నప్పుడల్లా సమాధుల దగ్గరకు వెళ్ళి గత జీవితాన్నంతా తలచుకొని చిన్న ప్రార్థన చేసుకొని వస్తాను. ఈరోజు కూడా అదే ఉద్దేశ్యంతో బయలుదేరాను.

సూర్యుడు అప్పుడే అస్తమించాడు. అయినా వెలుగు యింకా మరుగున పడలేదు. ఆ సంధ్య వెలుగులో సమాధిని చేరుకున్నాను. గేటు దగ్గర కారు ఆపుచేసి పువ్వులు తీసుకొని ఆవరణలోనికి వచ్చాను. "నమస్కారమమ్మా బావున్నానా?" అంటూ నరసయ్య ప్రశ్నించాడు, నరసయ్య సమాధుల దగ్గర కాపలావానిగా పనిచేస్తున్నాడు. తరచుగా వెళ్తూ వుండేదాన్ని కాబట్టి నాకు బాగా పరిచయం. సమాధులను శుభ్రంగా వుంచి ఆ భాగాన్ని ఒక చక్కని పూలతోటగా మార్చివేశాడు నరసయ్య. అందుకే అత నెవరైనది చూడకుండా కాపలాదారునిగా పెట్టడం జరిగింది. అమ్మ నాన్న సమాధుల దగ్గరకు వెళ్ళి నిలబడ్డాను.

"అమ్మగారో, మనతోటలో పూసిన పూలు" అంటూ నరసయ్య నా చేతికి కొన్ని పువ్వులు అందించాడు. అలా చెయ్యడం అతనికి మామూలే. నే నక్కడికి వెళ్ళగానే ముందుగా నమస్కారం చేసి చెట్ల దగ్గరకు వెళ్ళి కొన్ని పువ్వలు కోసి తీసుకొచ్చి నాకు ఇస్తాడు. నేను తీసుకొని వెళ్ళిన పూలతోపాటు వాటిని కూడ సమాధుల మీద వుంచి వచ్చేదాన్ని. అదే అలవాటుగా పూలు నా కందించాడు.

"ఎప్పుడూ నాకే యియ్యకపోతే సమాధుల మీద నువ్వే వెయ్యి కూడదా నరసయ్య?" అని అన్నాను అతడు ఏమి సమాధానమిస్తాడో చూద్దామన్న ఉద్దేశంతో. దానికతడు నవ్వుతూ "నాకిలాటి వాటిమీద నమ్మకా లేమి లెవ్వమ్మగారో!" అని అన్నాడు.

"ఎలాటి వాటిమీద" అని వెంటనే ప్రశ్నించాను. అతడు తాపత పటాయించి "అదేనండి శవాలకు సమాధికడతాం. వాటికి మళ్ళీ పువ్వులు

వేసి ఇక్కడచేరి ప్రార్థనలు ఎందుకు చెయ్యాలండీ? శవాలు మట్టిలోకలిసి పొయ్యాయిగా;" అని తన సందేహాన్ని వెలబుచ్చుతూ అన్నాడు.

నేనేమి, పెద్ద ప్రసంగం చెయ్యకుండా "నువ్వు చెప్పింది ఒక రకంగా నిజమే నర్సయ్యా. శవాలు మట్టిలోకలిసి పోతున్నాయి. వాటిమీద రాళ్ళతో ఈ సమాధుల్ని కడుతున్నాము వాటిమీద పూలుపెట్టి ప్రార్థన చేస్తున్నాము. శవాలు మట్టిలోకలిసి పోతున్నాయి అని అనుకుంటే ఇదంతా వ్యర్థమే కాని మేము నువ్వనుకున్నట్టుగా అనుకోవటం లేదు. యేసుక్రీస్తు పునరుత్థానంలో మాకు విశ్వాసముంది అంతే కాదు. ఎదో ఒకనాడు యేసుక్రీస్తు మహిమతో తిరిగి వస్తాడు. అప్పుడు ఈ సమాధులన్ని తెరచుకుంటాయి. మట్టిలో కలిసిపోయిన శవాలన్ని ప్రాణంతో లేస్తాయి. ఆయన చేసేతీర్పులో అందరూ ఆయనముందు నిలబడతారు. చనిపోయిన వారు బ్రతికి వున్నవారు అంతా ఆయనముందు నిలబడతారు" అని చెప్పి కాసేపు ఆగాను.

"అంటే ఒకవేళ మనం చనిపోతే మనక్కూడా తీర్పు ఉంటదా అమ్మగారు?" అని ఎంతో ఆత్రంగా ప్రశ్నించాడు.

"మనక్కూడా తీర్పు వుంటుంది మన విశ్వాసాన్ని బట్టి, మనకు శిక్షకూడ పడుతుంది. యేసుక్రీస్తు రక్షకుడని అంగీకరించి అయన చిత్తాను సారంగా నడుచుకొన్న వాళ్ళకు శిక్ష పడదు. వాళ్ళకు పునరుత్థాన మహిమలో ప్రవేశించే అర్హతను క్రీస్తు అనుగ్రహిస్తాడు" అని వివరించి చెప్పాను. ఈ మాటలు విన్న నరసయ్య ఆలోచనలో పడ్డాడు.

నేను తీసుకెళ్ళిన పువ్వుల్ని సమాధులమీద పెట్టి అక్కడే మోకాళ్ళని ప్రార్థనచేసి కళ్ళు తెరిచాను. నర్సయ్య కూడా మోకాళ్ళని వున్నాడు. నాకు ఆశ్చర్యమేసింది: కాసేపయ్యాక అతను లేచి కన్నీళ్ళు తుడుచుకుంటూ—

అమ్మగారో - ఇంతకాలం నా కెవ్వరూ ఈ సంగతి చెప్పరేదండీ. నాకూ్కడా ఆ పునరుత్థానంలో వెళ్ళాలని వుందండి యేసు ప్రభువు యికనుంచి నాకు "అని ఎంతో ఆనందంగా చెప్పాడు" అ మాటలు విన్న నా ఆనందానికి మేరలేకుండా పోయింది. మరొకసారి అతను కొరకు ప్రార్థనచేసి కారెకూ్కను. సమాది దగర ఒక వ్యక్తి క్రీస్తుని రక్షకునిగా స్వీకరించాడు. ఇది నిజానికి ఆయన పునరుత్థాన మహిమే అనే విశ్వా సంతో బయలుదేరాను.

క్రొత్త ఇల్లు

అభినేత్రి

గుంటూరు.

ఇన్‌స్టాల్‌మెంటు పద్ధతిలో తీర్చుకునే విధంగా ప్రభుత్వమే ఇండ్లను కట్టిస్తుందని తెలిసినరోజునుండీ నా కలలు మొదలయ్యాయి. ఈ మహా పట్టణంలో అద్దెలు చెల్లించలేక సతమతమవుతున్న ఈ రోజుల్లో ఈ వార్త ఎడారిలో ఒయాసిస్సులా మా మనసులో పూలజల్లు కురిపించింది. అది ఊరికి దూరంగా నైనప్పటికి అచటనుండి పిల్లలు స్కూలుకు, వారు ఆఫీసులకు వెళ్ళడానికి వీలుగా బస్సులుండడంతో అవి ఎప్పుడు పూర్తవు తాయా ఎప్పుడు వెళ్దామా అన్నంత ఆత్రుతగా ఉంది.

ఒకరోజు "మన ఇల్లు పూర్తయింది. ఇక మనం వెళ్ళవచ్చు"

అన్నాడు ఆయన. నేను ఇంతకుముందు ఆయనతో వెళ్ళి ఆ ఇంటిని దర్శించడంవలన ఆ పరిసరాలు నా మనసులో వింత ఆనందాన్ని రగు లొ్కల్పాయి పెద్ద బంగళా కాదుగాని ఒక మధ్య తరగతి కుటుంబాని కి యిల్లు చాలా నయమనిపిస్తుంది. పెద్ద వరండా, దాని కానుకొని రెండు పెద్దగదులు, వెనుక చిన్న కిచెన్ ఉన్నాయి. ఇంటికి కొంత దూరంలో ప్రహరీగోడ, దానికానుకుని బాత్రూమ్ లెట్రిన్ ఉన్నాయి. వాటికీ కిచెన్‌కు మధ్య కొంత ఖాళీస్థలం ఉన్నది. ఇంటి ముందున్న కొద్దిపాటి ఖాళీ స్థలంలో మంచి పూలమొక్కలు వేయాలని నిశ్చయించుకున్నాను.

"మంచి ముహూర్తం చూచి ఇంట్లోకి వెళదాము" అన్నా రాయన.

"అదేమిటండీ! మనవాళ్ళ నెవరినీ పిలవద్దా? శుభమా అంటూ క్రొత్త ఇంట్లోకి వెళ్తుంటేను" అన్నాను.

"హడావుడి ఏం అక్కరలేదు వసూ! అత్తయ్య మామయ్యలను, మా అమ్మానాన్నలను మాత్రం పిలుద్దాము ఆ తరువాత ఇంట్లోకి సామా నంతా చేర్చింతర్వాత మిగతావాళ్ళని పిలుద్దాము".

ఆయన సలహా నాకు నచ్చలేదు. అయినా విధిలేక ఒప్పుకున్నాను. స్వంత ఇల్లంటూ ఒకటి కట్టించుకున్న తర్వాత బంధువుల నందరినీ పిలవా లని నాకుమాత్రం ఉండదూ?

మంచి ముహూర్తం చూసి గృహప్రవేశం చేశాము. అమ్మానాన్న, అత్తయ్యవాళ్ళు పను లున్నాయంటూ మర్నాడే వెళ్ళిపోయారు. వారం రోజుల తర్వాత నెమ్మదిగా సామానంతా క్రొత్త ఇంట్లోకి చేర్చాము. కొంగ్రొత్తానుభూతితో, అందులోని ప్రతి వస్తువూ నాది యనే భావనతో నా మనసు నిండిపోయింది. ఈ రోజుల్లో స్వంత ఇల్లుండడం అందునా పట్టణంలో ఉండడం ఎంత కష్టం?

ఇంట్లో సామాను సర్దడం మొదలెట్టాను. ఆయన ఆఫీసుకి వెళ్ళి పోయారు. పిల్లలు క్రొత్త పరిసరాలను పరిచయం చేసుకొంటూ హడా

విడిగా తిరుగుతున్నారు. బయట గేటు పెట్టకపోవడంతో అక్కడ గేటు పెట్టిం ి పూలమొక్కలు నాటాలనుకున్నాను. ఇంటికి కొంచెం దూరంలో ప్రక్కగా పెద్ద పొగడచెట్టు ఉన్నది. పూర్తిగా పూసేకాలం కాకపోవడంతో చెట్టుకి అక్కడక్కడ కొద్దిగా పూలున్నాయని తనుకుంటూ లోపలకు నడిచాను.

"అమ్మా! ఎవడో ముసిలాడే! ఏంకావాలో? ఏం మాట్లాడక నిలు చున్నడమ్మా!" బాబిగాడు కేకతోబాటు పరిగెత్తుకు లోపలకు వచ్చాడు. నేను కిటికిగుండా చూశాను. బాగా ముసలివాడు. ఎనభై ఏళ్ళు పైబడి వుండవచ్చు మధ్యాహ్నం ఎండ తీక్షణంగా ఉంది. అతనికి అన్నం, కూరా ఇచ్చి ఆతనిని పరీక్షగా చూశాను. కళ్ళలో దైన్యం ఉట్టిపడుతోంది. బాగా వంగిపోయాడు అతని ప్రవర్తన నాకు వింతగా కన్పించింది. కాసేపు నా కళ్ళలోకి చూశాడు. ఒకసారి ఇంటినంతటినీ కలియచూశాడు. చాలాసేపు నిల్చుని నెమ్మదిగా కదిలాడు.

సాయంకాల మయింది. ఇంటినంతటినీ సర్ది వంట చేసేసరికి అలిసి పోయాను. పిల్లలకు అన్నాలు వడ్డించే సరికి చీకటి పడింది బాగా తిరిగా రేమో త్వరగా నిద్రపోయారు. సన్నగా పున్నాగపూల పరిమళం ఏస్తోంది ఆయన వచ్చారు. భోజనంచేసి పడుకునేసరికి పదయింది. నాకు అలసి పోయినా నిద్ర రావడంలేదు. క్రొత్త వాతావరణం, క్రొత్తకళ్లు, వెల్లవేసిన గోడలఘాటు వాసనతో అసలే నిద్ర పట్టడంలేదు. లైటు తీసి కిటికీ దగ్గ రగా నిలబడ్డాను. మనక వెన్నెలలో పొగడచెట్టు వింతగా కన్పిస్తోంది. దూరంగా ఇంకా పూర్తిగాని ఇళ్లు బహుశా అందరూ ఇంట్లలోకి రాలే దను కుంటాను. ముప్పున పొగడపూల పరిమళం వెదజల్లింది. ఎంత హాయిగా ఉంది హారన్ల రొదలతో, బస్సుల హడావిడులతో విసిగిపోయిన నామనస్సు కు ప్రశాంత వాతావరణంలో క్రొత్త అనుభూతి పొందుతోంది. లోపలికి చూశాను. అందరూ గాఢంగా నిద్రపోతున్నారు చీకటిలో సన్నగా

దూరం అవుతున్న అడుగుల చప్పుడు విన్పించింది. ఏదీ స్పష్టంగా కని పించడంలేదు మబ్బులు చంద్రున్ని అటకాయించాయి. మసక వెల్తురు మరీ చిక్కని చీకటయింది నాకు భయం వేసింది. ఎవరూ లేకుండా చూసి దొంగలు దోచుకుపోరుగదా అన్పించి మంచంమీదకు చేరాను.

తెల్లవారి నన్ను భయపెట్టిన విషయాలను అయనకు వివరించాను. ఆయన నవ్వి,

"ఇక్కడెవరున్నారని దొంగలు వస్తారే వసూ! మనకు కొంచెం దూరంలో కాలనీ కట్టే కూలీలు గుడిసెలు వేసికొని ఉన్నారు. వాళ్ళాకవేళ ఎవరైనా ఇటు వెళ్ళారేమో! దారిగదా!" అన్నారు.

మరల పనుల హడావిడిలో పడిపోయాను. మధ్యాహ్నం తీరికగా పడుకొని పుస్తకం చదువుతున్నాను. రాత్రి సరిగా నిద్రలేకపోవడంవల్ల కళ్లు కూరుకుపోతున్నాయి. క్రొత్తగా ఇంట్లోకి వచ్చామనే వంకతో పిల్లలు బడికి ఈరోజుగూడా వెళ్లలేదు.

"అమ్మా! నిన్నటి ముసిలాడు వచ్చాడే" బాబిగాడి కేక. లేచి రావడానికి బద్ధకమేసింది. అయినా ఆతని రూపు కళ్ళముందు మెదిలింది. లేచి కొంచెం అన్నం పులుసు ఇచ్చాను. అదేరూపు నిరాశ నిస్పృహ ఘనీభవించిన కళ్లు. ఎప్పుడూ ఏదో వెతుకుతున్నట్లుండే కళ్లు. అతడు వెళ్తూవెళ్తూ పొగడచెట్టుక్రింద చాలాసేపు నిల్చుని వెళ్ళడం నా చూపు దాటిపోలేదు.

రోజులు దొర్లుతున్నాయి. వాడుకగా అతడు రోజూ వస్తున్నాడు. నేను ఇంటివద్దే ఉండడంవల్ల వర్షాలు మొదలవడంతో పూలతోటకి ప్లాన్ వేసుకున్నాను. గులాబి అంట్లు అప్పుడే తెప్పించి పెట్టాను. పొగడచెట్టుకి కొంత దూరంలో మందారం అంటు నాటాను.

రోజూ వచ్చే అతడు ఆ రోజు రాలేదు. నాకు అతడెందుకు రాలేదో అర్థంకాలేదు. నాలో అతడంటే ఒక విధమైన జాలి ఏర్పడింది. రెండవ

రోజుగూడ అతడు రాలేదు. ఇన్నిరోజులనుండీ నేనాతని నేమీ ప్రశ్నించ లేదు గాని అతడు రానిరోజు నాలో ఏదో వెలితిగా ఆన్పించింది.

ఆ రాత్రి... ఏదో విషయం చర్చించుకుంటూ యధాలాపంగా ముసిలాడు కన్పించలేదని చెప్పాను. ఆయన తేలిగ్గా నవ్వుతూ...

"మన దేశంలో అసలే సోమరిపోతుల సంఖ్య హెచ్చు. వాళ్ళని మరీ సోమరులుగ చేయడంలో మీ ఆడవాళ్లకు భాగం ఉంది. అడుక్కునే ప్రతివాడిమీద జాలి కురిపించకు. బయట ప్రపంచంలో మోసాలతో బ్రతికే వాళ్లలో ఇలాంటివారెందరో" అన్నారు.

"కాదండీ పాపం! మరీ ముసలివాడు. అతనికి ఎవ్వరూ లేరేమో! అయినా అడిగే ప్రతివాడికీ పెట్టగలమా చెప్పండి? ఆతడు తప్ప ఇటు మరెవ్వరూ రారు అన్నాను.

ఆ రాత్రి మళ్ళీ ఇంటిలో ప్రవేశించిన నాటి వలెనే అడుగుల చప్పుడు విన్పించింది. కీచురాళ్ళ మోతలో ఏదీ స్పష్టంగా విన్పించడం లేదు. దారిగదా! అని సరిపెట్టుకున్నాను.

మర్నాడు ఉదయాన్నే రోజూకన్నా ముందే లేచాను. పిల్లలకు పంటచేసి టిఫిన్ బాక్సులు సిద్ధంచేసి వారిని పంపాల్సిన పని వుంది. వాకిలి చిమ్మి నీళ్ళు చల్లాను. పొగమంచు ఇంకా దట్టంగా పేరుకొని ఉంది. పొగడపూలు పాదులకొరకు త్రవ్విన నల్లని నేలమీద నింగినుండి జారిన ముత్యాల హారాల్లా మెరుస్తున్నాయి. తూర్పుదిశన కాంతిరేఖలు గోచరించడంతో కాబోలు చెట్టుమీది పక్షులు మెల్లమెల్లగా చప్పుడు చేస్తున్నాయి. వెలుగులోకి ప్రవేశించవలెననే తొందరతో రెక్కలు టపటపకొట్టుకుంటున్నాయి చెట్టుక్రింద ఎవరో ఉన్నారేమోనని నాకు లీలగా తోచింది. చెట్టువైపుకి రెండడుగులు వేశాను. కాళ్లకేదో తగిలి పడబోయి తమాయించుకొని జాగ్రత్తగా చూశాను. పొడవాటి కర్ర. ఇక్కడికెలా వచ్చిందనుకుంటూ మరికొన్ని అడుగులు వేశాను. చీకట్లు మెల్లగా విడిపో

తున్నాయి. నా శ్వాస ఒక్కసారి ఆగిపోయిందనిపించింది. నాలో చలనం నశించింది. చెట్టు ప్రక్కన అస్తవ్యస్తంగా పడివున్న ముసలివాడిని చూచి అలాగే నిలబడిపోయాను. కొద్ది నిముషాల్లో అందరూ చెట్టుక్రిందికి చేరారు. ఒక్కొక్కరే అంటున్న మాటలను బట్టి మేమున్న స్థలము అతడు మరికొందరు నివసించిన స్థలమని, పొగడచెట్టాతడు పెంచినదని, కాలనికి ప్రత్యేకించడంతో మిగతావారంతా వాళ్ళకు నిర్దేశించిన స్థలాలకు తరలి వెళ్ళారనీ కాని ఇతడు వాళ్ళతో పోక ఇక్కడే వుండిపోయాడనీ తెలిసింది. పాపం! పొగడచెట్టుక్రింద రోజూవలెనే పడుకున్నాడు కాబోలు. చెట్టు మొదలువద్ద పడిఉన్నాతడు. ఎదిగిన కొడుకు నీడలో తలదాచుకున్న తండ్రిలా కన్పించాడు. జీవిత చరమ దశలో ప్రియమైన చోటనే ప్రాణం పదలాలని వుంది కాబోలు! నాకళ్ళు నీళ్ళతో నిండిపోయాయి. నిర్జీవమైన అతనివైపు చూశాను. మసకమసకగా ఉన్న నా చూపు నిశ్చలమైన అతని ముఖంమీది సంతృప్తితో గూడిన చిరునవ్వుపై నిలిచింది. ఆతని నెరసిన గడ్డంలో మెదిలే చిరునవ్వు ఆతని హృదిలో రగిలిన ధవళాగ్నుల ధూమంవలె కన్పించింది. నా ఇల్లని నేను మురిసిపోతున్నది మరొకరి మరపురాని మధురస్మృతుల నిలయమని తెలిసింది. నా నిలయం ఆతని గతబంధాల వలయం, ఆశల ఆలయం అన్పించింది.

చెల్లిపోయిన తండ్రి దేహంపై తనయుడు కార్చిన కన్నీటి బిందువులా యన్నట్లు కొన్ని పొగడపూలు రాలిపడ్డాయి.

తప్పిపోయినతండ్రి

సెంటీనా సరోజినీ కుమార్

సికింద్రాబాద్

దూరంగా అస్తమిస్తోన్న సూర్యుని తాలూకు కిరణాలు, ఆకాశానికి నారింజ రంగు పులుముతున్నాయి. గూళ్ళకు తిరిగి వెళ్ళుతూంది పక్షిసంతానం, బారులుగా. నీ రెండళ్ళో తలలార్చుకొంటున్నట్లు సుతారంగా వూగుతున్న కొబ్బరి చెట్లు, పిల్లగాలులకు పరవశంతో పయ్యెదలు ఎగర వేసుకొంటూ కొంటెగా నవ్వుకొంటూ, ముందుకు సాగుతున్న మేఘ కన్యలు—ఎంత చూచినా తనివి తీరని దృశ్యం అయినా, మేడగదిలో కిటికీ దగ్గరగా, రోడ్డు, కనిపించేలా కూర్చున్న లలితకు, ఇవేమీ కనిపించటం లేదు. ఆమె మనస్సంతా భర్తరాక కొరకై ఎదురు చూడ్డంలో నిమ

గ్నమై వుంది. రోడ్డుమీద దూరంగా కనిపిస్తున్న ప్రతి కారువంకకూ ఆశతో చూస్తోంది. దగ్గరకు వచ్చాక, అది తమదికాదని గమనించి నిట్టూ ర్చుస్తోంది. బడిలో ఏదో డ్రామావుందంటూ వెళ్ళారు. రవీ, నిమ్మీ. అసలు ముందు, పిల్లలతో వారూ, తనూ, కూడా వెళ్ళా లనుకొన్నారు. కాని వారు ఏదో అర్జంటు పనిమీద మరో కంపెనీకి వెళ్ళుతున్నాననీ, రావటం ఆలస్యం అవుతుందనీ ఫోను చేశారు. అదెప్పుడు? నిన్న సాయంకాలం. రాత్రివారు ఇంటికి రానేలేదు. వారికొరకు ఎదురు చూస్తూనే రాత్రంతా గడిపింది తను. మనస్సు కీడును శంకించింది లేని ధైర్యం తెచ్చుకుని తనకు తనే సర్ది చెప్పుతుంది. ఉదయం పిల్లలను తయారుచేసి బడికిపంపించి యాంత్రి కంగా ప్రతి చిన్న చప్పుడుకూ, వస్తున్నది వారే అనుకొంటూ, పరుగులు తీసింది. పిల్లలకు క్యారియర్ పంపిది. తనకు అన్నంసహించింది కాదు. అప్రయత్నంగా ఆమె కళ్ళు నిండుకున్నాయి. అధరాలు కంపించగా, సత్తువలేనట్లు కుర్చీతో అలా వాలిపోయి, వెక్కి-వెక్కి ఏడవ సాగింది.

"మమ్మీ,...మమ్మీ..." అన్న పిలుపులతో, మేడమెట్లమీద దగ్గరవుతున్న బూటుచప్పుడు.త్వరగా—కళ్లు వొత్తుకుని, ముఖానికి నవ్వు పులుముకొంటూ పిల్లలకు ఎదురెళ్ళింది. పిల్లలిద్దరూ పరుగు పరుగున తల్లిని చేరి, ప్రశ్నలు, కబుర్లు, పితూర్లు-కలగా పులగంగా మొదలు పెట్టారు. "నీవూ, డాడీ ఎందుకురాలేదు? డాడి రాకున్న నీవైనారావద్దా? మా క్లాస్" డ్రామా ఎంత బాగుందో! అసలు రీటా చేసిన పీకాక్ డాన్సు చూచి తీరాలి. నాకు అలాంటి డ్రస్, కొనిపెట్టాలి. నేనూ నేర్చుకొంటాను డాన్సు. అన్నయ్య రిక్షాలో నాకు చోటీయలేదు. మొట్టికాయవేశాడు..." అన్నకు పిసరంత సందీయకుండా, అన్నీ తనే మాట్లాడేస్తూంది నిమ్మి. "మమ్మీ...ఆకలి" అన్న రవి మాటలతో ఈ లోకంలోకి వచ్చిన లలిత, నొచ్చుకొంటూ డైనింగ్ హాలులోకి దారితీసింది. పిల్లలకు వడ్డించి వాళ్ళ కబుర్లు వింటూ, మారు వడ్డిస్తూ కూర్చుంది. అంతలో తింటున్నది ఓ

క్షణం ఆగి అప్పుడే గుర్తుకొచ్చినట్లు అడిగింది నిమ్మి "డాడీ, వచ్చారా మమ్మీ?" ప్రశ్న వినగానే నటించి, రవికి పెరుగు వడ్డించసాగింది లలిత. తిరిగి రెట్టించింది నిమ్మి. ఈ సారి ఆ స్వరంలో ధ్వనించిన దిగులుకు, ఆర్తితో కరిగిపోయింది ఆమె మాతృ హృదయం అప్రయత్నంగా అనేసింది, "వచ్చారమ్మా. వచ్చి భోజనంచేసి, వెళ్ళారు. ఏదో అర్జంట్ పని వుందిట. మీరు పడుకోండి ఇప్పటికే ఆలస్యం అయింది."లేని హడావిడి, అభినయించింది. పిల్లలిద్దరూ త్వరలోనే నిద్రాదేవి కౌగిటలో వొరిగిపోయారు. తన కంఠానికి పెనవేసుకొని నిమ్మి చిన్నారిచేతిని మృదువుగా విడిపించుకుని, తిరిగి కిటికీ దగ్గరగా తన యదాస్థానాన్ని ఆక్రమించుకొంది లలిత. దోరవెన్నెల మెల్లమెల్లగా పరుచుకొంటోంది. వెన్నెట్లో తడిసిన తోట అందంగా మెరుస్తోంది. బాల్కనీ పైకి అల్లుకొన్న సన్నజాజి తీగ నిండుగా విచ్చుకొన్న పూలు, నక్షత్రాల్లా వున్నాయి. క్షణంలో అర క్షణం, ఆప్రయత్నంగానే లలిత ఈ దృశ్యాల్ని చూచింది. జరిగిపోయిన ఓ మధుర క్షణం స్మృతిలో మెదలటంలో, గుండె ఝల్లుమంది. బుగ్గల్లోనికి పెచ్చటి నెత్తురు పొంగింది. ఈలాంటి వెన్నెలరాత్రే...వారితో ఏకాంతంగా వున్న సమయంలో, తను త్వరలో తల్లి కాబోతున్న విషయం వారికి చెప్పింది. ఆపై ఎన్ని కధలు?! ఎన్ని ప్లాన్స్?! రోజులు నిమిషాల్లా దొర్లి పోయాయి. ఇప్పటికీ ఆ దినాల్లో తాము అనుభవించిన ఆనందంలోని మధురిమ...ఈ నాటికీ మరుపుకు రావటం లేదు. అంతా నిన్నో మొన్నో జరిగినట్లుంది తీయని జ్ఞాపకాలమ త్రవ్వుకొంటున్న ఆమె మరు క్షణం ఎవరో చెక్కున చరచినట్లు ఉలికిపడింది. గేటుముందు కారు హెడ్ లైట్స్. అవును వారు వచ్చారు...వచ్చారు...చెంగుచెంగున లేడిలా పరుగులు తీసిందామె. అప్పటికే డ్రైవరు సింగ్, రావ్‌ను అతికష్టంమీద నడిపించుకొంటూ వస్తున్నాడు మౌనంగా వెళ్ళి తనూ సహాయపడింది. ఇద్దరూ కలిసి రావ్‌ను పడకమీదకు చేర్చారు. వెళ్ళబోతున్న సింగ్‌తో

అంది లలిత "అయ్యగారు-భోజనం...?" అదోలా నవ్వుతూ అన్నాడతను "అంతా అయిందమ్మగారూ కాస్త మజ్జిగివ్వండి." అతని కంఠంలో ధ్వనించిన హేళనకు, లలిత హృదయం క్రుంగిపోయింది. భర్త బూటు విప్పి, మజ్జిగత్రాగించడానికి ఎంతో ప్రయత్నించింది. ఉహు లాభంలేక పోయింది. కళ్లు విప్పిచూచాడే తప్ప, రావ్ భార్యను గుర్తించినట్లు లేదు. ఆ కొంచెం సేపట్లో ఎర్రగా చింతనిప్పుల్లా వున్న ఆ కళ్ళను, రేగివున్న ఆ జుట్టు, వాడిపోయి అలసటను సూచిస్తున్న ముఖం, కళ్ళక్రింద నల్లని ముడతలూ, నలిగిపోయిన బట్టలూ లలితకు ఎన్నోసంగతులు తెలిపాయి. వస్తున్న కన్నీటిని ఏ మాత్రం ఆపాలన్న ప్రయత్నం చేయలేదామె. మనస్సులోని భారం తీరేలా ఏడ్చింది. నిద్రపోతున్న భర్తవంకకు, అలా చూస్తూ కూర్చుండి పోయింది.

ఎంత వేడుకొన్నా నిద్రాదేవి కరుణించలేదు. తిరిగి లలిత మనస్సు గతాన్ని త్రవ్వి ప్రయత్నిస్తోంది. ఆమెకు భయంగా వుంది. అయినా మనస్సు గతించిన ఆ బంగరు అనుభవాలను నెమరువేయను పరుగులు పెడుతోంది. తమ కాపురం తొలిదినాల్లో—వారు సాయంకాలం వచ్చే సమయం కొరకు, చంద్రునికొరకు చకోరంలా ఎదురుచూచేది. ఆ నిరీక్షణలో ఎంతటి ఆనందం! ఎంత తన్మయత!! వారు రాగానే ఎన్నాళ్ళనుండో అనుభవిస్తున్న ఎడబాటు ఎగిరి పోయినట్లుండేది. కాఫీ, టిఫినూ ముగించి, అలా చర్చివరకూ, కబుర్లు చెప్పుకొంటూ బయలుదేరే వాళ్ళు. పాస్టరుగారి కుటుంబాన్ని పలుకరించి, మసగ్గా చీకట్లు పరుచుకొంటున్న సమయంలో ఇంటికి చేరేవాళ్ళు. మోకరించిఇద్దరూ ప్రార్థించి, భోజనాలు ముగించి, డాబాపైకిచేరితే...ఎన్ని కబుర్లు?! ఎన్ని చిలిపిఊహలు కొంటి చేష్టలు...?! రాత్రి త్వరగా తెల్లవారి పోయేది. రెండు సంవత్సరాలకు రవి పుట్టాడు తరువాత ఐదు సంవత్సరాలకు నిమ్మి. నిమ్మి పుట్టినప్పుడు తను మృత్యు ముఖంనుండి బైటపడింది, అది పసిగందుగా వున్నప్పుడు.

తన బలహీనతను బట్టి వారే ఎక్కువగా దాని సంరక్షణ చేయటం బట్టి అదంటే వారిక్కో ప్రత్యేకమైన ప్రేమ పైగా. రవి తరువాత ఐదు సంవత్సరాలకు పుట్టిందని కబోలు తనకూ నిమ్మి అంటే అదో అనురాగం రవీ, నిమ్మి ఇద్దరూ తనకు రెండుకళ్లు. తన ప్రాణం పిల్లల ముఖాలు గుర్తు రావటంతో లలిత కళ్ళల్లో నీళ్లు చిప్పిల్లాయి. తడి తుడుచుకోవాలన్న ధ్యాసలేనట్లు, కిటికీలోనుండి మినకు మినకు మంటున్న తైటుకేసి అలా చూస్తూ కూర్చుంది. రావ్ ఏదో కలవరిస్తున్నాడు ప్రక్కకూ వత్తిగిలుతూ. భర్త వంకకు చూచింది లలిత. ఆతను గురకలు పెట్టుతూ నిద్రపోతున్నాడు. పెళ్ళయిన క్రొత్తలో, పసివాడిలా, అమాయకంగా నిద్రపోతున్న వారి ముఖంలోనికి చూస్తూ ముంగురులు సవరిస్తూ, కూర్చునేది తను అలా ఎంత సేపయినా ఆ రూపం తలంచుకొంటే ప్రస్తుతం వారి ముఖం, ఎవరిదో క్రొత్తమనిషి ముఖంలా, వుంది. ఎంతటి మాన్పు! నిమ్మి తరువాత తనకు సంతానం కలుగరాపన్నారు. త్వరలోనే తన ఆరోగ్యం కుదుట బడింది జీవితం హాయిగా, జరిగిపోతూంది. అప్పుడప్పుడూ, కొన్ని ఆర్థిక ఇబ్బందులు, కలిగినా అవి అంత ఎన్నతగ్గవి కావు.

ఆ రోజు వారు తనకు ప్రమోషన్ రాబోతూందని చెప్పిన రోజు తను ఎంతగా సంతోషించిందీ! పిల్లలు ఎంతలా మురిసిపోయారు!! అనుకొన్నట్లు పెద్ద ఉద్యోగం రానేవచ్చింది. జీతంతోపాటు, హోదా, రెండు గదుల పోర్షను నుండి నివాసం రెండతస్తుల మేడకు మారింది నివాసం. ఇంటికి నిండుగా ఖరీదైన ఫర్నిచర్, పిలిస్తే పలికే నౌకర్లు, తనకు పట్టు చీరలు...పిల్లలకు ముచ్చటైన డ్రస్సులు వారు అందమైన సూటులో... ఓహ్! ఎలా వుండేది ఇల్లు? భూతల స్వర్గం అంటే, ఇలాంటిదే అనుకొనేది తను. కాని...ఆ తీయనికల...అవును అది కలే...చెదిరిపోను ఎక్కువరోజులు పట్టలేదు. ఆ రోజుల్లో డబ్బు అందించే సుఖాలకు, సౌఖ్యాలకూ, స్నేహితులకూ ఎంతచేరువయ్యారో, దేవునికి అంతదూరం

కథా నిలయం
489

అయారు. ఆ రాత్రి...తన ఆశాసౌధం కూలిపోయిన రాత్రి తన బంగరు కలలు పీడకలలా మాగిన కాళరాత్రి తమ ఇంటికి విందారగించను వచ్చిన పెద్ద మనుష్యులతో కలిసి, మధువు సేవించి, పడకచేరారు వారు. ఏదో వింత వాసన ఘాటుగా వుంది. అనుమానం పీడించింది. ఉదయం అది తిరి పోయింది. వారి బీరువాలో బట్టల క్రింద బ్రాందీ సీసాలు. తనకు తల తిరిగిపోయింది. కళ్లు చీకట్లు కమ్మాయి. వేయి సుత్తెలతో మోదినట్లు లోలోన ఏదో తెలియని బాధ...కుప్పకూలి పోయింది తను. వారి జవాబు విన్నాక; ఇక తనకు నవనాడులూ కృంగిపోయాయనిపించింది పైప్ పొగ విలాసంగా వొదులుతూ "ఆ...ఒక్కగుక్క కంపెనీకొరకు. పెద్ద మనుషులతో మరీ మడిగట్టుకు కూర్చుంటే మర్యాదగా వుండదు" అన్నారు ఎంతో తేలగ్గా ఆ తరువాత, తను ఎంతగానో ఏడ్చింది, బ్రతిమాలుకొంది, భయపెట్టింది. ఉహు...వారు మారలేదు. కాని వారి ప్రవర్తనా, మాటలతీరు మారిపోయాయి. ఇప్పుడు బైట త్రాగి, వస్తున్నారు-ఇష్టమున్నప్పుడు లేకుంటే అదీరారు. ఆ విషయం ఎక్కువకాలం దాగలేదు అందుకే తను గుడికి వెళ్ళటం మానివేసింది. ఒకటి రెండుసార్లు, వెళ్ళినా, అందరూ తన వంకే చూస్తూ హేళనగా నవ్వినట్లు అనుమానం. బైటకు వెళ్ళటం పూర్తిగా మానివేసింది. ఇది వరకులా తమ ఇంటికి క్రైస్తవ స్నేహితులు రావటం లేదు. ప్రార్థనకూటాలు జరగటంలేదు. తన బాధను అర్థం చేసికొనలేని కొందరు "గొప్ప వాళ్ళయారుగా? ఇహ దేవునితో, గుడిలో ఏం పని?" అటూ వ్యంగ్యంగా ముఖంమీదే నవ్వుతున్నారు ఏమి చేయలేని తన నిస్సహాయతను, అన్ని ఎరిగిన ఆ పరమ తండ్రికి నివేదించుకొంటూంది...అంతే...ఆలోచనల భారంలో లలిత కలతనిద్రలోనికి జారుకొంది.

తెల్లవారింది భారంగా. యాంత్రికంగా పనిపాటల్లో పడింది లలిత. తెల్లవారి కుటుంబ ప్రార్థనకూ వారు లేవలేదు. పిల్లలు బడికి వెళ్ళే వేళకూ

లేవకేదు తండ్రి లేస్తే రాత్రి డ్రామా కబుర్లు చెప్పాలని వువ్విళ్ళూరు తున్న నిమ్మి నిరాశతో వెళ్ళిపోయింది.

ఆ రోజు నిమ్మి పుట్టిన రోజు పండగ క్యాంపు వెళ్లతున్నానని నాలుగు దినముల క్రిందట వెళ్ళిన రావ్. ఆ ఉదయమే, తిరిగి వచ్చాడు. ముభావంగా తన పనులు ముగించుకుని. తిరిగి ఆఫీసుకు బయలుదేరే ప్రయత్నంలో వున్నాడు. లలిత వెనగ్గా వెళ్ళి చిన్నగా పిలిచింది. ఏమి టన్నట్లు ఎటోచూస్తూ నుంచున్నాడు. "ఈ రోజు... నిమ్మి పుట్టిన రోజు సాయంకాలం త్వరగా వచ్చేస్తారుకదూ" అంది వేడుకోలుగా, రావ్ ముఖం సంతోషంతో విప్పారిందో క్షణం. నిమ్మి స్నానం ముగించే వరకూవుండి. ఎత్తుకుని, బుగ్గలు పుణికి, ముద్దులు కురిపించి, కారెక్కాడు. ఎంతో కాలంగా పేరుకు పోయిన దుఃఖం ఎవరో చేయిపెట్టి తీసినట్లు ఎంతో హాయిని అనుభవించింది లలిత. ఆమె మనస్సు ఎంతో తేలిగ్గా. ఆనం దంతో పొంగిపొర్లుతోంది. వెంట వెంటనే పనులన్నీ జరిగిపోయాయి. సాయంకాలం అవుతోంది నిమ్మిని, రవిని, తయారుచేసి. తనూ వాకిష్ట మైన చీర కట్టుకుంది. తలలో జాజులు తురుముకుంది కాపురంలోని తొలి దినాలు గుర్తుకొచ్చి సిగ్గుగా నవ్వుకొంది. ఎన్ని రోజులకో తల్లి ముఖంలో కనిపిస్తున్న ఆనందం తాలూకు మెరుపులు చూచి, పిల్లలు తెగ సంబర పడిపోయారు.

సాయంకాలం నిమ్మి స్నేహితులంతా వచ్చారు, చినచిన్న కానుక లతో. పిల్లంతా పిల్లల పాటలతో, మాటలతో, కేరింతలతో. నవ్వులతో, సందడిస్తోంది. అందరికీ అన్నీ, అమరుసూనే, లలిత భర్త రాక కొరకు ఎదురుచూస్తోంది. పార్టీ మగిసింది. ఆహ్వానితులందరూ ఒక్కొక్కరే వెళ్ళిపోయారు లలిత హృదయం లోలోన రోదిస్తున్నా, పిల్లలకొరకు లేని, ఉత్సాహం నటించింది. "మమ్మీ ! డాడీ రానేలేదు.." అందరూ వెళ్ళాక బావురుమంది నిమ్మి. రవికి వాళ్ళ నాన్నగారిమీద చాల కోపమే

వచ్చింది. "రాకపోతే — పార్టీ జరగలేదా ఏం?" ఉన్నాడు రోషంగా ముక్కు పుటాలు ఎగురవేస్తూ. బిత్తర పోయింది నిమ్మి అన్నకోపం చూచి మరుక్షణం ఏడవసాగింది. పిల్లలిద్దరినీ దగ్గరగా తీసుకొంది లలిత. "ఏడవకూడదమ్మా పుట్టినరోజుపండక్కి ఎవరన్నా ఏడుస్తారే.టి? డాడీకి ఏదో పనివుండి వుంటుంది. వచ్చేస్తారుగా ... నీవు మాట్లాడకు డాడీతో; ఏం? మరి...లే...భోజనం చేద్దుగాని. రా, బాబూ! రవీ..." అంటూ పిల్లలను లేవదీసింది లలిత. రవి అన్యమనస్కంగా వీడో తిన్నా ననిపించి లేచి వెళ్ళిపోయాడు. నిమ్మి తనకేమి వద్దంటూ, కాసిన్ని పాలు త్రాగి వెళ్ళి పడుకొంది. అన్నంచిమీద మూతలుంచి, లలిత, నిమ్మిప్రక్క చోటు చేసికొని పడుకొంది. నిమ్మి నిద్రపోతుందనుకొన్న లలిత బిడ్డను దగ్గరగా పొదవుకొంటూ, రోదించసాగింది. కాని, నిమ్మి, రవీ ఇద్దరూ మేలకొనే వున్నారు. ఇద్దరూ ఒక్కసారిగా "మమ్మీ...మమ్మీ" అంటూ, ఏడువసాగారు. లలిత తను చేసిన తప్పు గ్రహించింది. కట్టలు తెంచుకుని ప్రవహిస్తున్న దుఃఖావేగాన్ని ఎంతో నిగ్రహంతో కట్టలవేసి, "ఏమిటర్రా, ఏమయింది. కలవచ్చిందా? భయపడ్డారేంటి?" అంటూ దగ్గరగా తీసుకుని "కథ చెప్పనా?" అంటూ, ఎదోకథ చెప్పసాగింది. పిల్లలు అలాగే తల్లిముఖంలోనికి చూస్తూ కూర్చున్నారు. కథ వినలేదు వాళ్ళు ఆ చీకటి రాత్రిలో, వొంటరిగా ఆ గదినో, తల్లి అలా మాట్లాడుతూంటే, వినటం వాళ్ళకేదో ధైర్యాన్ని కలిగిస్తోంది అంతే. ఉన్నట్టుండి అంది నిమ్మి, "మమ్మీ: ఈ రోజు మనం ప్రార్థన చేయలేదు." "నిన్న కూడా" అందుకొన్నాడు రవి. పిల్లల మాటలకు సిగ్గుపడింది లలిత. నవ్వుతూ "అవునవును రండి ఈ మంచం దగ్గరే చేద్దాము" అంటూ మోకరించిది. పిల్లలూ అనుకరించారు. ప్రార్థన ముగిసింది. త్వరలోనే పసివాళ్ళు నిద్రపోయారు. లలిత లేచి, గదులన్నీ సర్దింది. పిల్లల తా వెళ్ళాక ఇల్లు బావురు మన్నట్లు వుంది. అటు వస్తువిటూ, ఇటు వస్తువటూ పెట్టింది. అయినా సమయం గడుస్తున్నట్లులేదు. ఏదో తెలియని ఒంటరి తనం.....

డైనింగ్ టేబిలు దగ్గర కెళ్ళింది పదార్ధాలన్నీ చప్పగా చల్లారి పోయాయి అన్నీ నిమ్మికి, వాడికి ఇష్టమైనవే. నిట్టూరుస్తూ, మూతలు సవరించింది. పింగాణి గిన్నెలో నిమ్మి తినకుండా వుంచిన ఫ్రూట్ సలాడ్ నుంచి ఎర్ర చీమలు బారులు తీర్చి వెళ్ళటం చూడగానే, లలిత ప్రాణం చివుక్కుమంది. గొంతులో ఏదో అడ్డుపడినట్లు బాధ..... "పిచ్చితల్లి ! డాడీ వచ్చాక ఇద్దరం కలిసి తింటాము." అంటూ అట్టే పెట్టింది. ఎంతసేపు ఎదురు చూచింది తండ్రి కొరకు. నిట్టూరుస్తూ వెళ్ళి, గదిలో కూర్చుంది. అలా ఎంతసేపు కూర్చుందో "మమ్మీ" అంటూ, నిమ్మి వోడిలో వొరగంటంతో, వులిక్కి పడింది. నిమ్మి వీపుపై నిమురుతూ, "నిద్రపోలేదా తల్లీ"? అంది. నిమ్మి ఏమీ మాట్లాడలేదు తన చిన్న చిన్న చేతులతో, తల్లి కళ్ళు తుడిచి, వోడిలో నుండి లేచి వెళ్ళింది. ఈగల్లా ముసురు కొంటున్న ఆలో చనలతో సతమతమవుతూ, మానసికంగా, ఎక్కడో వున్న లలిత, వున్నట్లుండి, చెవులు చిల్లులు పడేలా, ఎవరో వేసిన చావు కేక, అతి భయంకరంగా, కర్ణపుటాలను దూసుకు వెళ్ళగా, పిచ్చిగా బైటకు పరుగు పెట్టింది. లైటు వేసింది. అంతే కెవ్వున అరుస్తూ, నెత్తురులో కొట్టుకుంటున్న నిమ్మి మీద వాలి పోయింది. ప్రాగుడు మైకంలో జరిగిన ఘోరం అర్ధం కాని రావ్, కారుదిగి, నడక రాదన్నట్లు వూగుతూ ముందు గది వరకూ వెళ్ళి పడి పోయాడు. చటుక్కుమని లేచి నుంచుంది లలిత కర్తవ్యం గుర్తు రాగా వెంటనే డాక్టరుకు ఫోను చేసింది నిమ్మికి స్పృహ లేదు

తెల తెల వారుతోంది. మెలకువ వచ్చింది. రావ్‌కు, కళ్ళు విప్పి చూచాడు ఏమిటిదీ ? తను కటిక నేల మీద పండుకుని వున్నాడు. ? సిగ్గు పడుతూ చుట్టు చూచాడు. ప్రయత్న పూర్వకంగా లేచి, తూగుతూ గది బయటకి వచ్చాడు అరే ..... అదేమిటీ ? అవి రక్తం కదూ ? ఎవరిదీ ? ఎలా వచ్చిందక్కడకు..... వణుకు తున్న కాళ్ళను అదుపు లోనికి తెచ్చుకుంటూ, మేడ మీదకు దారి తీశాడు. గదులన్నీ నిశ్శబ్దంగా

వున్నాయి. మెల్లిగా తన పడక గది తలుపు తోశాడు లలిత మోకాళ్ళని ప్రార్థిస్తోంది. ఆమె పెదాలు పెను తుపానులో చిక్కుకున్న చిగురు టాకులా గజ గజ వణికి పోతున్నాయి శుష్కించిన చెంపల మీద కన్నీటి చారికలు.....ముఖం మీద అలుముకొన్న వెంట్రుకలు. చెమటా,కన్నీటిలో తడిసి అంటుకు పోయాయి ఆమె ప్రక్కనే, రవీ..... రెండు చేతులూ జోడించి ప్రార్థిస్తున్నాడు, వెక్కుతూ నిమ్మి ఏదీ? నా ప్రియమైన నిమ్మి నా ప్రాణం..... నా తల్లి..... ఒక్క పరుగులో ప్రక్క గదిలోనికి వెళ్ళాడు రావ్. అంతే ఒక్క క్షణం విద్యుద్ఘాతం తగిలిన వాడిలా మాన్పడి పోయాడు దుఃఖం కంఠంలో సుడులు తిరుగు తుండగా. ఒక్క సారిగా పోలికేక పెట్టాడు నిమ్మిఅంటూ ప్రక్కనే కూర్చుని పల్స్ చూస్తున్న నర్సు, సిరంజీలోకి మందు ఎక్కిస్తున్న డాక్టరూ ఒక్కసారి అతని వంకకు యధాలాపంగా చూచి, తిరిగి తమ పనులలో నిమగ్నులయారు. నిమ్మి తల మీద నెత్తుటితో తడిసిన కట్టు సవరిస్తూ, జీవం లేనట్టు ఆ చిన్నారి ముఖంలోనికి చూసూ పిచ్చి వాడిలా నుంచుండి పోయాడు రావ్. తన ఉనికినే గమనించని చనట్టున్న వారిద్దరినీ ప్రశ్నించను ధైర్యం చాలింది కాదు. అయినా ఎలాగో నోరు పెకల్చుకుని ఏదో అడగ బోయాడు. అంతలో ఎవరివో హస్తం భుజాన్ని తాకింది. వెను తిరిగి చూచాడు. పాస్టరు గారు. తను ముఖం చూపించ లేక, ఇన్నాళ్ళూ ఎవరిని తప్పించు కొంటూ తిరిగాడో, ఆ పాస్టరు గారు. సిగ్గుతో కుంచించుకు పోయాడు రావ్. ఏదో అడగాలనుకొన్నాడు కాని పెదాలు విడి పడలేదు. నవ్వాలను కొన్నాడు పలుక రింపుగా అదీ సాధ్య పడింది కాదు.

పాస్టరుగారు, రావ్‌ను మెల్లగా ప్రక్క హాల్లోనికి, నడిపించు కెళ్ళారు సోఫాలో కూర్చున్నాక కాఫీ అందించారు. యాంత్రికంగా అందుకుని ఒక్క గుక్కలో ఖాళీచేశాడు రావ్. తన ఇంటిలోనే, తనకు మరోకరి ద్వారా అతిధి మర్యాదలు. వింతగాలేదూ! చివరకు ఎలానో

నోరు పెగల్చుకుని ప్రశ్నించాడు పాస్టరు గాకిని "ఎలా జరిగిందండీ, నా చిట్టి తల్లికి అంతటి ప్రమాదం?"

"కారుకింద పడింది" తాపీగా వుందా జవాబు.

"ఎవడా కారునడిపిన వెధవ? అంత వళ్ళు తెలీకుండా....."

అతను కోపంతో బుసలు కొట్టాడు.

"ఆ...ఎవడో త్రాగుబోతు..." ఎటో చూస్తూ జవాబిచ్చారు. చెళ్ళున చెంపమీద గుద్దినట్లయింది రావ్‌కు. ఒక్క నిమిషం మౌనం.

"మరి...మరి ఆ కారు నంబరూ అదీ నోట్ చేశారటనా?"

"ఆ...ఆ...దాని నెంబరు....." చెప్పారాయన.

అది వింటూనే ఒక్క క్షణం కొయ్యబారిపోయాడు రావ్. "ఏమిటీ ఏమిటండీ మీరంటున్నదీ?! ఆ నంబరు మా కారుదేనే.....అంటే... అంటే...నానిమ్మ, నా కారుకిందే...ఆ ..ఆ" రావ్ చిన్నపిల్లాడిలా వెక్కి వెక్కి ఏడవసాగాడు. అంతలో అక్కడికి వచ్చిన రవి అందు కొన్నాడు. "అవును మీరే...మీరే కారును నిమ్మి మీదకి ఎక్కించారు. చెల్లి పుట్టినరోజు పండక్కి మీరు పార్టీకి రాలేదని ఏడుస్తూ వాకిట్లో కూర్చుంది". కోపంలో వణికిందతని కంఠం. రావ్‌కు అర్థం అయింది. పిచ్చివాడిలా జుట్టు పీక్కుంటూ, పరుగు పరుగున వెళ్ళి నిమ్మి మంచం పక్కన నేలమీద చతికిల పడ్డాడు. "అమ్మా నిమ్మి, నా చిట్టితల్లీ ...నేను కిరాతకుడినమ్మా. నన్ను క్షమించు తల్లీ...ఒక్కసారి కళ్ళు విప్పి నన్ను చూడమ్మా...తల్లీ ..డాక్టర్ ! నా చిట్టి తల్లిని బ్రతికించండి. నా రక్తం తీసుకోండి...డాక్టర్ నా తల్లికి నా ప్రాణం పోయండి....తల్లీ నిమ్మి..." గోడుగోడున ఏడుస్తున్న రావ్‌ను, మెల్లిగా బైటకు నడిపించారు పాస్టరుగారు ఇద్దరూ స్థిమితంగా కూర్చున్నాక అతి నెమ్మదిగా అన్నారు పాస్టరుగారు..."చూడండి, రావ్‌గారూ! మీరు దుఃఖించి ప్రయో

జనంలేదు. ఇంకా కొన్ని గంటలు గడిస్తే తప్ప ఏ సంగతీ చెప్పలేమంటు న్నారు డాక్టరుగారు. మరి...మనం, మరో పెద్ద డాక్టరును సంప్ర దిద్దామా?" వెంటనే జవాబిచ్చాడు రావ్..... "అవును పాస్టరుగారు... తప్పక పెద్ద డాక్టరు దగ్గర కెళ్దాము. మీకు తెలిసిన వాళ్ళున్నారా?" "ఆ వున్నారు ... మీకూ అతనితో ఇది వరలో పరిచయం ఉంది." "రండి మరి— త్వరగా వెళ్ళాలి". లేచి నుంచున్నాడు రావ్. అతని చేయందుకుని తిరిగి కూర్చుండ బెట్టుతూ గంభీరంగా అన్నారు పాస్టరు గారు..."డాక్టరు కొరకు ఎక్కడకూ పోనక్కరలేదండి. అదుగో ఆయనే పరమ వైద్యుడు...ఆయన్ని అడుగుదాం..." కనులెత్తి చూచాడు రావ్. ఎదురుగా వాత్సల్యపూరితంగా నవ్వుతోన్న క్రీస్తు దేవుని పాలరాతిప్రతిమ. ఒక్క క్షణం నిర్ఘాంత పోయాడు రావ్. మరు క్షణం, అక్కడే మోక రించాడు. కన్నీటితో...కరుణానిధీ...దయామయుడా! ప్రేమ స్వరూపీ! నా తల్లిని కాపాడు....నా పాపముల నిమిత్తం, నా పాపాయిని శిక్షించ కయ్యా...నీ దయను బట్టి క్షమించు...క్షమించు..." ప్రార్థన కొనసా గింది ప్రార్థిస్తున్న రావ్ ఒక్క క్షణం ఆగి, ఏదో ఆలోచించి, తిరిగి ప్రార్థిస్తున్నాడు, "ప్రభూ నా బిడ్డను బ్రతికించు. నా చిట్టి తల్లిని కాపాడు. ఇక నేను త్రాగుడు ముట్టను...ప్రమాణం చేస్తున్నాను ప్రభూ! నన్ను క్షమించు..." ప్రార్థన అలా సాగింది కొంత తడవు. రావ్ ప్రార్థన తిరిగి మరో విధంగా మారింది. "ప్రభూ! నీ చిత్తమైతే, నిమ్మిని తిరిగి మాకు అనుగ్రహించు. లేదా...నీ చిత్తమే సిద్ధించుగాక ...కాని ప్రభూ! నేను ఇక త్రాగను...ఇదుగో నీ సన్నిధిలో ప్రమాణం చేస్తు న్నాను....ఈ శోధనను జయించుటకు నాకు బలం అనుగ్రహించు దేవా! నన్ను బలపరచు..."ప్రార్థన సాగిపోతూంది. నిమిషాలు, గంటలు దొర్లి పోయాయి. నిమ్మి కళ్ళు విప్పి చూచింది. అందరినీ చిరుదరహాసంతో పలుకరించింది. గండం గడిచిందన్నారు డాక్టరు గారు. అందరి

మనస్సులూ ఆనందంతో నిండగా, తేలిగ్గా విశ్వశించారు. కాని మరో విషయం అన్నారు డాక్టరు అందరి వంకా చూస్తూ.....“ఎక్స్‌రే తీసి కాని, కాలు విషయం చెప్పను వీలు కాదు. పిప్పి అయిన కాలు తీసివేయ వలసి రావచ్చు....లేదా కట్టుతో చక్కబడుతుందో.....” గదంతా విచిత్రమైన నిశ్శబ్దం అలుముకొంది. అంతటి భయానకరమైన వార్త విసీ, రావ్ చలించలేదు. నిమ్మీ బుగ్గలు ముద్దాడి, మౌనంగా గది విడిచి బైటకు వచ్చాడు ఆ విషయం పెద్ద డాక్టరుతో సంప్రదించను. మోకాళ్ళాని ఆయనతో మాట్లాడటం మొదలు పెట్టాడు, అతని ముఖంలోని వింత వెలుగూ ధైన్యంతో కూడిన తేజస్సూ, ప్రార్థనలోని బలం చూచి, అందరూ అచ్చెరువొందారు. ప్రార్థన సాగుతోంది. ఈ మారు తన ప్రక్కనే మోకరించిన భార్యనూ, కుమారునీ అతను గమనించనేలేదు. నిమిషాలు, గంటలయాయి. కాలం సాగుతోంది. రావ్ ప్రార్థించటం మానలేదు....అతను ప్రార్థిసూనే వున్నాడు...విసుగు...విరామం లేక ప్రార్థిస్తున్నాడు. *

కొత్త దారి

పి. జె. క్రిష్టఫర్
చిలకలపూడి

ఆ రోజు నెలలో రెండో శనివారం. సుధాకర్ ఆఫీసుకు వెళ్ళాల్సిన పనిలేదు. తీరుబడిగా యింట్లో పిల్లల చదువు పరిశీలిస్తున్నాడు. ఆర్థికంగా అనేక యిబ్బందులకు బలిఅవుతున్నప్పటికిని తన బిడ్డల ఉన్నతవిద్యను గూర్చిన ధ్యేయం ఎక్కువ. వారి భవిష్యత్‌కోసం ఎన్నికష్టాలయిన ఎదుర్కొడానికి సిద్ధపడి తన సంసార సాగరాన్ని ఈదుతున్నాడు. ఇంతలో 'టెలిగ్రాం సార్' అని కేక. ఆత్రంగా కవరు చింపాడు. చేతులు వణికినట్టయినాయి. తనకు తెలీకుండానే చిరుచెమట్లు ముఖాన్ని ఆవరించాయి. ఆదుర్దాగా అతడివైపు చూస్తున్నారు పిల్లలు. ఒకడు పరుగెత్తి తల్లికి

చెప్పాడు "టెలిగ్రాం ఏమిటండీ" అంటూ ఆదుర్దాగా వచ్చింది సరళ. "ప్రభాకర్ సీరియస్ స్టార్ట్ ఎట్ వన్స్" అని వుంది. అందరి ముఖాల్లో నీరసం, హృదయాల్లో విచారం ప్రతిబింబించాయి. 'అదేమిటండీ అటూ యిటూ తిరుగుతూ ఆలోచిస్తారు. త్వరగా బయలుదేరండి, పాపం ఏం జబ్బో ఏమో' అంటూ ప్రయాణసన్నాహాలు చేసింది యిల్లాలు.

"ఏముఖంపెట్టుకొని వెళ్ళమంటావేఁవాళ్ళకి లేకపోతేనాకన్నా ఉండక్కర్లేదుసిగ్గు.....?" అంటూ తనక్రోధాన్ని ఒక్కసారి వెళ్ళగక్కాడు "సొంత రక్తం పంచుకొని పుట్టాడు చావుబ్రతుకుల్లో ఉండి చూడ్డానికి రమ్మంటే మీ ధోరణి మార్చుకోపోతే ఎలాఁ ఎవరన్నావింటే అప్రదిష్ట కూడాను. పొరుగువాని ప్రేమించాలి- ఒక చెంప కొడితే రెండో చెంప తిప్పాలి. నీకుద్రోహం చేసినవాన్ని క్షమించాలి- అనేప్రచారాలన్నీ ఎవరికోసంఁ మనకు అన్యాయమే చేశాడనుకో... కాని ఈ సమయంలో మీరు తప్పకవెళ్ళాల్సిన బాధ్యత ఉంది" అంటూ వేదాంతం బోధించింది సరళ. ఎన్ని అభ్యంతరాలు చెప్పినా సరళ పట్టుబట్టి ప్రయాణానికి సిద్ధం చేసి సాగనంపింది.

తనకు మనస్ఫూర్తిగా యిష్టంలేకపోయినా సుధాకర్ బయలు దేరాడన్నమాటేగాని మనస్సు మనస్సులో లేదు. రైల్లో మనిషి కూర్చున్నాడేగాని తనకు తెలీకుండానే మనస్సు తిరోగమనంచేసి గత జీవిత పుటల్ని తిరగవేసింది—

ఈనాడు చావుబ్రతుకుల్లో ఉన్న తమ్ముడు ప్రభాకర్ తను తండ్రి చనిపోయినప్పటికి 12సం॥ పిల్లాడు. అప్పటికే వారికి తల్లిపోయింది. ఆ మరుసటి సంవత్సరం పెళ్ళిచేసుకొని కుటుంబ బాధ్యతలన్నీ మీద వేసికోవలసి వచ్చింది పెళ్ళయిన కొత్తలో ఎల్ డి సి గా చేరిన సుధాకర్ తన నిజాయితీని ప్రదర్శించి త్వరలోనే యు డి సి అయ్యాడు. తన ప్రమోషన్‌తోపాటే సంతానం కూడా ప్రమోట్ అయింది. అయిదుకు

పెరిగింది. భారం ఎక్కువైంది ఉద్యోగంలో వచ్చిన ప్రమోషన్ భారం కంటే సంతానం సంఖ్యలో ప్రమోషన్ వల్ల కలిగిన భారం ఎక్కువగా వున్నట్లు బాధపడ్డాడు. ఏదో తప్పుచేసిన వాడిలా వాపోతున్నాడు. ఇంత భారం భరిస్తూ గూడా తన కంటే తన తమ్ముడు ఎక్కువ చదవాలని ఆశించి 'ప్రభా! నీవు పట్టుదలతో చదివి పాస్ కావాలి' అని అంటూ తన ఆప్యాయతను వెలిబుచ్చుతూండేవాడు. ప్రభాకర్ బి. ఏ. పాస్ అయ్యాడు. సుధాకర్ తన పలుకుబడితో తమ్ముణ్ణి ఉద్యోగంలో చేర్పించాడు. తన చేతికి తోడయ్యాడు.

సరిగ్గా సంవత్సరానికి తమ్ముడిని కూడా ఒక యింటివాణ్ణి చేసాడు. చదువుకున్న భార్యా, చదువుకు తగ్గ ఉద్యోగం - ఉద్యోగానికి తగ్గ రాబడి, ఇదరూ ఉద్యోగం. తమ్ముడి సంసారం బాగుందని ఆనందించాడు సుధాకర్. మళ్ళీ సంవత్సరం తిరిగి వచ్చేసరికి అన్నదమ్ముల ఆప్యాయతా, అనురాగాల్ని "స్వార్థం' అనే విషపురుగు మట్టుపెట్టింది. రెండు కుటుంబాలు దూరమయ్యాయి. హృదయాలు నరకతుల్యమయ్యాయి. 'నా సంపాదనతోనే అన్న పెళ్ళి చేశాడు. నాన్న విడిచిపెట్టి పోయిన ఎకరం పొలం భాగం యివ్వడం లేదు'. నేరారోపణ చేసాడు. అన్నమీద ఇదే కారణంగా ఇద్దరి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

ఎనిమిది సంవత్సరాల తర్వాత యిప్పుడు ప్రయాణం చేయవలసి వచ్చింది ప్రభాకర్ దగ్గరకు. కుటుంబ భారం పెరిగిపోవడంతో చాల కరువు అనుభవిస్తున్నప్పుడు — మరోసారి తీవ్రంగా జబ్బుపడ్డప్పుడు తనెంతో పెంచి చదివించి, ఉద్యోగం సంపాదించి పెళ్ళి చేసిన తమ్ముడు ఆదుకోలేకపోయాడనే కోపం, క్రోధం పెచ్చు పెరిగాయి సుధాకర్‌కి. తన రక్తంలో భాగం పంచుకున్నాడు. కష్టార్జితంలో భాగం పంచుకున్నాడు. కాని యిబ్బందిలో భాగం పంచుకోలేదు సరికదా ఎకరం పొలం పంటలో భాగం దగ్గర పేచీ పెట్టుకున్నాడు, ఎంత నిర్మొగమాటము,

ఎంత న్యాయం. పిల్లలతో సతమత మవుతున్నానని జాలి చూపలేక పోయాడు కొంత కాలమైనా?..... సరే ! నా కన్నీళ్ళు తుడిచేవాళ్ళు లేకపోయినా ఇతరుల కన్నీళ్ళు తుడవడానికి వెళ్తున్నానని తృప్తితో పయని స్తున్నాడు.

* * * *

ప్రభాకర్ పెళ్ళి అయినప్పటినుంచి ఆర్థిక స్థోమత పెరిగింది. ఒకే ఆడపిల్ల సంపాదన బాగుంది. ఆనందంగా జీవిస్తున్నారు. "ఒకరు లేక యిద్దరు చాలు", "సౌభాగ్యానికి మూలం పరిమిత కుటుంబం" అనే నినా దాలు ప్రభాకర్ జీవితంలో వాస్తవం అయ్యాయి. తన ఆర్థిక వనరులను బట్టి ధర్మకార్యాలను పేదసాదల్ని ఆదరించడంలో వెనకాడేవాడు కాడు.

ఒక రోజు తన స్నేహితుడు ప్రసాద్ వద్దకు వెళ్ళాడు. ప్రసాద్ అంటే ఒక విధమైన గౌరవం అభిమానం, మొదటి పరిచయంలోనే పుట్టు కొచ్చాయి. అతని దైవభక్తి, నిజాయితీగల పనినైపుణ్యత, స్నేహపూరిత మైన వైఖరి ప్రభాకర్‌ని ఆకర్షించి ఆనందపరిచాయి. ప్రభాకర్ వెళ్ళే సరికి ప్రసాద్ మనిఆర్డరు ఫారం దగ్గర పెట్టుకొని డబ్బు లెక్కపెట్టు కుంటున్నాడు. "ఎవరికి డబ్బు పంపిస్తున్నావు?" అని ప్రశ్నించాడు. "ప్రతినెలా ఇంటికి యాభైరూయలు పంపుతాను. ముగ్గురు తమ్ముళ్ళు పూర్తిగా నామీదనే ఆధారపడి వున్నారు. ఈ నెల్లో ఎక్కువ పంపించా లనుకున్నాను. పండగకు బట్టలు వగైరాలు కావలసి ఉంటాయి. ఒక యాభైరూపాయలుంటే సర్థుతావేమిటి?" అదే సమయానికి తన దగ్గర డబ్బున్నందుకు యిచ్చి తను వచ్చిన పని కూడా పూర్తిచేసుకోకుండా తిరుగు ముఖం పట్టాడు. ప్రసాద్ దగ్గర జరిగిన సంఘటన ఎంతో కల వరపరచింది ప్రభాకర్‌ను. ఇంటికి వస్తున్నప్పటికి తన ఆలోచనలు చిత్రవధ చేసాయి. "నీవు ఎవరి సహాయంతో ఈ స్థితికి వచ్చావు?" అని

అంతరాత్మ నిలదీసింది. ఆఫీసుకు వెళ్తున్నాడేగాని మనస్సు వికలం అవుతుంది. ఏదో తీరని ఆవేదనతో మధన పడుతున్నాడు రెండు రోజులు సెలవు పంపాడు.

మొదటి రోజు క్రాంతి ఆలోచనలతోనే మగత నిద్ర పట్టింది. కొంత సేపటికి వ్యాధులన్నీ మరచిపోయి గాఢంగా నిద్ర పట్టింది. ఏదో దృశ్యం కండ్లకు కట్టినట్టయింది. ఎవరో ఆకాశానికో నిచ్చెన వేసారు. చాల మంది ఎక్కి-పోతున్నారు. తెల్లని దుస్తులు ధరించిన కొందరు తిరిగి వస్తున్నారు. తనకు కూడా ఎక్కాలని బుద్ధిపుట్టింది. వెదకబోయిన తీగె కాలికి తగిలినట్లు ఎవరో పిలిచారు ఎక్కడానికి రమ్మని. ఆ పిలుపుకు త్రుళ్ళిపడి లేచాడు. ఎవరూ లేరు ... అప్పుడర్థమయింది కల అని. తెల్లారడానికి యింకా చాల సమయముంది. పడుకొని కలను గూర్చి ఆలోచించాడు. ఈ ఆలోచనల్లో తనలాటి మరో వ్యక్తిని కనుగొన్నాడు బైబిల్లో. వెంటనే అనుకొన్నాడు దేవుడేదో పాఠం నేర్పుతున్నాడు అని. తక్షణమే టెలిగ్రాం యిచ్చాడు అన్నకు. సుధాకర్ ప్రయాణమయ్యాడు

"అన్నయ్యా క్షమించవూ ? తప్పు చేసాను" అని వచ్చిన అన్నను చూసి ప్రభాకర్ ఏడ్చాడు "క్రైస్తవ కుటుంబంలో పుట్టి పెరిగి అంతా తెలిసినా స్వార్థం నీ ఆపదల్లో సాయం చేయనీలేదు - మన జీవితంలో అనేక సంఘటనలు జరుగుతుంటాయి. జరిగినవన్నీ గుర్తుండకపోవచ్చు. గుర్తున్నా అవి ప్రయోజనంలేని స్మృతులు కావచ్చు లేదా ఊహా ప్రపంచంలో ఆనందింపజేసేవి కావచ్చు కాని వాటిలో కొన్ని జీవితాలను మార్చివేస్తాయి. అయితే వాటిని మనం జాగ్రత్తగా పరిశీలించాలి. అలాంటిదే నా జీవితంలో ఒకటి జరిగింది." ఈ మాటలు వింటుంటే సుధాకర్ ముఖం విప్పారింది. గతంలో పడిన బాధలన్నీ దేవుడు దించేసాడనిపించింది.

"తమ్ముడూ నన్ను కూడ క్షమించవూ ? కోపం, క్రోధం అనేవి నీకు మరింత దూరం చేసాయి నన్ను"- అంటూ తన హృదయభారాన్ని దించేసుకున్నాడు. ద్వేషాలు పోయి ఏదో అవ్యక్తమైన అనురాగం పొటమరించింది ఇద్దరి మధ్య. శ్రద్ధకి, అనురక్తికి దూరమైన అన్నదమ్ముల హృదయాలలో వేయి వీణలు ఒకేసారి లలిత మనోజ్ఞకంగా మీటినట్టయింది. ఏదో నూతనానుభూతిలో గడిపేసారు ఆ రోజు.

మరుసటి రోజు ఉదయాన కాఫీ ముగిసాక తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాడు సుధాకర్ - సాయంత్రం వెళ్ళవచ్చులే అన్నయ్యా-అని అడ్డగించి, సుజాత సలహాతో బయలుదేరి బజారుకు దారి తీసాడు ప్రభాకర్. సరాసరి బట్టలకొట్టుకెళ్ళి అయిదు వందల రూపాయలు బట్టలు తీసారు కుటుంబం అంతటికీ. సుజాత సలహాతో మరో చోటికివెళ్ళి లెదర్ సూట్‌కేసు కొని బట్టలు దానిలోపెట్టి యిల్లు చేరుకున్నారు "కొత్తదారిలో ప్రవేశిద్దాము, ఐక్యంలో ఉన్న ఆనందం ఎడబాటులో లేదు. మన రెండు కుటుంబాలు దూరంగా ఉన్నా ఒకటిగా ఉండాలి రెండూ రెండూ ఒక్కటేకావాలి. అలా కాకుండా ఉండటానికి మూలం స్వార్థం ఇది మా అనుభవం దాన్ని అధిగమించినప్పుడు మనం ఒక్కటే అవుతాం. అలానే కావాలని ఆశిస్తూ—

చెల్లి
'సుజాత'

ఉత్తరం, వంద రూపాయల నోటు, మడిచి కవరులో పెట్టి అంటించి దానిమీద క్రొత్త సంవత్సరపు బహుమతులు అని వ్రాసింది.

దేవప్రియ

ఐ. ప్రేమలీలారావు,

పెద్దాపురం.

దేవప్రియ భక్తిగల క్రైస్తవ కుటుంబములో పుట్టింది. పసి తనంలోనే తండ్రిని కోల్పోయిన చిన్నారి బిడ్డ దేవను అతి గారాబంతో పెంచింది తల్లి. వొత్తయిన నల్లని ఉంగరాలు తిరిగిన తల వెంట్రుకలతో- నీలాల వంటి విశాలమైన నవ్వే కళ్ళతో- పసిమివన్నె ఛాయలో అందమూ, సౌకుమార్యం మూర్తీభవింప జేసికున్న కుమార్తెను చూసినప్పుడల్లా తల్లి "ప్రభూ! ఈ బిడ్డను నీ సేవ కొరకే అంకితం చేస్తాను. నీ పవిత్ర పాదాలకొక సుమ మాలగా ఈ బిడ్డను అంగీకరించు" అంటూ ప్రార్థనలు చేసికొనేది.

దేవప్రియ పెరిగి పెదదయింది. వయసుతో పాటు ఆమెలో యెన్నెన్నో కోరికలు పుట్టుకువచ్చాయి. తల్లికి కుమార్తె నొక ఉత్తమురాలయిన డాక్టరుగా తయారు చేయాలని ఆశ. కాని దేవప్రియ ఆశలు- ఆశయాలు మరో రీతిగా వున్నాయి. తానొక ఉత్తమ కళాకారిణి కావాలి. మనసులోని ఈ కోరిక బలీయం కాగా నృత్య గానాల్ని ఆసక్తితో నేర్చుకో సాగింది. తల్లిమాట కాదని నగరంలోని నృత్య పాఠశాలలో చేరింది దినాలు గడిచే కొలదీ దేవప్రియ నృత్య సంగీత పారంగతురాలయింది. కన్నతల్లి ఆశలన్నిటినీ అడియాసలు చేసిన దేవ తన నృత్య గాన కళా ప్రభావాన్ని నలుగురికీ చూపి మెప్పుపొందాలని ఆరాట పడుతోంది. "అమ్మా! నృత్యం నేర్చుకుంటానని ఆశపడ్డావు. ఇకచాలు. నీలోవున్న కళని దేవుని మహిమకొరకే వినియోగించు. నీ మిగిలిన చదువు పూర్తి చేసుకో" అంటూ తల్లి ప్రాధేయపడింది. దేవప్రియ ఆ మాటల్ని వింటూనే ఫక్కున నవ్వేసింది.

దేవప్రియ "రాణిబాల"గా మారింది. అనేక ప్రదేశాలలో ఆమె నృత్య ప్రదర్శనలు జోరుగా సాగిపోతున్నాయి. దానితోపాటే ఆమె చుట్టూరా అనేకమంది స్నేహితులు. ఆమె నృత్య గానాల్ని పత్రికలు ప్రశంసించాయి. ప్రజలు "ఒహోహో" అన్నారు. ఫలితంగా రాణీబాల లోని మనస్సాక్షి పూర్తిగా మూగవోయింది. ఆమె కన్నుల కేదో పొర కప్పివేయబడింది. ఆమె తన క్రైస్తవ మత ధర్మాల్ని, పాపభీతిని, మంచి - చెడుల విచక్షణా శక్తిని అన్నిటిని మరచిపోయింది.

బెల్లంచుట్టూ చేరే చీమల్లా ఆమె సౌందర్య, నృత్యగానాలకు పరవశులయిన స్త్రీ పురుష, శలభాలెన్నో ఆమె చుట్టూరా చేరినాయి. కన్న కుమార్తె పతన జీవితానికి తల్లి కన్నీరు మున్నీరుగా ఏడ్చింది.

*　　*　　*　　*

ఒకనాటి అర్ధరాత్రి. రాణిబాల యింకా యింటికి చేరుకోలేదు.

కుమార్తె కోసం నిద్రాహారాలు లేక యెదురుచూడ సాగింది తల్లి. ఇంటి ముందు కారాగింది. కారులోనుండి అతి వయ్యారంగా దిగి లోపలకు వస్తోంది రాణిబాల. లోపలకు వస్తున్న కుమార్తెను, ఆమెను సాగనంప వచ్చిన వారిని చూసిన తల్లి హృదయం భగ్గుమంది.

"దేవా! ఎందుకింత ఆలస్యం అయింది? ఇంతసేపూ యేం చేస్తున్నావు? వాళ్ళంతా ఎవరు? ఏమిటమ్మా యిది?"... తల్లి మాటలకు కస్సుమంది కుమార్తె ఈ అవకాశం కోసమే యెదురు చూస్తోంది. తన స్వేచ్ఛా జీవితానికి పెద్ద అడ్డంకి తన తల్లి. ఆమెను ఎంత త్వరగా వదులుకుంటే అంత మంచిది.

"నా యిష్టం. నువ్వెవరవు నన్ను అడగటానికి ఇక నాకూ నీకూ కుదరదమ్మా...నే వెడుతున్నాను" అంటూనే తన వస్తువులు తీసుకుని గుమ్మం దాటింది రాణిబాల. 'దేవా' అంటూ తల్లి ఏడుస్తూ పిలిచింది. రాణిబాల ఆ పిలుపు వినిపించుకోలేదు.

"సరే, దేవా వెళ్ళమ్మా! తిరిగి నీకు తల్లి కావలసిన రోజు తప్పక వస్తుంది. ఆ రోజు కోసమే బతికి వుంటా." కారు రివ్వున సాగిపోయింది. కన్నతల్లి గుండెల్ని చీల్చుకు వచ్చిన దీనాలాపం కారు రొదలో కలిసిపోయింది.

*　　*　　*　　*

కన్నతల్లి కలలన్నిటినీ కల్లలుగా చేసి ప్రపంచంలోని ఆకర్షణల్ని-భోగభాగ్యాలను ఆశించి వెళ్ళిపోయిన రాణిబాలకు జీవితమొక మధుర స్వప్నంగా వున్నది. తాను క్రైస్తవురాలనని దైవభక్తి గల కుటుంబంలో పుట్టానన్న సంగతి ఆమె ఏనాడో మరచిపోయింది. కాని ఆమె తలచని విధంగా... ఆమె జీవన మధుర స్వప్నం చెదరిపోయే ఘడియలు వచ్చాయి. ఆమె క్రమంగా వ్యాధిగ్రస్థురాలయింది. బలహీనమయి వికృతంగా తయారయిన ఆమెను హాస్పటల్ లో పారవేసి మిత్రులు తమ దారి చూచు

కున్నారు హాస్పటలులో ఆమెను పలుకరించి పరామర్శించే వారేలేరు. ఒకప్పుడామె కనుసన్నలలో మెలుగుతూ ఆమెను ఆకాశానికెత్తినవారు కనుచూపు మేరలోకూడ లేరు. మంచంమీద పడుకొని రాణీబాల కుమిలి కుమిలి ఏడుస్తోంది. ప్రేమమయి అయిన తల్లి దీనమయిన పిలుపు ఆమె చెవులకు వినిపించినట్లయినది. అమ్మ! తన ప్రియమైన అమ్మ! అమూల్యమయిన ఆ తల్లి ప్రేమను తాను తిరస్కరించి ఆ తల్లి గుండెల్ని బ్రద్దలు చేసింది. ఇప్పుడు అందరూ తననిచూసి అసహ్యించుకునేవారే; దూరంగా పారిపోయేవారే! కాని అమ్మ. అమ్మ తనని వదలి వేయదు. అమ్మా! నేనిక రాణిబాలను కానమ్మా. నీ దేవప్రియను అమ్మా. ఒకసారి కనుపించమ్మా!... తల్లిని తలచుకుని తలచుకుని ఏడ్చింది దేవప్రియ.

తల్లిని చూడకుండా- తల్లిదగ్గర లేకుండా తానిక ఒక్క క్షణం జీవించలేదు. మంచంమీదనుండి లేచి గేటును తెరుచుకుని రోడ్డుమీదకు వచ్చిపడింది. కొద్దికొద్దిగా చీకటి పడుతోంది. తన కగుపించిన మార్గం వేపు ఉన్న శక్తినంతా కూడదీసుకుని నడవసాగింది. తల్లివుండే యిల్లు చాలాదూరం. ఏలాగైనా ప్రాణాలతో తల్లిని చేరి ఆ తల్లి ఒడిలో కళ్ళు మూయాలని ఆమెలో శేషించినకోరిక.విశాలమయిన మైదానంలోకి వచ్చింది. ఆమె యిక నడవలేకపోయింది. నీరసంతో కాళ్ళు తూలిపోతున్నాయి. చుట్టూకా ప్రశాంత వాతావరణం. శరీరం అతి దుర్భరమై భూమికి ఒరిగిపోయే సమయంలో ఆమెకి యింతకాలమూ తాను మరచిపోయిన ప్రియ ప్రభువు గుర్తుకు వచ్చాడు.

నిలాకాశంవేపు కళ్ళెత్తి- చేతులు చాపుతూ "ప్రభూ! నన్ను క్షమించవా?" అని గొంతెత్తి అరచి తెలియతప్పి ఆ యిసుకలో బోర్లపడిపోయింది. మూసివున్న నేత్రాలనుండి కన్నీరు కాల్వలుగా కారి ఆమె పాపహృదయాన్ని క్షాళితం చేసివేస్తున్నది. యేదో అదృశ్యహస్తం ఆమె శిరస్సును వాత్సల్యంగా నిమిరింది... చల్లగాలి రివ్వున వీచింది. దేవ కళ్ళు

విప్పి చుట్టూ చూసింది. వెన్నెల తెల్లగా వుంది "యేసుప్రభూ! నిన్ను కాదని లోకాన్ని ప్రేమించాను. అందుకు ఫలితం అనుభవించాను. నన్ను త్వరగా అమ్మదగ్గరకు చేర్చు. నీ పాదాలచెంత నాకు ఆశ్రయమీవు" అంటూ మోకాళ్ళూన్చి ప్రార్థన చేసింది. వెంటనే పైకిలేచి ఏదో నూతన శక్తి శరీరాన్ని నింపి వేయగా ఇంటి దెస పరుగెత్తసాగింది. ఇంటి తలుపులు ఇంకా తెరువబడే వున్నాయి. లోపల నుండి దీపపు వెలుగు కనిపిస్తోంది. తల్లి ప్రార్థనలో వున్నది. ఆమె చిరకాల ప్రార్థనకు జవాబుగా- 'అమ్మా!'అనే దీనమయిన పిలుపువినవచ్చింది తల్లికి. ఆమె కళ్ళు తెరిచింది.

తన ప్రార్థనకు జవాబు దొరికిందా? అమ్మా! అనే పిలుపు మళ్ళా వినవచ్చింది తల్లి అతి సంబరంతో గుమ్మంలోకి వచ్చింది ఎదురుగా గుమ్మంలో వికృతమైన రూపంలో చిక్కి శల్యమయిన దేవను చూసి తల్లి రాతిబొమ్మలా నిలుచుండిపోయింది. ఆమె హృదయం బాధతో మూలిగింది. తన ఆశలన్నిటినీ భగ్నం చేసినదీ పాపిష్ఠురాలు. తన కుమార్తెను ఒక పవిత్ర పుష్పమాలగా ఆ దేవుని పవిత్ర పాదాలకు అర్పించుదామని కలలు కన్నది. ఇటువంటి అపవిత్రమైన వసివాడిన పుష్పాన్ని కాదు తాను ఆశించినది. కాదు. ఇదికాదు తాను కోరుకున్నది. ఎదురుగా నున్న దృశం గుండెల్ని కాల్చేస్తుండగా కళ్ళు మూసుకుంది.

"తల్లీ! క్షమించు. నీవును క్షమించ బడుదువు" అని దివ్యవాణి ఆమె హృదయాన్ని తట్టింది. కళ్ళుతెరచి బిడ్డవంక చూచింది.

"దేవా" అంటూ చేతులు చాపింది. "అమ్మా" అంటూ తల్లి ప్రేమమయ కౌగిలిలో యిమిడిపోయి తల్లిఒడిలో అంతులేని ఆనందాన్ని అనుభవించింది దేవప్రియ.

తల్లి సహచర్యంలో నవజీవన పథాన్ని త్రొక్కిన దేవప్రియ అచిరకాలంలోనే ప్రభు పాదసేవకు ఒక పవిత్ర సుమ మాలగా తన్ను తాను అర్పించుకొని ధన్యురాలయింది.

సుశీల వివాహం

కె. విల్సన్
నర్సాపురం

రాజారావ్‌గారు దీర్ఘంగా నిట్టూర్చారు. ఉత్తరం మడచి కళ్ళద్దాలు తీసేసి కుర్చీలో వెనక్కి వాలిపోయారు ఉదాసీనంగా కాసేవు నిశ్శబ్దంగా. అన్యమనస్కంగా కూర్చున్నారు.

"శాంతా" భార్యను పిలిచారు.

"వస్తున్నానండి" జవాబిచ్చింది.

"ఇదో, ఈ ఉత్తరం చదువు."

"ఉత్తరమా? ఎవరు రాసారేమిటి?"

"చదువు. నీకే అర్థమౌతుంది".

"బాబోయ్ ఏమిటిది ? మనం చూస్తే సుశీల వివాహానికి సన్నాహాలు చేస్తున్నాం. అమ్మాయి వరసచూస్తే యిలా వుంది. ఈ పిల్లేకాదు, నాగరికత పేరుతో యీనాడు అమ్మాయిలవరస అంతా యిఁతే — వీళ్ళు ఎప్పుడు ఏం అఘాయిత్యం చేస్తారో ఎవరికి తెలుసు ?"

'తొందరవడకు శాంతా, ఈ ఉత్తరం అబ్బాయి తలిదండ్రులు వ్రాశారు అది కొంతవరకు మంచిదే.'

'అయితే వాళ్ళబ్బాయి, మన అమ్మాయి ఒకర్నొకరు అభిమానించుకొంటున్నారట. అదేఁటి ?'

'అందుకే నేను దాన్ని ఆఫీసు వుద్యోగానికి పంపొద్దని గోలపెట్టాను. అమ్మాయిలు - అందునా అందమైన అమ్మాయిలు ఆఫీసుల్లో ఉద్యోగాలు వెలగబెట్టడం ఈనాడు క్షేమకరం కాదంటే నువ్వు విన్నావా ?'

శాంత బదులుపలక లేదు. మాట మారుస్తూ, "అబ్బాయి తండ్రి కుర్రాడి చదువు, ఉద్యోగం, జీతం విషయాలు మాత్రమే చెబుతున్నాడు. 1200/- జీతం. పరవాలేదు. అయితే ఆ కుర్రాడు ఎలా వుంటాడో, ఆరోగ్యం ఎట్టిదో, కుటుంబ సాంప్రదాయం ఏవిఁటో ? మరి ముఖ్యంగా అబ్బాయి ఎలాంటివాడో ? ఈ సంగతులేమీ మనకు తెలియవుగదా ?"

'బహుశా ఈ వ్యవహారం చాలవరకు వెళ్ళి వుంటుంది. ఎందుకయినా మంచిది. ఒకసారి నువ్వు సుశీలతో ప్రత్యేకంగా మాట్లాడి అంతా తెలుసుకో.'

"అలాగే ! పిల్ల ఎంతకైనా తగిందే. ఇంత వ్యవహారం నడుపుతూ ఏమీ తెలీని సంగనాచిలా వుంటోంది చూశారా ?"

రాజారావ్‌గారు చేతికర్ర తీసికొని 'ఈవెనింగ్ వాక్'కు మామూలుగా బయలుదేరారు.

మారు మాట్లాడక రాజారావ్‌గారు బయటికి వెళ్ళిపోయారు. శాంతకు ఏమీ పాలుపోవడంలేదు. పని ముట్టుకోలేక పోతోంది. గడియారం ఆరు కొట్టింది. సుశీల రాలేదు. ఆరూ పదిహేనయ్యింది. ఆమె యింకా రాలేదు. ఆరున్నర! ఆరూ నలభైయ్యయిదు అయ్యింది. సుశీల ఎట్టకేలకు వచ్చింది. ఆటోరిక్షాలోనుండి కిందికి దిగింది.

వెన్నలాంటి మృదువైన అమ్మ ఈవేళ అదోలా వుంది. "ఆరూ నలభైయ్యయిదు అయిందేం?" తల్లికంఠం హెచ్చుస్థాయిలో వినబడింది. క్రొత్త క్రొత్త స్నేహాలు ఎక్కువయ్యాయి గామాలు! మరి టైం ఎలా తెలుస్తుంది? మహారాజా కూతురివి. ఆటోరిక్షాల్లో తిరక్కపోతే ఏం చేస్తావ్!"

"అమ్మా, ఏమిటి? నీవంటున్న మాటలేమిటి?" సుశీల కళ్ళల్లో నీళ్లు గిర్రున తిరిగాయ్. ముఖం వాడిపోయింది. "ఎలక్ట్రిక్ ట్రైయిన్ చెడి పోయింది. బస్‌స్టాండ్ వరకు నడిచి వచ్చా. బస్సులు దొరకలేదు. చీకటి పడుతోందని భయంవేసి ఆటోలో వచ్చా."

'నీకా భయం? భయం వుంటే యిలాటి పనులు చేస్తావా? ముందు ముఖం కడుక్కొని వచ్చి ఈ టీ తాగు.'

పదినిమిషాల్లో సుశీల టీ కోసం వచ్చింది. ఎప్పుడూ తనతో టిఫిన్ తీసికొనే తల్లి అక్కడ లేదు. పని చేసికొంటోంది. తల్లి ప్రవర్తన సుశీలకు అంతుపట్టడం లేదు. అడగడానికు ధైర్యం సరిపోవడం లేదు.

సుశీల టీ తాగుతోంది. 'నువ్వింలా పిచ్చిపిచ్చి వేషాలెందుకు వేస్తున్నావ్?'

వంటింటిలోంచి వురిమింది అమ్మ.

"ఏం నేనేం చేశాను?"

"నువ్వు, అశోక్ చేస్తున్నదంతా మాకు తెలిసింది. అసలీ అశోక్ ఎవడు?"

'మీకేం తెలిసింది ? అశోక్ మా ఆఫీసరు ?'

'అయితే నువ్వు అతనికి ఆంతరింగిక కార్యదర్శివి కదూ ?'

"ఔను."

'అతనితో ఏకాంతంగా నువ్వు మాట్లాడుతూవుంటావు కదూ ?'

"లేదు. నాకు నేనుగా ఎప్పుడూ అయనతో మాట్లాడ్డానికి ప్రయత్నించను !"

"నిన్ను అతడు ఏదోవిధంగా, లోకువచేయడానికి చూస్తుంటాడు కదూ ?"

"అలాంటివేమీ లేదు. ఆయన చాల మంచివాడు. మర్యాదస్తుడు. నన్ను చాల గౌరవిస్తాడు."

"నీకు అతనంటే చాల యిష్టం కదూ ?"

"కాదు. ప్రత్యేకించి చెప్పుకోదగ్గ అభిమానం అంటూ ఏమీ లేదు. అయితే ఆయనే ఒకరోజు మంచి చాక్లెట్ల డబ్బాతెచ్చి తీసికోమని నన్ను బలవంతం చేశారు."

"మంచి చాక్లెట్లన్నమాట ! మరి నువ్వు తీసికొన్నావా?"

"లేదు. నేనెలా తీసికోగలను ? వద్దన్నాను."

"అప్పుడతడు ఏమన్నాడు?"

"ఏం అనలేదు. చాల బాధపడ్డట్టుగా కనిపించారు. మెల్లగా వెళ్ళిపోయాను."

"అప్పుడు ఆ గదిలో నీతో యింకెవ్వరూ లేరా ?"

"లేరు ఆయనా, నేనుతప్ప. ఆంతరంగిక కార్యదర్శిని గనుక నేను ఒంటరిగానే వుంటాను."

"ఆ మాట ముందు నాకెందుకు చెప్పలేదు ?"

"చెప్పవలసినంత అవసరం కనిపించలేదు. నాకు భయంగా వుంటే తప్పక చెప్పివుండేదాన్ని."

'అప్పుడప్పుడూ అతడు నీతో అనవసరంగా రాసుకుంటాడుగదూ?'

"ఆలాటి చౌకబారు మనిషికాడు ఆయన; ఎంతసేపూ ఆయనకు పనిమీదే ధ్యాస. ఆయన టేబిలుమీద ఎప్పుడూ ఫైల్సు కుప్పలుగా పడి వుంటాయి. ఆ ఉత్తరాలన్నీ చదివి సంతకాలు పెడుతూ, గుమాస్తాలు తప్పులు వ్రాస్తే నాకు చదివి వినిపిస్తుంటారు. నేను నవ్వి వూరుకుంటాను. అంతే."

"చాక్లెట్‌లు మాత్రమేనా, యింకేమైనా యివ్వజూశాడా ?"

"ఓసారి ఒక నవల తెచ్చాను; అది చక్కని ప్రేమకథ అనీ, నాకో సమే కొన్నానని ఆయన అన్నారు."

"నువ్వు తీసికొన్నావా ?"

"నేనెలా తీసికొంటానమ్మా ?"

"నీపనిలో తప్పులు పట్టడానికి అతడు ప్రయత్నం చేయటం లేదా?"

"లేదు. నాకు జీతం యిస్తున్నది నా పనిని శ్రద్ధగా చేయడానికి. ఆ విషయంలో నేను చాల మెళకువగా వుంటాను."

"ఆఫీసులో తతిమ్మా అమ్మాయిలతో అత నెలా వుంటాడు? వాళ్ళతో సరసాలాడుతుంటాడా ?"

"అలాటి సరసాలేమీ లేవు. పైగా వాళ్ళతో ముక్తసరిగ ఏవో రెండు మాటలు మాట్లాడి పంపేస్తారు. వాళ్ళు తన టేబిలువద్ద వున్నంతసేపూ ఏదో ముళ్ళమీద వున్నట్లు ఫీలవుతారు."

"మళ్ళీ ఎప్పుడైనా అతడు నీతో చనువుగా మాట్లాడాడా ?"

"ఒకరోజున బస్‌స్టాండ్‌వద్ద బస్‌కోసం ఒంటరిగా కనిపెట్టుకొని ఉన్నాను. ఆయన కార్లోవెడుతూ నన్నుచూచి, కారుఆపి కారు ఎక్క-

మన్నారు. అందుకు నేను ఒప్పుకోలేదు. 'నువ్వు రావని నాకు ముందే తెలుసు' అంటూ ఆయన వెళ్ళిపోయారు."

"మరి నువ్వెందుకు కారెక్కలేదు?"

"నువ్వేకదమ్మా, ఎవరైనా కారుమీద తీసికెల్తానంటే వెళ్ళొద్దన్నావు ?"

"ఔనౌను, మరచిపోయాను," ఆమె మాటలు యిప్పుడంత కటువుగా లేవు. "అతనెలా వుంటాడు చూడ్డానికి ?"

"బాగానే వుంటారు, ఎత్తుగా, ఎట్టిగా, అందంగా..."

"ఇప్పుడు నాకు బాగా అర్థమౌతోంది సుశీలా, నువ్వంటే అతనికి చాల యిషం అన్నమాట. ఏమంటావ్ ?"

"ఏమోమరి?"

"అతని తలిదండ్రులు మాకు ఉత్తరం వ్రాశారు. వాళ్ళబ్బాయికి నిన్ను యివ్వమంటున్నారు."

సుశీల నవ్వి, సిగ్గుతో తల దించేసుకుంది.

"సుశీలా, నీవంటి సుగుణవంతురాలికి తల్లినైనందుకు నాకు చాల చాల ఆనందంగా వుందమ్మా. ప్రార్థన చేద్దాం. గదిలోకి వస్తావా ? దేవుని సమస్త కృపలకు అయనకు స్తుతి చెల్లిద్దాం, ఈ కార్యాన్ని అయనే కొన సాగించాలి."

అశోక్ సుశీలల పెళ్ళి ఏర్పాటైంది. ఆలయంలో వాతావరణం పరిశుద్ధంగా, పవిత్రంగా, ఉల్లాసంగా వుంది. సుశీల తెల్లటి పట్టుచీరలో, మేలిముసుగులో దేవదూతలా వుంది.

బహుమతి

పి. ఏ. రాజు (అజీజ్)

నిజామాబాదు

పార్కింగ్ ప్లేస్‌లో కారాపి, రిస్టువాచీ చూసుకున్నాను. ఉదయం ఆరున్నర కారు దిగి, పైట నిండుగా కప్పుకుని డోర్స్ లాక్ జేశాను. అది బేగంపేట విమానాశ్రయం.

ఆకాశాన్నంతా తెల్లని మబ్బులు కమ్మి ఉన్నాయి. నస్సని పొగ మంచు పరిసరాలని ఆవరించి ఉంది. ఆరున్నరైనా, ఇంకా సూర్యోదయం కానట్టే ఉంది. చల్లని చలి!

పైట కొంగు తలమించి నిండుగా కప్పుకుని, వడివడిగా ఎంక్వైరీ కేసి నడిచాను. ఎంక్వైరీ కౌంటర్‌దగ్గర అట్టే రద్దీలేదు. నన్ను చూడగానే-

"ఎస్?" అంది నలభై ఏళ్ళ ఆంగ్లో ఇండియన్. "ఫిల్లీకోయింగ్ ఎప్పుడు లాండ్ అవుతుంది?" అడిగాను. ఆవిడ రిస్టువాచీ చూసుకుని- "బైలుదేరి ఉంటుంది. సరిగ్గా ఎనిమిదీ నలభైకి ఇక్కడ చేరాలి," అంది.

"థాంక్స్" అంటూ వెనుదిరిగి వెయిటింగ్ హాలువైపు నడిచాను. ఓ, సోఫాలో కూర్చుని వానిటీబాగ్ తెరిచాను. మడత పెట్టిన ఉత్తరాన్ని తీసి మరోమారు చూసుకున్నాను

"డియర్ కారదా,

మీ దయవల్ల నా రీసెర్చ్ విజయవంతంగా ముగిసింది. వెంటనే బైలుదేరు తున్నాను. ఫిబ్రవరి రెండవ తేదీన అక్కడికి చేరుకుంటాను. నిన్ను ఆశ్చర్యపరిచే బహుమతి ఒకటి నా వెంట ఉంది. రిసీవ్ జేసు కుంటావు కదూ?

నీ—

రాజు

ఉత్తరాన్ని మడుస్తూ నవ్వుకున్నాను. పిచ్చి భావ. 'రిసీవ్ జేసు కుంటావు కదూ?' అంటూ నన్ను అర్థించాలా? రెండేళ్ళనించీ, తన రూపాన్నే కళ్ళల్లో ఫ్రేం కట్టుకుని రోజులు లెక్క పెడుతూ అభిసారి కలా నిరీక్షిస్తున్నానని తెలీదా?

నేను బావని ప్రేమించడం లేదు. అరాధిస్తున్నాను. మనసనే మందిరంలో ప్రతిష్టించుకుని పూజిస్తున్నాను.

నా పదేళ్ళ ప్రాయంలో అమ్మ పోయింది. లేక లేక పుట్టానని నాన్న ఎంతో ముద్దుగా పెంచేడు నన్ను. బావ ఎవ్వరో పరాయి వాడు కాడు. స్వంత మేనత్త కొడుకు.

మామయ్య నేవీలో పనిజేసేవాడు. బావ పదేళ్ళ వయసులో మామయ్య దుర్మరణం పాలయ్యాడు. వాళ్ళకి ఆట్టే చెప్పుకో తగ్గ ఆస్తి

పాస్తుల్లేవు. ఆయన పోయిన రెండేళ్ళకే మనో వ్యాధితో అత్తయ్య పోయింది.

ఏ నీడా లేక, ఏకాకిగా మిగిలిన బావను నాన్న చేరదీశాడు. అప్పుడతనికి పన్నెండేళ్ళు. తల్లీ తండ్రీ పోయారన్న దిగులుతోనో, ఒకరి దయాదాక్షిణ్యాల మీద బ్రతుకుతున్నాననే భావంతోనో ఎప్పుడూ ముభావంగా, ఉండేవాడు. చాలా సిన్సియర్‌గా, సీరియస్‌గా చదువుకునే వాడు. మంచి మార్కులు వచ్చేవి.

ప్రాకులు వేసుకునే వయసునుంచే అతని మీద అవ్యాజ్యమైన అభిమానం పెంచుకున్నాను. వయసు పెరుగుతున్న కొద్దీ ఆ అభిమానం కాస్తా ఆరాధనగా మారింది. ఇంటర్ బి.పి.సి లో ఫస్టు రావడంతో బావకి మెడిసన్ చదవాలన్న కోరిక తీవ్రమయింది.

నాన్న వెంటనే అతన్ని మెడిసిన్ ఎంట్రెన్స్ పరీక్షకి పంపేడు. అందులోనూ ఫస్టు రావడంతో బావకి సులభంగానే సీటు దొరికింది ఎంతో కష్టపడి చదివాడు. యూనివర్సిటీ ఫస్టు వచ్చాడు. స్కాలర్‌షిప్ సంపాదించి రీసెర్చ్ కోసం లండన్ వెళ్లాడు. నేను బి.ఏ.తో ఆపేసాను.

నాన్నకి బావ మీద ఎనలేని అభిమానం. అతను ఫారిన్‌నించి రాగానే, మమల్ని ఏకం చేయ్యాలని ఎంతో ఆశతో ఉన్నాడు. ఈనాటికి నా తపస్సూ, కలలూ ఫలించాయి. బావ వస్తున్నాడు. బావ రూపు కళ్ళల్లో మెదులుతోంది.

రిస్టు వాచీ చూసుకున్నాను. ఏడుంబావు.

ఎంత సున్నితంగా ఊరడించేడు నన్ను !

'శారూ ! మనిషి జీవితంలో కష్టపడే రోజులివే. ఈ వయసులోనే శ్రమించి భావి జీవితానికి బంగారు పునాదులు వేసుకోవాలి. ఏ దిక్కూ లేని నన్ను చేరదీసి ఇంతవాణ్ణి జేశారు. నా దీక్షా, మీ ప్రోత్సాహం నన్నీ స్థితికి తెచ్చాయి. మీ ఋణం ఎన్ని జన్మలెత్తినా తీర్చలేనిది. మనం

ఏకం కావడానికి ఇంకా ఎంతో కాలం పట్టదు. కేవలం రెండేళ్ళు. ఈ రెండేళ్ళూ కాస్త ఓపిగ్గా నెట్టుకు పోవాలి. నా దీక్ష ముగియడానికి నీ సహకారం ఎంతో అవసరం కదూ?'

ఆ మాటలు నా ఆవేదనని పటాపంచలు చేసేయి. అతన్ని ప్రోత్స హిస్తూ చిరునవ్వుతో వీడ్కోలు చెప్పేను.

"అటెన్షన్ ప్లీజ్: కలకత్తా నుండి వచ్చే బోయింగ్ సెవెన్ జీరో సిక్స్ కొద్ది నిమిషాలలో దిగబోతోంది." స్పీకర్‌లోంచి ఎనౌన్సర్ కంఠం కమ్మగా వినిపించింది.

టైం చూసేను. ఏడూ ముప్పై వీడు.

వానిటీ బేగ్‌లోంచి షెర్లాక్ హోమ్స్ నవల తీసేను. బావ నా సన్నిధిలో వాలడానికి కేవలం ఒక్క గంటే ఉన్నా, టూపిరి సలపనివ్వ కుండా మనసు కొట్టుకుంటోంది.

పావుగంట గడిచిందో లేదో - "అటెన్షన్ ప్లీజ్" అన్న వాక్యం విని స్పీకర్స్ వైపు చూశాను.

"ఈ దుర్వార్త చెప్పడానికి మే మేంతో విచారిస్తున్నాం. ఢిల్లీనుండి బైలుదేరిన సెవెన్ జీరో నైన్, ఇటార్సీ ప్రాంతంలో ఉన్న అడవిలోయల్లో ప్రమాదవశాత్తూ కూలిపోయింది."

అంతే: విమానాశ్రయంలో కోలాహలం చెలరేగింది. ప్రశాంతంగా ఉన్న వాతావరణం భయాందోళనలతో నిండిపోయింది. నా గుండెలో గుర్రాలు దౌడుదీస్తున్నాయి. కాళ్ళ కింద భూమి పగిలిపోయిందేమో: నేనందులో కూరుకు పోతానేమో: నిజమా? ఇది నిజమేనా: నా చెవులు నన్ను మోసం జేస్తున్నాయా: లేదు. అలా జరగడానికి వీల్లేదు. దడదడ లాడుతున్న గుండెతో ఎంక్వైరీ వైపు పరుగు తీసేను.

ఆవిడ ముఖం నిషాదంతో నిండి ఉంది. "ఇటీజ్ రియల్లీ ఏ షాకింగ్ మెసేజ్:" అంది వణుకుతున్న పెదాలతో.

నా కంఠం పెగలడం లేదు.

"ప్లీజ్ డోంట్ డిసప్పాయింట్ యువర్ సెల్ఫ్. ప్రయాణీకులతో ఎందరు మరణించేరో, ఎందరు సజీవంగా ఉన్నారో ఇంకా వివరాలు తెలియలేదు. మీరెవరికోసం ఎదురు చూస్తున్నారు?"

"మిస్టర్ రాజు," వణుకుతున్నాను. కింద పడిపోతానేమో, నా ఆశా సౌధం కూలిపోయిందా? నా స్వప్నాల హర్మ్యం పునాదులతో సహా నేల పాలవుతుందా? లేదు అలా జరగడానికి వీల్లేదు. భగవంతుడు నిర్దయుడు కాడు. బావ క్షేమంగా ఉన్నాడు. అతనికే ఆపదా లేదు అ ఆశతోనే, లేని సత్తువ కూడదీసుకుంటూ నిల్చున్నాను.

ఎంక్వైరి క్లర్క్ ఫోనులో నిర్విరామంగా అధికారులతో మాట్లాడుతోంది. గంట తరవాత రిసీవర్ క్రేడిల్ జేసి చెప్పసాగింది. "అయామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారీ మిస్; విమాన సిబ్బందితో సహా ప్రయాణీకులందరూ మరణించారు. అందులో, మీరు ఎదురు చూస్తున్న మిస్టర్ రాజు, ఆయన భార్య మిసెస్ గ్లోరియా రాజు కూడా ఉన్నారు."

నా చెవుల్ని నేను నమ్మలేక పోయాను.

ఆమె చెప్పిన నగ్న సత్యం వినకపోయినా బాగుండును. బావపట్ల నా ఆరాధన శాశ్వతంగా నిలిచిపోయేదేమో; గుండె ఒక్కసారి ఆగిపోతే ఎంత బావుండు. బావ నా కింత ద్రోహం జేశాడా? బాల్యంనుంచీ పెంచుకున్న ఆరాధనను నిలువునా నేలమట్టం జేశాడా? ఎలా నమ్మను? బావ ఒక బ్రిటిష్ యువతిని పెళ్ళాడాడా? నాకోసం తెస్తానన్న బహుమతి అదేనా? మనసు ముక్కచెక్కలై పోయింది.

ఏడవాలని లేదు. కానీ, కన్నీళ్ళు వాటంతటవే జల జల రాలుతున్నాయి. పమిటతో వాటిని తుడిచివేస్తూ, లయ తప్పిన హృదయాన్ని కూడదీసుకుంటూ పార్కింగ్ ప్లేస్ వైపు నడిచేను.